సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+16 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 13 సంచిక: 20

SUNDAY Special | ఆదివారం | 12-4-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



**ఒంటరి నక్షత్రం..**
కరోనాను మించింది ఒంటరితనం.
ఆ ఒంటరితనాన్నే.. జయించింది స్నేహ..
– ఫ్యామిలీలో



**ఆన్‌లైన్ షూటింగ్..**
ఈనెల 15న ఆన్‌లైన్‌లో పోటీపడనున్న అంతర్జాతీయ షూటర్లు
– స్పోర్ట్స్‌లో

# ఏప్రిల్ 30 దాకా.. లాక్‌డౌన్ పొడిగింపు..

## రాష్ట్ర కేబినెట్ నిర్ణయం.. పరిస్థితి కుదుటపడే వరకు యథాతథ స్థితి: కేసీఆర్

- వ్యవసాయం, అనుబంధ రంగాలకు మాత్రం మినహాయింపు
- ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నా
- ఆ తర్వాత దశలవారీగా లాక్‌డౌన్ ఎత్తివేత యోచన
- ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు దేశానికి 10 లక్షల కోట్లు కావాలి
- 243 ప్రాంతాల్లో కరోనా కట్టడికి కంటైన్మెంట్
- ఏప్రిల్ 15 వరకు ప్రాజెక్టుల కింద సాగునీరు అందిస్తామని వెల్లడి



ప్రగతిభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి తలసాని

సాక్షి, హైదరాబాద్

'రాష్ట్రంలో ఏప్రిల్ 30 వరకు లాక్‌డౌన్ పొడిగిస్తున్నాం. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని కచ్చితంగా అమలు చేస్తాం. ఇది సమాజం, మన పిల్లలు, భవిష్యత్తు సంక్షేమం కోసం కాబట్టి అందరూ సహకరించాలి. అన్ని మతాలు, కులాలు, వర్గాలు సామూహిక కార్యక్రమాలను మానుకోవాలి. మీరు నష్టపోయి, సమాజానికి నష్టం చేయొద్దు 'అని సీఎం కె. చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాలం కలిసొస్తే ఏప్రిల్ 30 తర్వాత దశలవారీగా లాక్‌డౌన్ ఎత్తివేతపై ఆలోచిస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో శనివారం ప్రగతి భవన్‌లో రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై కోవిడ్–19 వైరస్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై కీలక నిర్ణయాలు తీసుకుంది. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. అలాగే అంతకుముందు ప్రధాని మోదీ అన్ని రాష్ట్రాల సీఎంలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున చేసిన డిమాండ్లను కేసీఆర్ వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

**వ్యవసాయానికి మినహాయింపు...**

లాక్‌డౌన్ సమయంలో వ్యవసాయానికి అనుమతి ఉంటుంది. లేకపోతే మనకు బువ్వ దొరకదు. ధాన్యం వచ్చింది... కోతలు జరగాలె... పంటంతా చేతికి రావాలె... ఎఫ్‌సీఐకి పోవాలె. అదంతా జరగాలె. ధాన్యాన్ని ప్రాసెసింగ్ చేసే రైస్‌మిల్లులు నడుస్తాయి. వాటికి అనుమతిస్తాం. పిండిమరలకు అనుమతి ఉంటుంది. ఆయిల్ సీడ్స్‌ను నూనెగా చేసే మిల్లులుంటాయి. ఆహార సంబంధిత అనుమతి ఇస్తాం. కూరగాయలు రావాలన్నా వ్యవసాయం అవసరం. మన దేశ జనాభా దాదాపు 135 కోట్లు. ప్రపంచంలోనే భారత్‌కు అన్నంపెట్టే శక్తి ఏ దేశానికీ లేదు. మన దేశాన్ని ఎవరూ సాకలేరు. ఎందుకంటే తెలంగాణ కంటే 100 దేశాలు చిన్నగా ఉన్నాయి. ఏ దేశం మనకు అన్నం పెడుతుంది? విశాల భారతానికి ఎవరూ అన్నం పెట్టలేరు. ఆహారంలో

మిగతా 2వ పేజీలో ▶

శనివారం అన్ని రాష్ట్రాల సీఎంలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ



**భారత్‌లో..**

1,035 — 24గంటల్లో కరోనా కేసులు..

7,529 — మొత్తం కేసులు..

40 — ఒక్కరోజే మరణాలు

242 — మొత్తం మరణాలు



శనివారం అర్ధరాత్రి 12గం. దాకా (భారత కాలమానం ప్రకారం)

**ప్రపంచ వ్యాప్తంగా..**

17,63,578 — మొత్తం కరోనా కేసులు..

1,07,781 — వైరస్‌తో మరణించిన వారు..

**అమెరికాలో..**

5,22,320 — మొత్తం కేసులు..

20,086 — మొత్తం మరణాలు..

# పొడిగింపే!

**లాక్‌డౌన్‌పై సీఎంలందరి నుంచి ఏకాభిప్రాయం**

- కరోనా ప్రభావం లేని ప్రాంతాల్లో ఆంక్షలు సడలింపు!
- తద్వారా నిలిచిపోయిన ఆర్థిక వృద్ధి మళ్లీ పట్టాలెక్కే చాన్స్
- ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్

"లాక్‌డౌన్ ప్రకటించినప్పుడు ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రభుత్వాల ప్రాధాన్యమని చెప్పాం. అయితే ఇప్పుడు ప్రభుత్వాల లక్ష్యం ప్రాణాలను కాపాడటంతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థను(జాన్ భీ.. జహాం భీ) కాపాడటం కూడా..

నా మాటలను అర్థం చేసుకున్న దేశప్రజలు లాక్‌డౌన్ నిబంధనలను పాటించారు. ఇప్పుడు ప్రాణాలతో పాటు దేశాభివృద్ధిపైనా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. కరోనా కట్టడిలో కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పని చేస్తున్నాయి.

8లో

డాక్టర్లపై దాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. కోవిడ్ 19కి వ్యాక్సిన్, చికిత్స లేనందున భౌతిక దూరం పాటించడం, వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి. వ్యవసాయ మార్కెట్లలో రద్దీని తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. దేశం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించడానికి ఈ సంక్షోభాన్ని ఉపయోగించుకోవాలి. - ప్రధాని మోదీ

# 1-9 వరకు అందరూ పాస్

**'టెన్త్'పై మరికొన్ని రోజుల్లో నిర్ణయం**

**ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడి**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో కరోనా వ్యాప్తి నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు ప్రకటించిన సెలవులు కొనసాగుతుండటం, ఫలితంగా వార్షిక పరీక్షలను ఇప్పట్లో నిర్వహించే అవకాశం లేకపోవడంతో సీఎం కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఒకటి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులంతా పాసైనట్లేనని ప్రకటించారు. ''ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో డిటెన్షన్ విధానం లేదు కాబట్టి విద్యార్థులంతా పాస్ అయినట్లే ప్రకటిస్తున్నాం. ఇతర రాష్ట్రాల తరహాలో విద్యార్థులను పై తరగతులకు ప్రమోట్ చేయాలి. ఈ విషయంలో తల్లిదండ్రులకు బెంబేలు, చింత అవసరం లేదు''అని కేసీఆర్ పేర్కొన్నారు. అయితే మధ్యలో ఆగిపోయిన పదో తరగతి పరీక్షల నిర్వహణపై మాత్రం మరికొన్ని రోజులు ఆగి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

# మరో 16 పాజిటివ్

## 503 కు చేరుకున్న కరోనా కేసుల సంఖ్య..

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో మరో 16 కరోనా పాజిటివ్ కేసులు నమోదైనట్లు ప్రభుత్వం శనివారం వెల్లడించింది. అలాగే మరో ఇద్దరు చనిపోయారు. ఈ మేరకు ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు బులెటిన్ విడుదల చేశారు. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 503కు చేరింది. ఇందులో శనివారం 51 మందిని డిశ్చార్జి చేయగా, మొత్తంగా ఇప్పటివరకు 96 మందిని డిశ్చార్జి చేసినట్లైంది. అలాగే మృతుల సంఖ్య 14కు చేరింది. ఇక 393 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇటు ఇంకా 1,654 మంది క్వారంటైన్‌లో ఉన్నారు. ఇప్పటివరకు 27 జిల్లాల్లో వైరస్ వ్యాపించగా, మిగిలిన జిల్లాల్లో కొత్త కేసులు ఏమైనా వచ్చాయా అన్న సమాచారం కూడా వైద్యాధికారులు వెల్లడించలేదు. కాగా సూర్యాపేట జిల్లాలోనే కొత్తగా ఒక్కరోజే 11 పాజిటివ్ కేసులు బయటపడ్డట్లు సమాచారం.

- మరో ఇద్దరు మృతి.. 51 మంది డిశ్చార్జి
- మొత్తం 14కు చేరిన మరణాల సంఖ్య
- ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నవారు 393 మంది
- దాదాపు రెండింతలు పెరిగిన కంటైన్మెంట్ జోన్లు..

**హైదరాబాద్‌లోనే ఇద్దరు..**

ఇక శనివారం మృతి చెందిన వారిలో హైదరాబాద్‌లోని బహదూర్‌పూర్‌కు చెందిన 70 ఏళ్ల వ్యక్తి ఉన్నారు. మర్కజ్‌కు వెళ్లిన ఈయన కరోనా బారిన పడటంతో మార్చి చివరి వారంలో గాంధీ ఆస్పత్రిలో చేరారు. ఇటు నగరంలోని షేక్‌పేట బృందావన్ కాలనీకి చెందిన మరో వృద్ధుడు (73) కూడా మృతి చెందాడు. ఆయన

మిగతా 2వ పేజీలో ▶

# మీ వ్యూహంతో ముందుకు



- ఈ యుద్ధాన్ని ఎదుర్కోవడానికి ఒక్కటిగా ఉండాలి
- కరోనా కట్టడికి రాష్ట్రంలో పటిష్ట చర్యలు..
- ప్రధానితో వీడియో కాన్ఫరెన్స్‌లో ఏపీ సీఎం వైఎస్ జగన్

11లో

**ఆంధ్రప్రదేశ్..**

24 — శనివారం నమోదైన కరోనా పాజిటివ్ కేసులు..

405 — రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం పాజిటివ్ కేసులు..


NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb CHICKEN

సూచించిన నేటి గుడ్డు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు

గుడ్డు రిటైల్ ధర ₹ 48 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ 85 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో 155 కిలో | రిటైల్ లైవ్ బర్డ్ 107 కిలో | స్కిన్‌లెస్ 177 కిలో


**ఇదంజగత్**





అబ్బ! కరోనా గురించి కాదయ్యా ఆ బాధ.. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను తీసేసారని!!

**వైరస్ మాటున**

# లిక్కర్ దందా!

- రాష్ట్రంలో 20 రోజులుగా లాక్‌డౌన్ ఉన్నా బ్లాక్‌లో యథేచ్ఛగా అమ్మకాలు
- 2-3 రెట్ల అధిక ధరలకు విక్రయిస్తున్న వైన్‌షాపుల యజమానులు
- మందుబాబుల బలహీనతను ఆసరాగా చేసుకొని కాసుల వేట..
- ఎక్సైజ్ శాఖ షాపులు సీజ్ చేయక పోవడంతో స్టాక్ ఖాళీ చేసిన వైనం

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో కరోనా లాక్‌డౌన్ కొనసాగుతున్నప్పటికీ మద్యం ప్రియుల బలహీనతను ఆసరాగా చేసుకొని గత 20 రోజులుగా యథేచ్ఛగా లిక్కర్ దందా సాగుతోంది. ఏ బ్రాండ్ ఫుల్ బాటిల్ కావాలన్నా బ్లాక్‌లో రెండు నుంచి మూడు రెట్లు ఎక్కువ ధరకు లభిస్తోంది. ఈ పరిణామం వైన్‌షాపుల యజమానులకు, దళారులకు కాసుల పంట పండిస్తోంది.



**దొడ్డిదారి... దుడ్లు రాలి**

కరోనా వైరస్ నియంత్రణ కోసం ప్రధాని మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా మార్చి 22న జనతా కర్ఫ్యూ విధించగా ఆ రోజున రాష్ట్రం లోని వైన్‌షాపులన్నీ మూతపడ్డాయి. కానీ అదే రోజు సీఎం కేసీఆర్ రాష్ట్రంలో మార్చి 31 వరకు లాక్‌డౌన్ ప్రకటించడంతోపాటు వైన్‌షాపుల మూసివేతకు ఆదేశించారు. అందుకు అనుగుణంగా సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ఎక్సైజ్ శాఖ మాత్రం అధికారికంగా ఎలాంటి ప్రకటనా విడుదల చేయలేదు. దీంతో వైన్‌షాపులను మూసేయాలని ప్రకటించినా వాటిని సీజ్ చేయలేదు. ఈ పరిణామమే లిక్కర్ వ్యాపారులకు కలిసొచ్చింది. అధికారికంగా ఎక్సైజ్ అధికారులు షాప్‌లు సీజ్ చేయకపోవడంతో దొడ్డిదారిన షాపుల్లోని సరుకును బ్లాక్‌మార్కెట్‌కు మళ్లిస్తూ రెండు, మూడింతల ధరకు దళారుల సాయంతో విక్రయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎందుకంటే వైన్‌షాపుల్లో కాకుండా వ్యక్తిగతంగా దాచుకొనే సరుకు 20 రోజులపాటు మార్కెట్‌లో ఉండదని, వైన్‌షాపుల నుంచి సరుకు బయటకు వచ్చినందునే ఇన్ని రోజులు మార్కెట్‌లో మందు దొరికిందని, ఇప్పుడు దాదాపు వైన్ షాపులు ఖాళీ అయ్యాయని ఎక్సైజ్ వర్గాల్లోనే చర్చ జరుగుతోంది. అయితే ఎక్సైజ్ వర్గాలు ఈ విషయంలో కళ్లు మూసుకొని వ్యవహరించారని, చిన్న, చిన్న కారణాలతో షాపులు తెరిచేందుకు కూడా (అమ్ముకొనేందుకు కాదు...సరుకు తరలించేందుకు) అంగీకరించారనే విమర్శలు కూడా లేకపోలేదు. ఎక్సైజ్ శాఖ ఉదాసీనత వల్లే వైన్‌షాపుల యజమానులు గుట్టుచప్పుడు కాకుండా మద్యాన్ని మళ్లించారనే చర్చ జరుగుతోంది.

**చెప్పేదొకటి.. జరిగిందొకటి**

కరోనా లాక్‌డౌన్ వల్ల తమకు రూ. లక్షల్లో నష్టాలు వస్తున్నట్లు వైన్‌షాపు యజమానులు పైకి చెబుతున్నా లోలోపల మాత్రం సంబరపడుతున్నారని, కరోనా కాసులు మరికొన్నాళ్లు కురిస్తే బాగుండని అంతర్గతంగా చర్చించుకుంటున్నారని తెలుస్తోంది. 'జనతా కర్ఫ్యూ తెల్లారి షాపులు తెరుద్దామనుకుంటే అదే రోజు లాక్‌డౌన్ అని చెప్పి షాపులు బంద్ చేయమన్నరు. గుండె గుభేల్ మంది. కానీ షాపులు సీజ్ చేయలేదు కాబట్టి బతికిపోయాం. షాపులోని సరుకు

మిగతా 2వ పేజీలో ▶


ఈస్టర్ శుభాకాంక్షలు

శుభమ్ కలుగుగాక

"సంఘ క్షేమము కొరకు తన ప్రాణమును అర్పించి తిరిగి సజీవుడై లేచినాడు" – లూకా 24:46

ఇప్పుడు Triple X Silver Foam వాషింగ్ పౌడరు





క్రొత్త ఫార్ములా
క్రొత్త రూపం
క్రొత్త శక్తి

With Anti Bacterial

భారతి కన్స్యూమర్ కేర్ ప్రోడక్ట్స్ ప్రై.లి.

# లిక్కర్ దందా!

▶ మొదటి పేజీ తరువాయి

ఎలాగోలా బయటకు తీసుకొచ్చి అమ్మేసినం. రెండు, మూడు రోజులైనా వెసులుబాటు ఇస్తే బాగుండు. డిపోల నుంచి స్టాక్ తెచ్చి పెట్టుకోవచ్చు. ఇప్పటిలాగే రూపాయికి రెండు, మూడు రూపాయిలకు అమ్ముకోవచ్చు... పైపెచ్చు సాధారణ పరిస్థితి రాగానే ఎన్ని రోజులయితే లాక్‌డౌన్ చేశారో... అన్ని రోజుల లైసెన్స్ పొడిగించాలని కరోనా పరిహారం కింద డిమాండ్ చేయొచ్చు'అని వైన్‌షాపుల యజమానులు అంతర్గతంగా మాట్లాడుకుంటున్నట్లు సమాచారం.

**బార్ల యజమానులు విలవిల...**

రాష్ట్రంలో వైన్‌షాపుల యజమానులు యథేచ్ఛగా బ్లాక్‌లో దందా సాగిస్తుండగా బార్ల యజమానులు మాత్రం అల్లాడిపోతున్నారు. వాస్తవానికి వైన్‌షాపుల కంటే బార్లకు పెట్టుబడి ఎక్కువ. లైసెన్స్ ఫీజూ ఎక్కువే. కానీ వైన్ షాపులను మూసేయడానికి వారం ముందు నుంచే రాష్ట్రంలో బార్లు మూసేశారు. అక్కడ ఎలాగూ కూర్చొని తాగే అవకాశం ఉండదు కాబట్టి బ్లాక్‌లో దందాకు అవకాశం లేదు. దీంతో ఎప్పుడు సాధారణ పరిస్థితి వస్తుందా... మళ్లీ ఎప్పుడు బార్లు తెరుద్దామా అని కళ్లలో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు.

# మరో 16 పాజిటివ్

▶ మొదటి పేజీ తరువాయి

అమెరికా నుంచి మార్చి 20న నగరానికి వచ్చాడు. దగ్గు, జలుబు, జ్వరంతో గచ్చిబౌలిలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేరారు. వైద్యులు ఆయన నమూనాలు వ్యాధి నిర్ధారణ పరీక్షలకు పంపగా కరోనా పాజిటివ్ అని తేలింది. దీంతో ఆయన భార్య (54)కు కూడా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించడంతో ఆమెకు కూడా కరోనా సోకినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆమెను గాంధీకి తరలించి చికిత్స చేస్తున్నట్లు సమాచారం.

**పెరిగిన కంటైన్మెంట్ జోన్లు..**

శుక్రవారం వరకు 130 ఉన్న కంటైన్మెంట్ జోన్లు (హాట్‌స్పాట్లు) శనివారం నాటికి ఏకంగా 243కు పెంచారు. కేసుల సంఖ్య పెరగడం, ఒకట్రెండు కేసులు నమోదైన చోట్ల కూడా పరిస్థితి తీవ్రంగా ఉండటంతో కంటైన్మెంట్ జోన్ల సంఖ్యను పెంచారు. ఆయా ఏరియాల్లో ప్రభుత్వం అష్టదిగ్బంధం విధించింది. ఎవరూ బయటకు పోకుండా ఏర్పాట్లు చేసింది. ఒక్క జీహెచ్ఎంసీ పరిధిలోనే ఏకంగా 123 కంటైన్మెంట్ జోన్లు ప్రకటించారు. కంటైన్మెంట్ జోన్లు దాదాపు రెండింతలు పెరగడానికి ప్రధాన కారణం.. ఒకట్రెండు కేసులు నమోదైన ప్రాంతాలను కూడా కంటైన్మెంట్లుగా ప్రకటిస్తున్నారు. ఉదాహరణకు ఏదైనా ఒక జిల్లాలోని ఒక గ్రామంలో ఒక కేసు నమోదైతే, దాన్ని ఒక కంటైన్మెంట్ జోన్‌గా ప్రకటించి అష్టదిగ్బంధం చేస్తున్నారు. వాస్తవంగా నిబంధనల ప్రకారం కేసులు నమోదైన ప్రాంతానికి రెండు, మూడు కిలోమీటర్ల వరకు కంటైన్మెంట్లు ఉండాలి. కానీ ఇప్పుడు కిలోమీటర్ల లెక్కన కాకుండా కేసున్న ప్రతి చోటును జోన్లుగా చేశారు. అందుకే ఒకేసారి దాదాపు రెండింతలు జోన్లు నమోదైనట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా కరోనా కేసులు, డిశ్చార్జి, మృతుల వివరాలు**

| | శనివారం నమోదైనవి | మొత్తం |
|---|---|---|
| చికిత్స పొందుతున్నవారు | 16 | 393 |
| డిశ్చార్జి అయినవారు | 51 | 96 |
| చనిపోయినవారు | 02 | 14 |
| మొత్తం | – | 503 |



శనివారం ప్రగతి భవన్‌లో ప్రధాని నరేంద్ర మోదీతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి ఈటల రాజేందర్, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి తదితరులు

# రైతుకు అండగా నిలవాలి

- లాక్‌డౌన్‌లోనూ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు నడిచేలా చర్యలు చేపట్టాలి
- రాష్ట్రాల అప్పుల కిస్తీలను 6 నెలలు వాయిదా వేయాలి
- ఎఫ్ఆర్‌బీఎం రుణ పరిమితిని 3 నుంచి 6 శాతానికి పెంచాలి
- జీఎస్డీపీలో 5 శాతం నిధులను క్వాంటిటేటివ్ ఈజింగ్ ద్వారా విడుదల చేయాలి
- ప్రధాని నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం కేసీఆర్ సూచనలు

**సాక్షి, హైదరాబాద్:** దేశవ్యాప్త లాక్‌డౌన్ నేపథ్యంలో వ్యవసాయ రంగాన్ని కాపాడేందుకు, ప్రజలకు నిత్యావసర సరుకుల కొరత లేకుండా చూసేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నడిచేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ప్రధాని మోదీని కోరారు. రైస్‌మిల్లులు, ఆయిల్ మిల్లులు, ఇతర వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నడిచేందుకు అవసరమైన ప్రయత్నాలు చేయాలని సూచించారు. రైతులు నష్టపోకుండా, నిత్యావసర సరుకులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఉభయతారకంగా ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ నడిచేలా చూడాలన్నారు. కరోనా వ్యాప్తిని నిరోధించడానికి దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న లాక్‌డౌన్‌ను మరో రెండు వారాలు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ శనివారం అన్ని రాష్ట్రాల సీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 4 గంటలపాటు సాగిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం కేసీఆర్ పలు సూచనలు చేశారు. సీఎం కేసీఆర్‌తోపాటు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, సీఎస్ సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకష్ణ తదితరులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ప్రజల జీవితాలు, వ్యవసాయం, ఆర్థిక అంశాలకు సంబంధించి కేసీఆర్ వెల్లడించిన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే...

- దేశం ఏకతాటిపై నిలబడి కరోనా వైరస్‌పై పోరాడుతోంది. ఇదే స్ఫూర్తితో కొనసాగాల్సిన అవసరం ఉంది. కరోనాను భారత్ గొప్పగా ఎదుర్కొంటోందని అంతర్జాతీయ పత్రికలు కూడా మెచ్చుకుంటున్నాయి.
- కరోనాపై పోరాడేందుకు రాష్ట్రాలకు కేంద్రం నుంచి మద్దతు లభిస్తోంది. మీరు (మోదీ) కూడా ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నారు. మీరు అండగా నిలవడం మాకు ఎంతో మనోధైర్యం ఇస్తోంది. కరోనాపై యుద్ధంలో భారత్ తప్పక గెలిచి తీరుతుంది.
- కరోనా వ్యాప్తిని నియంత్రించడంలో లాక్‌డౌన్ బాగా ఉపయోగపడింది. కనీసం 2 వారాలపాటు లాక్‌డౌన్ కొనసాగించడం మంచిది. వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ఇంతకు మించిన మార్గం లేదు.
- భారత్‌కు వ్యవసాయమే జీవిక. దేశానికి అన్నం పెట్టడమే కాదు, వ్యవసాయం ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తోంది. 135 కోట్ల జనాభాగల దేశానికి తిండి పెట్టడం మరే దేశానికి కూడా సాధ్యం కాదు. మనం ఆహార ధాన్యాల విషయంలో స్వయం సమృద్ధితో ఉన్నాం. ఈ పరిస్థితి కొనసాగాలి. అన్నం పెట్టే రైతుకు అండగా నిలవాలి.
- వ్యవసాయాన్ని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో అనుసంధానించాలి. కనీసం 2 నెలలైనా ఈ విధానం అవలంబించాలి. రైతులు సగం కూలి డబ్బులు భరిస్తే మిగతావి ఉపాధి హామీ నిధుల నుంచి చెల్లించే విధానం రావాలి. దీనివల్ల కష్ట కాలంలో రైతులను ఆదుకోవడం సాధ్యమవుతుంది.
- దేశవ్యాప్తంగా కోట్లాది టన్నుల పంటలు పండాయి. వాటిని సేకరించడం మన ముందున్న కర్తవ్యం. సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేయడానికి స్థలం లేదు. ప్రజలకు 3 నెలలకు సంబంధించిన ఆహార ధాన్యాలు ముందుగానే ఇవ్వడం వల్ల ప్రస్తుతం ఎఫ్‌సీఐలో ఉన్న నిల్వలు ఖాళీ అవుతాయి. అప్పుడు కొత్తగా వచ్చే పంటలను ఆ గోదాముల్లో నిల్వ చేయవచ్చు.
- రైతులు మార్కెట్లకు ఒకేసారి రాకుండా ఉండేందుకు తెలంగాణలో గ్రామాల్లోనే 6,849 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాం. ఒక్క ధాన్యం సేకరణ కోసమే రూ. 25 వేల కోట్ల బ్యాంకు గ్యారంటీ ఇచ్చాం. గ్రామాల్లోనే పంటలు కొని రైతుల అకౌంట్లో డబ్బులు వేస్తున్నాం. ఇలా సేకరించిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఎఫ్‌సీఐకి అందిస్తున్నాం. ఎఫ్‌సీఐ నుంచి తిరిగి డబ్బులు రావడానికి 4–5 నెలల సమయం పడుతోంది. అప్పటివరకు బ్యాంకులు బకాయిల చెల్లింపు కోసం ఒత్తిడి తేకుండా ఉండేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలి.
- 1918లో స్పానిష్ ఫ్లూ వచ్చినప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. 2008లోనూ ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఏర్పడింది. అప్పుడు సరైన చర్యలు తీసుకోవడం వల్ల కోలుకోగలిగాం. ఇప్పుడు కూడా ఆర్థిక ఇబ్బందులు వచ్చాయి. దీన్ని ఎదుర్కోవడానికి కూడా వ్యూహాత్మక ఆర్థిక విధానం అవసరం. క్వాంటిటేటివ్ ఈజింగ్ విధానాన్ని రిజర్వ్ బ్యాంక్ అనుసరించాలి. దీన్నే హెలికాప్టర్ మనీ అంటారు. దీనివల్ల రాష్ట్రాలకు, నిధులు సమకూర్చే సంస్థలకు వెసులుబాటు లభిస్తుంది. ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడవచ్చు. జీఎస్డీపీలో 5 శాతం నిధులను క్వాంటిటేటివ్ ఈజింగ్ విధానం ద్వారా విడుదల చేయాలి.
- ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని 3 శాతం నుంచి 5 శాతానికి పెంచాలి.
- రాష్ట్రాలు చెల్లించే అప్పుల కిస్తీని కనీసం ఆరు నెలలపాటు వాయిదా వేసేలా కేంద్రం చొరవ తీసుకోవాలి.
- ప్రధాని అధ్యక్షతన కేంద్ర మంత్రులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి. లాక్‌డౌన్ నేపథ్యంలో వ్యవసాయదారుల కోసం ఏమి చేయాలనే విషయంలో, ఆర్థిక వ్యవస్థను ఎలా నిర్వహించాలనే విషయంలో వ్యూహం ఖరారు చేసి అమలు చేయాలి.

# లాక్‌డౌన్ పొడిగింపు..

▶ మొదటి పేజీ తరువాయి

స్వావలంబన సాధించిన దేశం మనది. మోదీకి కూడా అదే చెప్పినం. ఎట్టి పరిస్థితుల్లో మనం మన స్థాయిని కోల్పోవద్దు. మన ఆహారాన్ని మనమే సాధించుకోవాలె. వ్యవసాయాన్ని, ఫుడ్ ప్రాసెసింగ్‌ను అనుమతించాలె. అప్పుడే 135 కోట్ల పొట్టలు నింపుకోగలుగుతాం. అయితే ఈ విషయంలోనూ కొన్ని నియమాలు పాటిస్తూ ముందుకెళ్లాలి. అందరూ మాస్కులు ధరించాలి. ఎవరైనా వినకుండా బయటకు వస్తే పోలీసులు కొడ్తరు.

**క్యూఈ పద్ధతిలో రూ. 10 లక్షల కోట్లు..**

ప్రస్తుతం చాలా విచిత్ర, విపత్కర పరిస్థితి ఉంది. ప్రపంచ మానవ చరిత్రలో ఇలాంటి ఘటన జరగలేదు. 1918లో స్పానిష్ ఫ్లూ, 2008లో అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం తలెత్తిన సందర్భాల్లో ప్రపంచవ్యాప్తంగా ఒక పద్ధతిని అవలంబించారు. ఇటువంటి సంక్షోభాల సమయంలో కేంద్ర రాష్ట్రాల రెవెన్యూ పడిపోయినందున వ్యవస్థను నడిపేందుకు ప్రపంచవ్యాప్తంగా క్వాంటిటేటివ్ ఈజింగ్ (క్యూఈ) అనే పద్ధతిని పాటిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థను కాపాడుకుంటూ విపత్కర పరిస్థితి నుంచి దేశాన్ని కాపాడుకునేందుకు అమెరికా ఫెడరల్ బ్యాంకు తమ జీడీపీలో 10 శాతం అంటే 2 ట్రిలియన్ డాలర్లను సమాజంలోకి పంప్ చేసింది. బ్రిటిష్ బ్యాంక్ ఆఫ్ లండన్ కూడా ఆ దేశ జీడీపీలో 15 శాతం పంప్ చేసింది. మన దేశంలోనూ కేంద్ర, రాష్ట్రాల వద్ద డబ్బు లేదు. రెవెన్యూ, ట్యాక్సులు వచ్చే పరిస్థితి లేనందున ఆర్‌బీఐ నుంచి క్యూఈ విధానంలో డబ్బు తీసుకోవడం మినహా గత్యంతరం లేదు. 2019–20కిగాను జీడీపీని 203.85 లక్షల కోట్లుగా నిర్ధారించారు. ఇందులో ఐదు శాతం అంటే రూ. 10.15 లక్షల కోట్లను ఆర్‌బీఐ విడుదల చేసినా అవి కేంద్ర, రాష్ట్రాలకు అందుబాటులోకి వస్తాయి.

**హెలికాప్టర్ మనీ పంప్ చేయాలి...**

మన దేశంలో చిన్నా, చితక వ్యాపారులు, కార్మికులు, రేషన్ కార్డులు లేనివారు, రైతులు తదితర వర్గాల నుంచి అనేక డిమాండ్లు ఉన్నాయి. మనం రూ. 30 వేల కోట్ల ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చి రైతుల నుంచి ధాన్యం కొనగోలు చేస్తున్నాం. క్యూఈ విధానంలో డబ్బును సమాజంలోకి పంప్ చేస్తే కొంత ఉపశమనం కలుగుతుంది. ఏప్రిల్‌తో ఈ పరిస్థితి నుంచి గట్టెక్కితే తిరిగి పుంజుకొనే అవకాశం ఉంది. ఇలా పంప్ చేసే డబ్బును 'హెలికాప్టర్ మనీ'అంటారు. ఆర్‌బీఐ ముందుకు వచ్చి హెలికాప్టర్ మనీని సప్లైచేయాలని ప్రధానికి వివరించాం. ఇతర రాష్ట్రాల సీఎంలు కూడా ఇదే కోరారు. ప్రధాని నుంచి సానుకూల నిర్ణయం వస్తుందని భావిస్తున్నాం.

**మద్యం షాపులు తెరిచే ప్రసక్తే లేదు..**

కేరళ తరహాలో మద్యాన్ని హోం డెలివరీ చేసే యోచన లేదు. రాష్ట్రంలో మద్యం షాపులను తెరిచే ప్రసక్తే లేదు. మాస్కులు ధరించడం తప్పనిసరి చేసిన నేపథ్యంలో దస్తీలు, టవల్స్ కట్టుకున్నా పర్వాలేదు. మార్కెట్లో మాస్కులు లభించకపోతే ఇంట్లోనే కుట్టుకోవాలి. ఎవరైనా ధరలు పెంచినా, నిత్యవసర సరుకుల కృత్రిమ కొరత సష్టించినా పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటాం. ఈ విపత్కర సమయంలో దుర్మార్గంగా డబ్బులు సంపాధించుకోవడానికి ప్రయత్నిస్తే సహించే ప్రసక్తే లేదు.

**యథాతథ స్థితి కొనసాగించాలి...**

ప్రధాని మోదీ అన్ని రాష్ట్రాల సీఎంలు, లెఫ్టినెంట్ గవర్నర్లతో మూడు గంటలపాటు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో లాక్‌డౌన్‌ను కనీసం రెండు వారాలు పొడిగించాలని అన్ని రాష్ట్రాల సీఎంలు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాల వారు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని కొందరు సీఎంలు కోరారు. దీన్ని ససేమిరా అంగీకరించం.

**సీఎంఆర్‌ఎఫ్‌కు సీఎస్ఆర్, పన్నుల మినహాయింపు ఇవ్వాలి**

పీఎం కేర్స్ తరహాలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళాలు ఇచ్చే వారికి సీఎస్ఆర్, ట్యాక్సుల నుంచి మినహాయించే నిబంధనలు వర్తింపజేయాలి. రాష్ట్రాల్లోనూ విరాళాలు ఇచ్చేందుకు విరివిగా ముందుకొస్తున్న వారికి ఈ వెసులుబాటు కల్పించాలని ప్రధానిని కోరా. వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని దృష్టికి తీసుకెళ్లిన అంశాలను మళ్లీ లేఖ రూపంలో ప్రధానికి పంపించాం.

**ప్రైవేటులో కరోనా చికిత్సకు నో..**

ప్రభుత్వ కోవిడ్–19 ఆస్పత్రుల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షల నిర్వహణ సామర్థ్యం పూర్తిగా వినియోగంలోకి వచ్చాకే ప్రైవేటు ఆస్పత్రుల్లో నిర్ధారణ పరీక్షలు, చికిత్సకు అనుమతిస్తాం. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచితంగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించేసరికి ప్రైవేటు ఆస్పత్రులు గమ్మున ఉండిపోయాయి. పేదలకు ఇబ్బంది కావద్దనే ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చికిత్స అందిస్తున్నం. ప్రపంచవ్యాప్తంగా కోవిడ్–19 రోగులకు అందించే చికిత్సలో వస్తున్న కొత్త పరిజ్ఞానం తొలుత ప్రభుత్వానికే తెలిసే అవకాశముంది. ఇది కూడా ముఖ్య కారణం. వ్యాధి నయమైందని పూర్తిస్థాయిలో నిర్ధారించుకున్నాకే రోగులను డిశ్చార్జి చేసుకోవాల్సి ఉంటుంది. సరిగ్గా నయం కాకుండానే రోగులను డిశ్చార్జి చేస్తే వారు ఆటంబాంబుగా మారి వందలాది మందికి వ్యాధిని అంటించే ప్రమాదముంటుంది. అందుకే ప్రభుత్వ ఆస్పత్రులకే ప్రాధాన్యత ఇస్తున్నాం. నిజాముద్దీన్ ఘటన జరగకపోయివుంటే ఈ రోజు మనం ఆరామ్‌గా ఉండేవాళ్లం. రోజుకు రెండు, మూడు కేసులే వచ్చేవి.

**తొలి దశ రోగుల వంద శాతం డిశ్చార్జి..**

తొలి దశలో విదేశాల నుంచి వచ్చిన వాళ్లలో వైరస్ సంక్రమించిన వారిని వంద శాతం డిశ్చార్జి చేశాం. తొలి దశలో క్వారంటైన్‌లో పెట్టిన 25,937 మంది కూడా డిశ్చార్జి అయ్యారు. తాజాగా నమోదైన కేసులను కూడా కలుపుకొని మొత్తంగా శనివారం వరకు 503 పాజిటివ్ కేసులు రాగా ఇందులో 14 మంది మరణించారు. ఇండోనేషియన్లు సహా విదేశాల నుంచి వచ్చిన 96 మందిని డిశ్చార్జి చేశాం. ఆస్పత్రుల్లో ప్రస్తుతం 393 యాక్టివ్ కేసులు ఉన్నాయి. నిజాముద్దీన్ ఘటన తర్వాత 1,200 మంది అనుమానితులకు పరీక్షలు చేశాం. ప్రస్తుతం 1,654 మంది ప్రభుత్వ పర్యవేక్షణలో ఉన్నారు. ఆస్పత్రికి రెఫర్ అవుతున్న కేసుల సంఖ్య తగ్గింది. రిస్క్ తీసుకోకూడదనే ఉద్దేశంతో గతంలో ఆచూకీ లభించని వారిని కూడా గుర్తించి పరీక్షలు చేస్తున్నాం.

**ఏప్రిల్ 24 తర్వాత యాక్టివ్ కేసులుండవ్!**

కరోనా వ్యాధి ప్రబలకుండా ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ఎక్కడా రాజీపడకుండా 243 చోట్ల కంటెయిన్‌మెంట్ అమలు చేస్తున్నాం. ఇందులో జీహెచ్ఎంసీ పరిధిలో 123 ప్రాంతాలు, ఇతర చోట్ల 120 ప్రాంతాలు ఉన్నాయి. కంటైన్‌మెంట్‌తో మంచి ఫలితాలు వస్తున్నాయి. అదృష్టవశాత్తూ చికిత్స పొందుతున్న వారు, క్వారంటైన్, కంటైన్‌మెంట్ ఏరియాలో ఉన్న వారిలో ఏ ఒక్కరూ సీరియస్‌గా లేరు. భగవంతుడి దయతో ఎవరికీ ఆక్సిజన్, వెంటిలేటర్ పెట్టాల్సిన అవసరం లేదు. ఈ దశ నుంచి సంక్రమణ తగ్గిపోతే ఏప్రిల్ 24 వరకు దాదాపు కోవిడ్ బాధితులు ఎవరూ ఉండరు. కొత్త ఉత్పాతం, ఉప్పెన రాకపోతే మనం బయట పడతాం.

**మహారాష్ట్ర సరిహద్దు మూసివేత...**

మహారాష్ట్రలో శనివారం ఒక్కరోజే 11 మంది మరణించారు. రాజస్తాన్‌లో 117 మందికి వైరస్ సోకింది. మహారాష్ట్రతో మనకు ఐదారు వందల కిలోమీటర్ల సరిహద్దు ఉంది. కాళేశ్వరం మొదలుకొని నిజామాబాద్, ధర్మాబాద్, నాందేడ్, నారాయణఖేడ్ వరకు సరిహద్దు ఉండటంతో బంధుత్వాలు, వ్యాపార లావాదేవీలు ఉన్నాయి. కఠినంగా వ్యవహరిస్తే తప్ప రాష్ట్రాన్ని కాపాడుకోలేం. మహారాష్ట్ర సరిహద్దును వంద శాతం మూసేస్తాం. అక్కడి నుంచి వచ్చే నిత్యావసరాలను కూడా ప్రత్యామ్నాయ మార్గాల్లో సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

**ఏప్రిల్ 15 వరకు సాగునీరు...**

రాష్ట్రంలోని అన్ని ఇరిగేషన్, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలో ఏప్రిల్ 15 వరకు సాగునీరు ఇవ్వాలని నిర్ణయించాం. కేంద్రం శనగల కొనుగోలుకు తక్కువ కోటా ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం రూ. 800 కోట్లకు గ్యారంటీ ఇచ్చింది. కనీస మద్దతు ధరకు కొనేందుకు ప్రభుత్వం నిర్ణయించినందున రైతులు ఆందోళన చెందవద్దు. బత్తాయి, ఉల్లి, మామిడి దిగుబడులను ప్రభుత్వం కొనుగోలు చేయదు. అన్నీ ప్రభుత్వమే కొనుగోలు చేయాలంటే సాధ్యం కాదు. రాష్ట్రంలో పండే పంటల్లో 95 శాతం వాటా వరి, పత్తి, మొక్కజొన్న పంటలదే. వాటితోపాటు పప్పు శనగలు కొనుగోలు చేస్తున్నం.

**ఏకతాటిపైకి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు..**

కరోనాను ఎదుర్కోవడంలో కేంద్ర, రాష్ట్రాలు ఏకతాటిపై పనిచేస్తున్నాయి. రైలు, విమానాల రాకపోకలు సహా లాక్‌డౌన్ కొనసాగింపునకు సంబంధించి అన్ని విషయాలపై ప్రధాని అధికారికంగా జాతికి సందేశం ఇచ్చే అవకాశం ఉంది. కరోనా నియంత్రణలో ఇతర దేశాలతో పోలిస్తే భారత్ మంచి స్థితిలో ఉంది. ప్రధాని కూడా లాక్‌డౌన్ విషయంలో సరైన సమయంలో నిర్ణయం తీసుకున్నారు. రాజకీయాలను పక్కనపెట్టి యావత్ దేశం ఒకే మూసలో పనిచేసింది కాబట్టి కరోనా నియంత్రణలో ఉంది. ఇంకో 10–15 రోజులు రాజకీయాలను పక్కనపెట్టి మనం ముందుకెళ్తే కచ్చితంగా బయటపడే ఆస్కారం ఉంది.





శనివారం ప్రగతి భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

**అత్యవసర వైద్య సేవలు నిరాకరించొద్దు..**

ఆరోగ్యం విషమించి అత్యవసర పరిస్థితిలో చికిత్స కోసం వచ్చే రోగులను ప్రైవేటు ఆస్పత్రులు చేర్చుకోకపోవడం మంచిది కాదు. మామూలు సమయంలో ప్రైవేటు ఆస్పత్రులు డబ్బులు సంపాదించుకొని ఈ సమయంలో రోగులకు చికిత్స చేయకపోతే ఎలా? ఈ విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటుంది. దీనిపై సీఎస్ సోమేశ్ కుమార్ సమీక్షించి ఆదేశాలు జారీ చేస్తారు.

# ధరలు పెంచితే జైలుకు పంపండి

- నిత్యావసర వస్తువుల ధరల కట్టడికి చర్యలు చేపట్టాలని రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం
- పప్పులు, నూనెలు, ఇతరత్రాల ధరల పెరుగుదలపై ఆందోళన
- సరుకుల కొరత సృష్టిస్తే క్రిమినల్ కేసులు, ఏడేళ్ల జైలుకు సిఫార్సు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో లాక్‌డౌన్ కొనసాగుతుండటం, మరిన్ని రోజులు దీన్ని కొనసాగించనున్న నేపథ్యంలో నిత్యావసర వస్తువుల లభ్యత పెంచడం, ధరల నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. నిత్యావసరాల ధరలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వీటిని ఉపేక్షించి అధిక ధరలకు అమ్మే వారిపై కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది.కృత్రిమ కొరత, బ్లాక్ మార్కెటింగ్ చేసే వ్యాపారులపై క్రిమినల్ కేసులు పెట్టడంతో పాటు, ఏడేళ్ల పాటు జైలుకు పంపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.ఈ మేరకు కేంద్ర హోం సెక్రటరీ అజయ్ కుమార్ భల్లా, వినియోగదారుల మంత్రిత్వశాఖ కార్యదర్శి పవన్ అగర్వాల్ రాష్ట్రాలకు లేఖలు రాశారు.

**పప్పులు, నూనెల ధరల్లో అనూహ్య పెరుగుదల..**

దేశవ్యాప్తంగా గత నెల చివరి వారం వరకు ధరలు నియంత్రణలోనే ఉన్నా, ఈ నెల తొలి వారం నుంచి సరుకుల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి.రాష్ట్రంలో కూరగాయలు, పండ్ల ధరలు గతానికన్నా తగ్గినా, పప్పులు, నూనెల ధరలు అమాంతం పెరుగుతున్నాయి. కిందటి నెలలో కందిపప్పు ధర కిలో రూ.75 నుంచి రూ.85 మధ్యలో ఉండేది. ప్రస్తుత డిమాండ్ నేపథ్యంలో మేలురకం కందిపప్పు ధర రూ.120 నుంచి రూ.130కి చేరింది. దేశంలో పప్పుధాన్యాల దిగుబడిలో అధిక వాటా కలిగిన కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్‌ల నుంచి రాష్ట్రానికి సరఫరా తగ్గుతోంది. వాహనాల రాకపోకలకు ఆటంకాలు, సిబ్బంది కొరతతో అక్కడి నుంచి సరఫరా ఆగడంతో ధరలు పెరిగాయి. పెసర, మినపప్పు ధరలు సైతం ఇంతకింతకీ పెరుగుతున్నాయి.సరఫరాలో తగ్గుదల కారణంగా ప్రస్తుతం ధరల పెరుగుదల 20% నుంచి 25% వరకు ఉంది. పెసర పప్పు ధర వారం కింద రూ.85 వరకు ఉండగా, అది ప్రస్తుతం రూ.130–140కి చేరింది. మినపపప్పు ధర సైతం కిలో రూ. 130–135కిపైనే ఉంది. ఇక వంట నూనెల ధరలు సైతం 15 నుంచి 20% పెరిగాయని వినియోగదారుల మంత్రిత్వశాఖే చెబుతోంది. సప్‌లై చైన్ వ్యవస్థ దెబ్బతినడంతో ఇష్టారీతిన ధరలు పెంచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తోంది.లీటర్ పామాయిల్ ధర రూ.90 ఉండగా, అది ఇప్పుడు రూ.110–120కి చేరింది. ఈ దృష్ట్యా పప్పులు, నూనెల ధరలను నియంత్రించాలని వినియోగదారుల మంత్రిత్వ శాఖ, కేంద్ర హోంశాఖ రాష్ట్రాలకు ఆదేశించింది. ముఖ్యంగా నిల్వలపై పరిమితులు విధించడం, ధరలు తగ్గించడం, డీలర్ల ఖాతాల తనిఖీలు చేపడుతూనే నిత్యావసర సరుకుల చట్టం కింద బ్లాక్‌మార్కెట్ చేసే వారిపై క్రిమినల్ కేసులు, ఏడేళ్ల జైలు శిక్షలు విధించాలని సూచించింది. దీనికై రాష్ట్ర యంత్రాంగాలు విస్తృత తనిఖీలు చేపట్టి అరెస్టులు చేయాలని కోరింది. ఇప్పటికే ఆహార ధాన్యాల రవాణాను పెంచే క్రమంలో 109 ప్రత్యేక రైళ్ల ద్వారా రైల్వే శాఖ 21,247 వ్యాగన్ల ద్వారా ఉప్పు, చక్కెర, వంటనూనెలు, కంది, బియ్యం వంటి సరుకుల రవాణా చేసిందని, సరుకుల కొరత రాకుండా అన్ని రాష్ట్రాలకు సరఫరా చేస్తోందని ప్రకటించింది.





# కరోనా మిస్టరీలు

జ్వరం... దగ్గు... జలుబు ఉంటే కరోనా కావచ్చు.. ఈ మధ్య కాలంలో విదేశాలకు వెళ్లారా... మీకు వైరస్ సోకి ఉండవచ్చు..

మీ పరిసరాల్లో ఎవరైనా కరోనా రోగి ఉన్నారా? అయితే మీరూ ప్రమాదంలో పడే అవకాశాలు ఎక్కువ!

ఇటీవలి కాలంలో తరచూ వింటున్న మాటల్లో ఇవి కొన్ని. వాస్తవాలు కూడా..

అయితే... దాదాపు వంద రోజుల కరోనా ప్రస్థానంలో అన్నీ మనకు తెలిసినవే లేవు.

తెలియకుండా మిస్టరీగా మిగిలిపోయి... శాస్త్రవేత్తల మెదళ్లను వేడెక్కిస్తున్నవి కూడా బోలెడున్నాయి!

## మైసూరు రహస్యం?

మైసూరు జిల్లా నంజనగూడులో ఓ 35 ఏళ్ల కరోనా బాధితుడున్నాడు. పేషెంట్ 52.. అని పిలుద్దాం ఇతడిని. ఫార్మా కంపెనీలో ఉద్యోగం. మార్చి 26న వైరస్ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. విదేశాలకు పోయింది లేదు... కరోనా రోగులతో కాంటాక్ట్ అయ్యిందీ లేదు. పది రోజులు తిరక్కుండానే పేషెంట్ 52 పనిచేసే ఫార్మా కంపెనీలో మరో 24 మంది కూడా వైరస్ బారిన పడ్డారు. ఎలా...? మైసూరు జిల్లా యంత్రాంగం ఈ ప్రశ్నకు సమాధానం కనుక్కునే పనిలోనే ఉంది. ఇప్పటికైతే మార్చి నెలలో చైనా నుంచి వచ్చిన ఓ ప్యాకేజీపై అనుమానం వ్యక్తమవుతోంది. మందుల తయారీకి అవసరమైన రసాయనాలు చైనా నుంచి చెన్నైకి.. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా నంజనగూడుకు వచ్చినట్లు అధికారులు గుర్తించారు. ప్యాకేజీ నమూనాలను సేకరించి పుణే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరలాజీకి పంపామని, ఫలితాల కోసం ఎదురు చూస్తున్నామని అంటున్నారు అధికారులు. చైనాలో వైరస్ ఉధృతి బాగా ఉందని తెలిసీ మందులెలా తెప్పించారని.. ఆ కంపెనీపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే డిమాండ్ చేస్తూ ఉండగా.. అధికారులు మాత్రం నోరు మెదపడం లేదు. ప్యాకేజీ ద్వారా వైరస్ వ్యాపిస్తుందా? అని ప్రశ్నించుకుంటే ఇండియన్ డ్రగ్ మ్యానుఫాక్చరర్స్ అసోసియేషన్ ఈ ఏడాది ఫిబ్రవరిలో చేసిన ఒక ప్రకటనను గుర్తు చేసుకోవాలి. చైనాలోని హుబే ప్రాంతం నుంచే మనకు మందుల తయారీకి అవసరమైన రసాయనాలు వస్తున్నాయని, ఆ ప్యాకేజీల ద్వారా వైరస్ సోకేందుకు అవకాశాలు లేకపోలేదని ఈ సంస్థ అప్పట్లో హెచ్చరించింది. ఏ విషయమూ స్పష్టంగా తెలిసేంత వరకూ పేషెంట్ 52కు వైరస్ ఎలా సోకింది అనేది మిస్టరీగానే ఉండిపోతుంది.



# 'శ్వాస' వ్యవస్థ బాగుంటే వైరస్ భయం లేనట్టే!

శ్వాసనాళ, శ్వాసకోశ వ్యాధిగ్రస్తులు జాగ్రత్త ● శ్వాసకోశ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవాలి

ఇప్పటికే వాడుతున్న మందుల్ని కొనసాగించాలి ● హృదయ, ఛాతీ వ్యాధులుంటే అప్రమత్తత తప్పదు

'సాక్షి'తో నిమ్స్ పల్మనరీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ జీకే పరంజ్యోతి



డాక్టర్ జీకే పరంజ్యోతి, పల్మనరీ మెడిసిన్ విభాగాధిపతి, నిమ్స్

'శ్వాసనాళ, శ్వాసకోశ సంబంధ వ్యాధులతో ఇప్పటికే బాధపడుతున్న వారు తాము వాడుతున్న మందులను కొనసాగించాలి. ఆస్తమా, సీఓపీడీ, టీబీ, ఊపిరితిత్తులకు సంబంధించిన ఇతర వ్యాధులతో బాధపడుతున్నవారు జాగ్రత్తలు పాటించాలి. సాధారణ జలుబు, ఫ్లూ లక్షణాలుంటే కరోనాకు గురయ్యే అవకాశాలెక్కువ. కాబట్టి వీలైనంత వరకు ఇవి రాకుండా చూసుకోవాలి. వాతావరణం వేడిగా ఉంటే వైరస్ వ్యాపించదనేది అపోహ మాత్రమే. కరోనాను సమర్థంగా ఎదుర్కొనే వ్యాక్సిన్ మరో ఏడాది నుంచి ఏడాదిన్నరలోగా రావచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో భౌతిక దూరాన్ని పాటించడమొక్కటే మార్గం'అని నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) పల్మనరీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ జీకే పరంజ్యోతి సూచించారు. శ్వాసనాళ, శ్వాసకోశ వ్యాధులతో పాటు ఇతర అనారోగ్యాలతో బాధపడుతూ చికిత్సపొందేవారు కరోనా నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. వివరాలు డాక్టర్ మాటల్లోనే..

– సాక్షి, హైదరాబాద్

### స్టెరాయిడ్ ఇన్‌హేలర్‌ను వాడండి

ఆస్తమా రోగులు స్టెరాయిడ్ ఇన్‌హేలర్‌ను వాడుతూనే ఉండాలి. దీని వాడకం కరోనాను కొంతమేర నిరోధిస్తుందని చైనీయుల అనుభవాలు చెబుతున్నాయి. లేదంటే ఆస్తమా ముదిరి కరోనా లక్షణాలు పెరగొచ్చు. ఆస్తమా రోగులు కరోనా ద్వారా మరిన్ని ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారనే దానికి ఎలాంటి ఆధారాల్లేవు. ఇప్పటివరకు కరోనా లక్షణాలతో ఆసుపత్రుల్లో చేరిన వారిలో చాలామందికి గతంలో ఎలాంటి శ్వాస సంబంధ సమస్యలు లేవు. ఆస్తమాతో బాధపడుతూ కరోనా బారినపడిన వారి సంఖ్య ఇప్పటివరకు స్వల్పంగానే ఉన్నా, చికిత్స తర్వాత వీరు రికవరీ అవుతున్నట్టే నివేదికలు చెబుతున్నాయి. కరోనాకు భయపడి ఆస్తమా కోసం తీసుకుంటున్న చికిత్సను అశ్రద్ధ చేయొద్దు.

### న్యూమోథొరాక్స్‌తో భయం లేదు

ఇతర అనారోగ్యంతో బాధపడేవారు లేదా ఆరోగ్యవంతుల్లోనూ న్యూమోథొరాక్స్ (ఊపిరితిత్తుల ఛాతీ గోడ నడుమ గ్యాస్) సంభవించినా కరోనా ప్రమాదం అంతగా ఉండకపోవచ్చు. అయితే న్యూమోథొరాక్స్‌తో పాటు సీఓపీడీ, సిస్టిక్ ఫైబ్రోసిస్, ఇతర ఊపిరితిత్తి సంబంధ సమస్యలు రిస్కును పెంచే అవకాశం ఉంటుంది. వైరల్ ఇన్‌ఫెక్షన్ ద్వారా న్యూమోథొరాక్స్ సంభవించడం అనేది చాలా అరుదు. గతంలో ఈ వ్యాధికి గురై కోలుకున్న వారు ఇతరుల కంటే కరోనా ప్రభావానికి ఎక్కువ గురవుతారనే దానికి దాఖలాల్లేవు. కరోనా బారిన పడే వారిలో కొద్దిమందిలో మాత్రమే పల్మనరీ ఫైబ్రోసిస్ (ఊపిరితిత్తుల కణజాలం దెబ్బతినడం) సంభవిస్తుంది. దీనినెలా నివారించాలనే దానిపై పరిశోధనలు జరగాలి.

### హృద్రోగ, శ్వాసకోశ వ్యాధులతో జాగ్రత్త

కరోనా బారినపడిన చాలామందిలో కొద్దిగా అస్వస్థతతో పాటు జలుబు, జ్వరం లక్షణాలు కనిపిస్తున్నాయి. తీవ్ర హృద్రోగ, శ్వాసకోశ సంబంధ వ్యాధులున్న వారిపై కరోనా ప్రభావం ఎక్కువ. ముఖ్యంగా 80 ఏళ్లు పైబడిన వారిపై ఇది ప్రభావం చూపుతుంది. శ్వాసనాళం, ఊపిరితిత్తుల సమస్యలున్న వారు కరోనా బారిన పడే అవకాశాలెక్కువ. శ్వాసనాళాన్ని ఆరోగ్యంగా ఉంచుకుంటే ఊపిరితిత్తుల నుంచి తెమడను బయటకు పంపి కరోనా బారినపడే అవకాశాలను తగ్గిస్తుంది. ఒకవేళ దగ్గు, జ్వరం వచ్చినా శ్వాస వ్యవస్థను ఆరోగ్యంగా పెట్టుకోవడంతో పాటు, జ్వరం తగ్గేందుకు పారాసిటమాల్ వాడాలి. బ్రాంకియెక్టసిస్ (శ్వాసనాళం, దాని శాఖలు ఉబ్బడం) తీవ్రంగా ఉన్నా, దీర్ఘకాలంగా ఛాతీ సంబంధ వ్యాధులతో బాధపడుతున్నా, శ్వాససంబంధ సమస్యలకు దీర్ఘకాలంగా యాంటీ బయోటిక్స్ వాడుతున్నా ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటిపట్టునే ఉండి సామాజిక దూరం పాటిస్తూ, కొద్ది వారాల పాటు విశ్రాంతి తీసుకోవడం ఉత్తమం.



### వైరస్‌ను తట్టుకోలేని 'సీఓపీడీ'

ఎంఫిసిమా, క్రానిక్ బ్రాంకైటిస్ తదితర ఊపిరితిత్తుల సమస్యలు సీఓపీడీ (శ్వాస మార్గం మూసుకుపోయి ఊపిరి తీసుకోలేకపోవడం)కి దారితీస్తాయి. సీఓపీడీతో బాధపడుతున్న వారు కరోనా బారినపడే అవకాశాలెక్కువ. వీరి ఊపిరితిత్తులు కొంతమేర దెబ్బతిని ఉంటాయి కాబట్టి కరోనా వైరస్‌ను తట్టుకునే శక్తి తక్కువుంటుంది. వాస్తవానికి కరోనా బారినపడే వారిలో సుమారు 50 శాతం మందిలో ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించవు. కొందరిలో స్వల్పంగా జలుబు, ముక్కు కారడం, కండరాల నొప్పి, జ్వరం, దగ్గు లక్షణాలు ఉంటాయి. మరికొందరిలో 'ఫ్లూ'తరహాలో జలుబు, కండరాల నొప్పి, అలసట ఉంటుంది. కరోనా లక్షణాలు తీవ్రంగా ఉండే వారిలో న్యూమోనియా, శ్వాస ఆడకపోవడం, దగ్గు అదనపు లక్షణాలుగా ఉంటాయి. సీఓపీడీ రోగులకు ఊపిరితిత్తులతో సమస్య మొదలై కరోనా బారినపడితే ఊపిరాడని పరిస్థితికి చేరుకుంటారు. అయితే చాలామంది సీఓపీడీ రోగుల్లో కరోనా సోకినా లక్షణాలు బయట పడకుండానే పూర్తిగా కోలుకునే అవకాశం ఉంది.

### ఆ ఔషధాలు వాడే వారిలో రిస్క్ ఎక్కువ

గతంలో ఏవైనా ఇతర వ్యాధుల బారిన పడ్డ వారికి కరోనా సోకే అవకాశాలెక్కువనేది నిజం కాదు. అయితే హృద్రోగ, శ్వాస సంబంధ, డయాబెటిస్ లేదా రోగ నిరోధక శక్తిని తగ్గించే ఔషధాలు వాడే వారిలో కరోనా రిస్క్ ఎక్కువ. ఇతరులతో పోలిస్తే టీబీ వ్యాధిగ్రస్తులు కరోనా బారినపడే అవకాశాలెక్కువ. ఛాతీ సంబంధ వ్యాధులతో బాధపడే వారు ఒకవేళ కరోనా బారిన పడినా లక్షణాలు కొద్దిగా బయటపడవచ్చు లేదా అసలు కనిపించకపోవచ్చు. టీబీ చికిత్స తీసుకుంటున్న వారు వైద్యుల సూచనతో మందులు వాడుతూ సామాజిక దూరం పాటించాలి. గతంలో ఊపిరితిత్తుల్లో కొంత భాగం తొలగించినా, ఊపిరితిత్తులు చిన్నవి (స్కోలియోసిస్)గా ఉన్నా కరోనా సోకుతుందనేది అపోహ మాత్రమే.

### ముందు జాగ్రత్తలే మందు

కరోనాను అరికట్టేందుకు సమర్థవంతమైన చికిత్స విధానాలు త్వరలో అందుబాటులోకి వస్తాయి. వ్యాక్సిన్ ఏడాది నుంచి ఏడాదిన్నరలోగా అందుబాటులోకి రావచ్చు. కరోనా కట్టడికి ఇప్పటివరకు ప్రత్యేక చికిత్సంటూ ఏమీలేదు. విటమిన్ సీ, బీ కాంప్లెక్స్, జింక్ ప్రొటెక్టివ్ సప్లిమెంట్లు తీసుకోవాలి. కరోనా గాలి ద్వారా వ్యాపించదు. దగ్గు, తుమ్ముల నుంచి తుంపర్ల ద్వారా వ్యాపిస్తుంది. ఇతరులకు కనీసం రెండు మీటర్ల భౌతిక దూరం పాటించాలి. బయటకు వెళ్లేటపుడు మాస్కులు ధరించాలి. సబ్బుతో తరచూ చేతులు కడుక్కోవాలి. ఏదైనా అనారోగ్యంతో బాధపడుతుంటే సంబంధిత మందులను యథావిధిగా వాడాలి. 'కరోనా' అనుమానాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి.

# సమాచారమంతా 'టీ కోవిడ్-19'లో

యాప్‌ను ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కోవిడ్‌పై సమగ్ర సమాచారాన్ని అందించేందుకు ఉద్దేశించిన 'టీ కోవిడ్–19'యాప్‌ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ శనివారం ఆవిష్కరించారు. ప్రపంచ వ్యాప్తంగా కోవిడ్–19 కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజారోగ్య వ్యవస్థకు సవాలుగా నిలుస్తోందన్నారు. ఈ సవాలును ఎదుర్కోవడంలో ప్రజలు, ప్రభుత్వానికి ఉపకరించేలా ఏడబ్ల్యూఎస్, సిస్కోతో పాటు హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ కంపెనీ క్వాంటెలా సహకారంతో రాష్ట్ర ఆరోగ్య, ఐటీ మంత్రిత్వ శాఖలు 'టీ కోవిడ్–19'యాప్‌ను రూపొందించాయని తెలిపారు. ఈ యాప్ ద్వారా కోవిడ్–19కు సంబంధించిన అధికారిక సమాచారం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. అనవసరమైన భయాందోళనకు గురి కాకుండా పౌరులు తమ ఆరోగ్య స్థితిగతులను తెలుసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. కాల్ హెల్త్ అనే టెలీమెడిసిన్ మాడ్యూల్‌తో ఈ యాప్‌ను అనుసంధానం చేయడంతో మారుమూల ప్రాంతాల్లో ఉన్న వారు కూడా వైద్యులతో సంప్రదింపులు జరపవచ్చని వెల్లడించారు. ప్రభుత్వ ఉత్తర్వులు, మీడియా బులెటిన్లు, ప్రభుత్వ ప్రకటనలు, ఇతర అత్యవసర సేవలు కూడా ఈ యాప్‌లో అందుబాటులో ఉంటాయని కేటీఆర్ వివరించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థతో పాటు ఇతర ప్రపంచ స్థాయి ఆరోగ్య సంస్థలు ఇచ్చిన సలహాలు, సూచనలు కూడా ఈ యాప్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. ఆల్ ఇన్ వన్ తరహాలో కోవిడ్‌కు సంబంధించి పౌరులకు అవసరమైన సమాచారం ఈ యాప్‌లో అందుబాటులో ఉంటుందని క్వాంటెలా వ్యవస్థాపకులు శ్రీధర్ గాంధీ వెల్లడించారు.

**కలిసికట్టుగా సంక్షోభాన్ని ఎదుర్కొందాం**

కరోనా సంక్షోభం నుంచి ప్రపంచం త్వరలో గట్టెక్కుతుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ శాఖకు చెందిన సుమారు 100 మంది వ్యాపారవేత్తలతో ఆయన శనివారం భేటీ అయ్యారు. కరోనా కట్టడిలో భాగంగా లాక్‌డౌన్ విధింపు తదితర పరిణామాలపై మంత్రి వివరిస్తూ, నియంత్రణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి చెప్పారు. లాక్‌డౌన్‌తో లక్షలాది మంది జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని, వ్యాధిని నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా పని చేస్తున్నాయని తెలిపారు. లాక్‌డౌన్ మూలంగా వ్యాపార, వాణిజ్య వర్గాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్రం సంప్రదింపులు జరుపుతోందన్నారు. కరోనా నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆర్గనైజేషన్ అభినందించింది.



యాప్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో జయేశ్‌రంజన్ తదితరులు

# సీఎం సహాయ నిధికి రూ.4.70 కోట్ల విరాళం

## మంత్రి కేటీఆర్‌కు చెక్కులు అందజేసిన దాతలు

సాక్షి, హైదరాబాద్: కోవిడ్‌ను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు మద్దతుగా శనివారం సుమారు 30 మంది దాతలు రూ.4.70 కోట్ల చెక్కులను మంత్రి కేటీఆర్‌కు ప్రగతిభవన్‌లో అందజేశారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో మల్లారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.50 లక్షలు, మల్లారెడ్డి ఆధ్వర్యంలో సేకరించిన మరో రూ.47 లక్షలు విలువ చేసే 36 చెక్కులను కేటీఆర్‌కు అందజేశారు. వీటితో పాటు మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ తరపున మరో రూ.25 లక్షలు విరాళంగా అందజేశారు.

- హెచ్‌ఈఎస్ ఇన్‌ఫ్రా ఎండీ ఐవీఆర్ కృష్ణంరాజు రూ.50 లక్షలు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి సేకరించిన రూ.40 లక్షలను ఎమ్మెల్యే కేపీ వివేకానంద కేటీఆర్‌కు అందజేశారు. వోక్సెన్ బిజినెస్ స్కూల్ ఎండీ విన్ పూల, రాజరాజేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ, ఆర్ఏ కెమ్ ఫార్మా లిమిటెడ్, ఎన్.ఎస్. ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్, ఎస్ఎంఆర్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.25 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు.
- ఆజాద్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 21 లక్షలు, అక్యురేట్ గ్రీన్ వీడియోస్ రూ.15 లక్షలు, స్కైస్ బిజినెస్ సర్వీసెస్ రూ.11 లక్షలు, సూర్యాపేట జిల్లా పరిషత్ చైర్మన్ యుగంధర్ రావు రూ.10 లక్షలు, మర్రి ఎడ్యుకేషనల్ సొసైటీ తరపున టీఆర్ఎస్ పార్టీ నాయకుడు మర్రి రాజశేఖర్ రెడ్డి రూ.10 లక్షలు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజనీరింగ్, సెయింట్ మార్టిస్ చిల్డ్రన్ ఎడ్యుకేషనల్ సొసైటీ, టెక్ సిస్టమ్స్ గ్లోబల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.10 లక్షల చొప్పున చెక్కులను మంత్రి కేటీఆర్‌కు అందజేశారు.
- పడాల రామిరెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.6 లక్షలు, లహరి ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, మరిస్టా ఇన్ ఫ్రా ప్రాజెక్ట్ లిమిటెడ్, జోగినిపల్లి చంద్రశేఖరరావు, జోగినిపల్లి సుధీర్ రూ. 5 లక్షల చొప్పున సీఎంఆర్ఎఫ్‌కి విరాళంగా ప్రకటించారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సొసైటీ ఆఫ్ సెయింట్ అన్నె రూ.5 లక్షల చెక్కులను కేటీఆర్‌కు అందజేసింది. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జి.రాజేశంగౌడ్ రూ.2 లక్షలు విరాళంగా అందజేశారు.

# సీఎం సహాయనిధికి విరాళాలు



రాంకీ ఎన్విరో ఇంజనీరింగ్ లిమిటెడ్ తరపున సీఎం కేసీఆర్‌కు రూ.5 కోట్ల చెక్కును అందచేస్తున్న గౌతమ్‌రెడ్డి, ఆళ్ల శరణ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కరోనా వైరస్ కట్టడికి చేపడుతున్న కార్యక్రమాల కోసం తమవంతు సాయంగా ప్రముఖులు, పలు కంపెనీల ప్రతినిధులు శనివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి సహాయనిధికి భారీగా విరాళాలు అందించారు. రాంకీ ఎన్విరో ఇంజనీరింగ్ లిమిటెడ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.5 కోట్ల విరాళం అందించింది. దీనికి సంబంధించిన చెక్కును ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ఎం.గౌతమ్ రెడ్డి, ఆళ్ల శరణ్ రెడ్డి ముఖ్యమంత్రికి అందించారు. సైయంట్ కంపెనీ అధినేత బీవీఆర్ మోహన్ రెడ్డి, సీఈఓ బి.కృష్ణా సీఎంఆర్ఎఫ్‌కు రూ.2 కోట్లు విరాళంగా ఇచ్చారు. దీనికి సంబంధించిన చెక్కును ముఖ్యమంత్రికి అందించారు. రాజా ధనరాజ్‌గిర్ ఎస్టేట్స్ చైర్మన్ అరుణ్ మహేందర్ గిర్ కోటి రూపాయల చెక్కును సీఎంకు విరాళంగా ఇచ్చారు.



సీఎం కేసీఆర్‌కు రూ.2 కోట్ల విరాళం చెక్కు అందిస్తున్న సైయంట్ కంపెనీ అధినేత బీవీఆర్ మోహన్‌రెడ్డి, సీఈఓ కృష్ణ




## ఇంట్లోనే ఉందాం...

అంతకంతకు విజృంభిస్తున్న కరోనా వైరస్‌పై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు మంచిర్యాల జిల్లా కేంద్రంలో 25 మంది కళాకారులు నడుంబిగించారు. పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తాలో 'ఇంట్లోనే ఉండండి.. కరోనాను తరిమికొట్టండి.. లాక్‌డౌన్ పాటిద్దాం.. పోలీసులకు సహకరిద్దాం... అంటూ ఇలా కరోనా మహమ్మారి చిత్రాన్ని రూపొందించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, మంచిర్యాల



చిన్నారులిచ్చిన విరాళంతో పేదలకు నిత్యావసరాలను అందచేస్తున్న ఏసీపీ వినోద్‌కుమార్, సీఐ మల్లేశ్

## చిన్నారుల దాతృత్వం

లాక్‌డౌన్‌తో పనులు లేక ఇబ్బంది పడుతున్న పేద కుటుంబాలను ఆదుకునేందుకు ఆ చిన్నారులు తమ కిడ్డీ బ్యాంకులో దాచుకున్న సొమ్మును విరాళంగా అందజేసి దాతృత్వం చాటుకున్నారు. జనగామకు చెందిన మర్యాల భిక్షపతి, మంజుల దంపతుల కుమారుడు శ్రీనివాస్, కుమార్తెలు శ్రేయ, ప్రవళిక తమ కిడ్డీ బ్యాంకులోని రూ.65 వేలను పేద కుటుంబాల ఆకలి తీర్చేందుకు అందజేశారు. ఈ మేరకు 65 కుటుంబాలను గుర్తించి రూ.వెయ్యి చొప్పున నిత్యావసరాలు పంపిణీ చేయాలని అధికారులను కోరగా.. శనివారం ఏసీపీ వినోద్‌కుమార్, సీఐ మల్లేశ్ అందజేశారు.

– జనగామ



సర్వే నిర్వహిస్తున్న సర్పంచ్ తదితరులు

## మద్యం వద్దు.. పాలు ముద్దు!

లాక్‌డౌన్‌తో వైన్స్‌లు, బార్లు మూతపడగా మద్యం అలవాటున్న మందుబాబులు.. ఎప్పుడెప్పుడు షాపులు తీస్తారా అని ఎదురు చూస్తున్నారు. అయితే, లాక్‌డౌన్ ఉన్న ఈ సమయంలోనే అలాంటివారి చేత మద్యం మానేయించేందుకు ప్రయత్నిస్తే మంచి ఫలితాలు ఉంటాయని భావించి మద్యపాన ప్రియులకు ఉచితంగా పాలు అందజేస్తామని వరంగల్ రూరల్ జిల్లా మరియపురం సర్పంచ్ అల్లం బాలిరెడ్డి ప్రకటించారు. తాగుడు మానుకోవడానికి ప్రతిరోజు అర లీటర్ పాలు ఉచితంగా అందిస్తామని వెల్లడించారు. శనివారం ఆయన గ్రామస్తులతో సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత గ్రామంలో మద్యానికి బానిసైన వారితో పాటు ఎలాంటి ఆసరా లేని వృద్ధులు, పేదలు, ఒంటరి మహిళలు, వికలాంగులు ఎందరు ఉన్నారో సర్వే చేయగా 41 మంది ఉన్నట్లు తేలింది. దీంతో గ్రామంలోని పాడి రైతుల నుంచి సేకరించి ప్రతీ ఒక్కరి రోజుకు అర లీటర్ చొప్పున పాలు ఇవ్వాలని నిర్ణయించారు.

– గీసుకొండ



కోటి రూపాయల విరాళం చెక్కును సీఎం కేసీఆర్‌కు అందచేస్తున్న ఎస్ఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ ఎనగందుల సంతోష్‌రెడ్డి తదితరులు

## సీఎంఆర్ఎఫ్‌కు కోటి విరాళమిచ్చిన ఎస్ఆర్ విద్యాసంస్థలు

సాక్షి, హైదరాబాద్: కరోనాపై పోరులో ప్రభుత్వానికి తోడుగా నిలిచేందుకు ఎస్ఆర్ విద్యాసంస్థలు ముందుకువచ్చాయి. సీఎం సహాయనిధికి తమ వంతు సాయంగా రూ. కోటి విరాళమిచ్చాయి. ఈ మేరకు శనివారం ఎస్ఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ ఎనగందుల సంతోష్‌రెడ్డి సీఎం కేసీఆర్‌ను కలిసి చెక్ అందజేశారు. అలాగే ఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ డైరెక్టర్ మధుకర్‌రెడ్డి కూడా సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 25 లక్షలు విరాళమిచ్చారు. దీనికి సంబంధించిన చెక్‌ను మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌కు అందజేశారు.

# ఘాటెక్కిన హవానా చుట్ట!

## గ్రహం అనుగ్రహం

శ్రీ శార్వరి నామ సంవత్సరం
ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం, తిథి బ.పంచమి రా.10.46 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం జ్యేష్ఠ రా.12.30 వరకు, తదుపరి మూల
వర్జ్యం ఉ.6.39 నుంచి 8.11 వరకు
దుర్ముహూర్తం సా.4.30 నుంచి 5.21 వరకు, అమృతఘడియలు... ప.3.56 నుంచి 5.54 వరకు.

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం : 6.10
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

ట్రంప్ (అమెరికా అధ్యక్షుడు)

## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

చేతులు ముఖానికి అంటించుకోడానికి లేదు. ముఖానికి రుద్దుకోడానికి లేదు. కళ్లు నులుముకోడానికి లేదు. చూపుడు వేలిని, మధ్య వేలిని కలిపి తుపాకీలా కణతల దగ్గర అలవాటు ప్రకారం పెట్టుకోడానికి లేదు. ఏదీ పట్టించుకోని వాడికి నాకే ఇలా ఉందంటే అన్నీ పట్టించుకునే ప్రపంచానికి ఎలా ఉందో!

"మిస్టర్ ప్రెసిడెంట్ మీరేం చేయబోతున్నారు?"

వైట్‌హౌస్ కరోనా మీటింగ్‌లో ఎవరిదో గర్జన.. 'హ్యాండ్స్ అప్' అన్నట్లు!

ఆ సింహం ఎవరా అని చూశాను. 'ఇట్స్ మీ' అంది ఆ చెయ్యి. చేతికి గ్లవుజ్ ఉంది. ముఖానికి మాస్క్ ఉంది.

"నువ్వు వాషింగ్టన్ పోస్టు అనే చెత్త పత్రిక నుంచి వచ్చి ఉంటే కనుక నేనేం చేయబోతున్నదీ తెలుసుకునే కర్మ నీకు లేదు. ఎలాగూ నువ్వు రాయదలచుకున్నదే కదా నువ్వు రాస్తావు." అన్నాను.

"నేను వాషింగ్టన్ పోస్టు నుంచి రాలేదు" అంది ఆ చెయ్యి.

ఆ చేతి వంక కొన్ని క్షణాలు ఆపేక్షగా చూశాను. గ్లవుజును తొలగించి ఆ చేతిని తాకాలన్న కోరిక కలిగింది. అతడు వాషింగ్టన్ పోస్టు నుంచి రానందు వల్ల నాలో జనించిన ఆపేక్ష కాదు అది. వాషింగ్టన్‌లో ఎవర్ని చూసినా మొదట వాళ్ల చేతుల మీదకే పోతోంది నా మనసు. కరోనాలో ఒక మంచితనం ఉంది. మన చేతులతో మన ముఖాన్ని తాకనివ్వదు కానీ, మన ముఖంతో అవతలి వాళ్ల చేతుల్ని ఎంత దూరాన్నుంచయినా తాకనిస్తుంది.

"వాషింగ్టన్ పోస్టు నుంచి రాకపోతే.. నా



భార్య నిద్ర లేవగానే చూస్తూ కూర్చుండే ఆ దరిద్రపు గొట్టు సీఎన్ఎన్ చానల్ నుంచి వచ్చావా?" అని అడిగాను.

"లేదు మిస్టర్ ప్రెసిడెంట్. నేను మీ దేశపు వార్తాపత్రిక నుంచి కానీ, మీ దేశపు న్యూస్ చానల్ నుంచి కానీ రాలేదు. లండన్‌లోని రాయిటర్స్ న్యూస్ ఏజెన్సీ ప్రతినిధిని నేను. కరోనా వైరస్ నుంచి అమెరికన్ ప్రజల్ని కాపాడేందుకు ఈ అత్యవసర సమావేశంలో మీరేం నిర్ణయం తీసుకోబోతున్నారు?" అన్నాడు ఆ చెయ్యి గల మనిషి.

"ముందొక విషయాన్ని మీరు గ్రహించాలి మిస్టర్ రాయిటర్స్. ఇది అత్యవసర సమావేశం కాదు. సమావేశం. మామూలు దగ్గు జలుబుల వంటి సమావేశం. ఇండియా నుంచి వస్తున్న క్లోరోక్విన్ బిళ్లలు వేసుకుంటే తగ్గిపోయే జ్వరంలాంటి సమావేశం" అన్నాను.

"కానీ మిస్టర్ ప్రెసిడెంట్. మీరంటున్న మామూలు దగ్గు జలుబులతో మరణిస్తున్న వారు మీ దేశంలో ఎక్కువవుతున్నారు. మీరు ఏర్పాటు చేసిన సమావేశం అత్యవసరం అయింది కాకపోవచ్చు. కానీ అత్యవసరంగానే కదా ఏర్పాటు చేశారు. చెప్పండి. మీరేం నిర్ణయం తీసుకోబోతున్నారు? యు.ఎస్.లో లాక్‌డౌన్‌ను ఎత్తివేసే మూడ్‌లో ట్రంప్ ఉన్నారని మాకేవో వార్తలు అందుతున్నాయి" అన్నాడు!

"నా నిర్ణయాలింకా నా ఫోర్‌హెడ్‌లోనే ఉన్నాయి. అలాంటప్పుడు వార్తలుగా అవి మీకెలా అందుతాయి" అన్నాను వేళ్లను నుదుటికి ఆన్చుకుని.

"అవి ఎప్పుడు బయటికి వస్తాయి.. మీ ఫోర్‌హెడ్ నుంచి!" అన్నాడు.

"లాక్‌డౌన్ ఎత్తివేయడం అంటే ఎకానమీని రీ-ఓపెన్ చెయ్యడం. నేను రీ-ఓపెన్ గురించి చెబుతున్నాను. నువ్వు ఎత్తివేత గురించి అడుగుతున్నావు" అన్నాను.

"కానీ ప్రాణాలు ముఖ్యమైనవి కదా మిస్టర్ ప్రెసిడెంట్.." అంటున్నాడు.

"అమెరికాలో మూతికి మాస్క్ కట్టుకుని కనిపించే ఏకైక వ్యక్తిని నేనే అవుతాను మిస్టర్ రాయిటర్స్. పౌరుల ప్రాణాల గురించి నువ్వు రాసుకో. పౌరవ్యవస్థ ఎకానమీ ప్రాణాల గురించి నేను ఆలోచిస్తాను" అన్నాను.

ప్రపంచం ఇంకా చిన్నదైంది. ఆర్థిక విధానాల గ్లోబలైజేషన్‌తో తొలిసారి కుచించుకుపోయిన భూగోళం, దాని వెన్నంటే వచ్చిన కమ్యూనికేషన్ విప్లవంతో అరచేతిలోకి చేరిపోయింది. ఇప్పుడు మనం మహమ్మారిగా పిలుచుకుంటున్న కోవిడైజేషన్ ఆ గ్లోబ్ ధరించిన రకరకాల రంగురంగుల వస్త్రాలను విప్పేసింది. నగ్నంగా నిలబెట్టింది. గొప్పదేశాల గోత్రాలు తెలిసిపోతున్నాయి. చిన్న దేశాల సందేశాలు చెవిసోకుతున్నాయి. రెండొందల పై చిలుకు దేశాల పేర్లు వార్తల్ని బ్రేక్ చేస్తున్నాయి. అంతా అనుకున్నట్టుగానే జరిగి వుంటే ఈ జూలైలో ఒలింపిక్స్ ప్రారంభమై ఉండేవి. నెలరోజులపాటు ప్రపంచం దృష్టి అటు మళ్లి వుండేది. మెడల్స్ గెలిచిన దేశాల పట్టిక మీడియా హైలైట్‌గా వుండేది. కాని ఆ పట్టికలో చాలా దేశాలకు చోటు దొరికి ఉండేది కాదు. ఈ కరోనా పట్టిక అలా కాదు. రెండొందల పైచిలుకు దేశాలకు చోటు కల్పించింది. వీటిలో కొన్ని దేశాల మీదే ప్రజల దృష్టి ఎక్కువగా లగ్నమైంది. వైరస్ ప్రారంభమైన చైనా, అల్లాడుతున్న ఇటలీ, స్పెయిన్‌లతో పాటు ఇంకో రెండు పేర్లు, రెండు వేర్వేరు కారణాల రీత్యా టాక్ ఆఫ్ ది గ్లోబ్‌గా నర్తిస్తున్నాయి. అవి అమెరికా, క్యూబా. పక్కపక్కనే ఉంటాయి. ఇరుగూ పొరుగే కానీ, ఈడూ జోడూ అస్సలు కుదరదు. రెంటి మధ్యన హస్తిమశకాంతరం.



## జనతంత్రం



వర్ధెల్లి మురళి

అమెరికా ఏనుగైతే క్యూబా దోమ. సైజులోనే కాదు సంపదలో కూడా. మన దేశంలో నిరక్షరాస్యులక్కూడా పరిచయం అవసరం లేని పేరు అమెరికా. అది కూడా మనదే, బలిసినవాళ్లుండే బంజారా హిల్స్ లాగా... కాకపోతే ఇంకాస్త పెద్దది అనుకునేవాళ్లు కోకొల్లలు. 'మావాడు అమెరికాలో తాసిల్దారయితే చూడాలని ఉందండీ' అంటాడు కోట శ్రీనివాసరావు అదేదో సినిమాలో. మధ్యతరగతి వాళ్లకయితే అమెరికా అంటే ఒక జీవితాశయం. పిల్లల్ని బాగా చదివిస్తే అమెరికాకు వెళ్తారు. డాలర్లు సంపాదిస్తారు. అవి ఇండియాకు వచ్చి రూపాయలుగా మారుతాయి. వాటితో పొలం పుట్రా కొనేసి పెట్టొచ్చు పిల్లల కోసం... ఆ డాలర్ డ్రీమ్స్‌తోనే కొవ్వొత్తులుగా మారుతారు తల్లిదండ్రులు. చాలా మంది సాధిస్తారు. చివరకు తమకు మాత్రమే కనిపించే లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ మెమెంటోను చూసుకుంటూ శేష జీవితం గడుపుతున్న తల్లిదండ్రులు లేని ఊరులేదు మన దేశంలో. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో. ఇక క్యూబా సంగతి. మన దేశంలో ఆ పేరు చాలా కొద్దిమందికే తెలుసు. ఫిడెల్ కాస్ట్రో కాల్చిపారేసిన కొహిబా బ్రాండ్ హవానా చుట్టలకూ, చేగువేరా బొమ్మలు వుండే టీ-షర్టులకు ప్రపంచమంతటా ఉన్నట్టే మన దగ్గర కూడా అంతో ఇంతో క్రేజ్ ఉంది. మన నవతరంలో ఎక్కువమందికి క్యూబా గురించి అంతకుమించిన ఆసక్తి వుండే అవకాశం లేదు. అమెరికాకు ఆగ్నేయంగా వున్న ఫ్లోరిడా తీరానికి 90 మైళ్ల దూరంలో వుంది క్యూబా. ఈ తొంబై మైళ్ల దూరానికి ఒక అరవై ఏళ్ల స్టోరీ కూడా వుంది. అమెరికా-రష్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం తీవ్రంగా వున్న రోజుల్లో కాస్ట్రో కమ్యూనిస్టు కనుక క్యూబా రష్యా అనుకూల వైఖరితో ఉండేది. ఇది అమెరికాకు కంట్లో నలుసులాంటి సమస్య. చివరకు కెనెడీ క్యూబాను బెదిరిస్తాడు. 'అమెరికాకు కేవలం 90 మైళ్ల దూరంలోనే క్యూబా వుంది జాగ్రత్త'. కాస్ట్రో కూడా అందుకు దీటుగా సమాధానం చెబుతాడు. 'అవును, అమెరికాకు క్యూబా 90 మైళ్ల దూరంలోనే ఉంది. అంతేకాదు, క్యూబాకు కూడా అమెరికా 90 మైళ్ల దూరంలోనే ఉంది గుర్తు పెట్టుకోండి'. 'దీవార్' సినిమాలో అమితాబ్ బచ్చన్‌తో 'మేరే పాస్ మా హై' అని శశికపూర్ చెప్పినంత నిబ్బరంగా కాస్ట్రో కూడా అమెరికాకు చెబుతాడు. మహామేరువు లాంటి అమెరికాకు పిపీలికమంత క్యూబా సవాలు విసరడమా? ఆ ధైర్యం వెనుక రహస్యమేమిటి? ఇంకేముంటుంది రష్యా తప్ప అన్నారంతా. కానేకాదు, ఆ ధైర్యం క్యూబా సామాజిక వ్యవస్థ సమకూర్చిన ఆత్మబలం అని తదనంతర పరిణామాలు నిరూపించాయి. కాస్ట్రో తర్వాత క్యూబా విప్లవంలో ప్రముఖపాత్ర పోషించిన చేగువేరా నిజానికి క్యూబా దేశస్తుడు కాదు. అమెరికాలాంటి సామ్రాజ్యవాద దేశానికి ముగుతాడు వేయాలంటే ఒక్క క్యూబాలోనే కాదు అమెరికా ఖండంలోని అన్ని దేశాల్లోనూ విప్లవ ప్రభుత్వాలు ఏర్పడాలని కాంక్షిస్తూ, ఒక విశ్వమానవుడిగా ఆ పోరాటాల్లో పాల్గొంటూ చివరకు బొలీవియా అడవుల్లో హత్యకు గురవుతాడు. భారత్‌కు భగత్ సింగ్‌లాగా చేగువేరా ప్రపంచాబ్జపు తెల్లరేకై పల్లవించాడు. ఒక నాడు అమెరికా ఆంక్షల కారణంగా ఔషధాలు లభించక, కనీస వైద్యసేవలు అందుబాటులో లేక అవస్థలు పడిన క్యూబా అనతి కాలంలోనే అత్యుత్తమమైన ప్రజారోగ్య విధానాన్ని అమలు చేయ గలిగింది.

ఈ రోజున క్యూబాలో ప్రతి వెయ్యిమంది జనాభాకు ఒక డాక్టర్ అందుబాటులో ఉన్నాడు. ప్రాథమిక రోగ నివారణ పద్ధతులు, ప్రజారోగ్యంపై సామాజిక, కుటుంబ, ఆర్థిక, మానసిక కారణాల ప్రభావం ఎలా ఉంటుందనే అంశాలు కూడా అక్కడి వైద్యవిద్యలో పాఠ్యాంశాలుగా ఉంటాయి. వైద్యరంగం మొత్తం ప్రభుత్వ అధీనంలోనే ఉంటుంది. కొన్ని కుటుంబాలకు కలిపి ఒక డాక్టర్‌ను, నర్సును కేటాయిస్తారు. ఆ కుటుంబాల్లోని సభ్యులందరి ఆరోగ్య జాతకాలు సంబంధిత ఫ్యామిలీ డాక్టర్, నర్సుల దగ్గర ఉంటాయి. వారి పరిధిలో కుటుంబాలను తరచుగా వారింటికే వెళ్లి డాక్టర్, నర్సు పలకరిస్తుంటారు. అందువల్ల సహజంగానే ఆరోగ్యపరమైన అవగాహన, చైతన్యం సమాజంలో ఎక్కువ. పెద్దగా వనరుల్లేని చిన్న దేశం, పేదదేశమైన క్యూబాలో సగటు ఆయుర్దాయం 79.74 ఏళ్లుగా ఉంది. ఇది అమెరికా కంటే ఒక సంవత్సరం, భారత్‌కంటే పదేళ్లు ఎక్కువ. వైద్య రంగాన్ని ప్రైవేట్‌కు వదిలేసిన సూపర్ పవర్ అమెరికా వైరస్ దాడికి చిగురుటాకులా వణికిపోతుంటే పక్కనే ఉన్న క్యూబా తన దేశంలో నిలువరించగలిగింది. పైగా తన వైద్యులను ఇటలీ, స్పెయిన్, ఇరాన్ తదితర అనేక దేశాలకు పంపించి సమస్త మానవాళి తరపున క్యూబా పోరాటం చేస్తున్నది. అమెరికా మాత్రం చేతులెత్తేసింది. మందుల కోసం భారత్‌ను దేబిరిస్తున్నది. మిస్టర్ జాన్‌ఎఫ్ కెనెడీ... మిమ్మల్ని క్యూబా ఓడించింది. రష్యా అండతో కాదు. ఆత్మబలం అండతో, ఆశయబలం అండతో.

అమెరికా, క్యూబా రెండూ విభిన్నమైన సామాజిక- రాజకీయ-ఆర్థిక వ్యవస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. రెండు విరుద్ధ భావాలకు ఇవి ప్రతీకలు. అమెరికా, యూరప్, ఇతర పెట్టుబడిదారీ దేశాల మౌలిక సిద్ధాంతం పెట్టుబడి చుట్టూ తిరుగుతుంది. దానిపై వచ్చే లాభాల చుట్టూ తిరుగుతుంది. అందువల్ల విద్య, వైద్యం సహా సమస్త రంగాలను ప్రైవేట్‌పరం చేశాయి. కమ్యూనిస్టులు, సోషలిస్టులు, సోషల్ డెమోక్రాట్లు తరతమ భేదాలతో ఈ విధానాన్ని వ్యతిరేకిస్తారు. పెట్టుబడి కేంద్రక అభివృద్ధికి బదులు మానవకేంద్రక అభివృద్ధిని ప్రతిపాదిస్తారు. అందువల్ల ఈ వ్యవస్థలో మౌలిక రంగాలన్నీ ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత మిగిలిన ఇరవయ్యో శతాబ్దపు చరిత్ర అంతా ఈ రెండు వ్యవస్థల మధ్య జరిగిన ప్రచ్ఛన్న యుద్ధ చరిత్రే. ఈ యుద్ధం ఫలితంగా పెట్టుబడిదారీ వ్యవస్థ ఉదారవాదం ముసుగు వేసుకొని శ్రామికులను, సాధారణ ప్రజలను ఆకర్షించగలిగింది. కమ్యూనిస్టు ఆర్థికాభివృద్ధికి ఉన్న పరిమితుల కారణంగా ఈ యుద్ధంలో సోవియట్ రష్యా శిబిరం ఓడిపోయింది. ఇప్పటికీ కమ్యూనిస్టు రాజ్యాలుగా చెప్పుకుంటున్న చైనా, క్యూబా, వియత్నాం దేశాలు వైరస్ వ్యాప్తిని విజయవంతంగా కట్టడి చేశాయి. రష్యాతోపాటు కమ్యూనిస్టు పాలనను వదిలించుకొని పెట్టుబడిదారీ వ్యవస్థలోకి జారిపోయిన సుమారు 25 తూర్పు యూరప్, సెంట్రల్ ఆసియా దేశాలు కూడా ఈ విషయంలో మెరుగ్గానే వున్నాయి. యూరప్‌లో సగభాగమైన తూర్పు యూరప్‌లోని మొత్తం కరోనా మరణాల సంఖ్య ఒక్క బ్రిటన్ మృతుల సంఖ్య కంటే కూడా తక్కువ. ఇటలీ, స్పెయిన్, ఫ్రాన్స్‌ల తర్వాత మరణాల సంఖ్యలో యూరప్‌లో నాలుగో స్థానం బ్రిటన్‌ది. తూర్పు యూరప్ దేశాల విద్య, ఆరోగ్య వ్యవస్థల్లో ఉన్న సోషలిస్టు పునాదుల కారణంగానే ఈ తేడా ఉన్నదనే వాదాన్ని గట్టిగా ఖండించలేము. కరోనా ఎపిసోడ్ నుంచి భారత ప్రజాస్వామ్య వ్యవస్థ నేర్చుకోవాల్సిన పాఠం ఉన్నది. వేలంవెర్రిగా ప్రైవేటీకరణవైపు పరుగులు తీయకుండా కనీసం ప్రాథమిక వైద్యం, ప్రాథమిక విద్యలనైనా పూర్తిగా ప్రభుత్వ అజమాయిషీలోకి తెచ్చుకోవాలి. ఇప్పుడు దేశంలో జరుగుతున్న కరోనా వ్యతిరేక పోరాటంలో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల పాత్ర దాదాపు పూజ్యం. ప్రభుత్వ వైద్యులు ప్రాణాలకు తెగించి పని చేస్తుంటే కార్పొరేట్ వైద్యులు మీడియా ఇంటర్వ్యూల్లో ఉచిత సలహాలు పారేసే పనిలో బిజీగా గడుపుతున్నారు. హైదరాబాద్‌లో నిరంతరం పేషెంట్లతో కిటకిటలాడే రెండు మూడు కార్పొరేట్ ఆస్పత్రులను లాక్ డౌన్ పీరియడ్‌లో పరిశీలించడం జరిగింది. పేషెంట్ల సంఖ్య 30 శాతానికి పడిపోయింది. ఆశ్చర్యకరమైన విషయం ఎమర్జెన్సీ కేసులు కూడా ఇరవై శాతానికి పడిపోవడం. కరోనాను చూసి గుండెపోట్లు, కిడ్నీ ఫెయిల్యూర్స్‌లాంటివి కూడా జడుసుకున్నాయా? ఎమ్ఆర్ఐ స్కానర్లు, సీటీ స్కానర్లు కూడా మూలనపడ్డాయి. వాటి అవసరమే కలగడం లేదు. వైద్యసేవలు అందక రోగాలతో చనిపోయే (నాన్-కరోనా) వారి సంఖ్య కూడా పెరగలేదు. పైపెచ్చు తగ్గింది. కార్పొరేట్ ఆస్పత్రులు పేషెంట్లను భయపెట్టి కృత్రిమ ఎమర్జెన్సీ కేసులను సృష్టిస్తున్నాయని బోధపడటం లేదా?

కరోనా అనంతరం జరగబోయే పరిణామాలపై ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. కరోనా ముగింపు ఏ రకంగా ఉండబోతున్నదో ఎవరికీ ఊహకందడం లేదు. జరగబోయే విధ్వంసం ఎంతో ఎవరూ అంచనా వేయలేకపోతున్నారు. భారతదేశంలో తొలి కరోనా మరణం సంభవించిన నెలరోజుల తర్వాత నేటికి ఆ సంఖ్య 250కి చేరింది. నెల రోజుల వ్యవధిలో టీబీ వ్యాధితో చనిపోతున్న వారి సంఖ్య ఇంతకంటే ఎన్నో రెట్లు ఎక్కువ. డెంగీతో, విషజ్వరాలతో ఇంతకంటే ఎన్నోరెట్లు ఎక్కువమంది చనిపోయారు. కాకపోతే వాళ్లంతా పేదవర్గాల ప్రజలు. మనదేశంలో కరోనా లాక్‌డౌన్ ఫలితంగా ముందు ముందు సంభవించబోయే జీవన విధ్వంసం మరింత భయంకరంగా ఉండబోతున్నది. లక్షలాది చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడబోతున్నాయి. కోట్లాదిమంది ఉపాధి కోల్పోబోతున్నారు. అమెరికాలోనే లక్షలాదిమంది ఉద్యోగాలు కోల్పోతారన్న అంచనాలు వస్తున్నవి. ఈ ఫలితాలు రాజకీయ వ్యవస్థల మీద ఎటువంటి ప్రభావం చూపబోతున్నాయో స్పష్టతరాలేదు. అమెరికాలో ఈ ఏడాది చివర్లో అధ్యక్ష ఎన్నికలు జరగాలి. డెమోక్రటిక్ అభ్యర్థిగా పోటీపడిన బెర్నీ శాండర్స్ మధ్యలో తప్పుకోవడం ఆ దేశంలోని ఉద్యోగులకు, శ్రామికులకు, పేదలకు అశనిపాతం లాంటిది. మళ్లీ ట్రంప్ గెలిస్తే ఉద్యోగాల ఊచకోత తప్పకపోవచ్చు. కానీ, అంతర్జాతీయంగా అమెరికా ప్రతిష్ట ఒక మెట్టు కిందకు దిగుతుంది. చైనా ఒక మెట్టు పైకి ఎక్కవచ్చు. అంతమాత్రాన అది తక్షణం అగ్రరాజ్యం కాజాలదు. ఎక్కాల్సిన మెట్లు ఇంకా ఉన్నాయి. మూడవ ఆర్థిక శక్తిగా ఎదగాలన్న భారత ఆకాంక్షలను లాక్‌డౌన్ పుణ్యమా అని మరో ఐదేళ్లో పదేళ్లో వాయిదా వేసుకోవలసి రావచ్చు. ఆ స్థానం జర్మనీ కైవసం కావచ్చు. భారత రాజకీయాల్లో ప్రస్తుతానికి నరేంద్ర మోదీకి పోటీ లేదు. ఆర్థిక వ్యవస్థను ఆయన గాడిలో పెట్టే తీరుపై వచ్చే ఎన్నికలు నాటి పరిస్థితి ఆధారపడి ఉంటుంది.

చివరగా లాక్‌డౌన్‌లో గడుపుతున్నవారి కోసం ఒక చిన్న **పొడుపు కథ:** ఆయన ఇప్పుడు ముఖ్యమంత్రి కాదు. అయినా స్కూల్ పిల్లలు మోడల్ అసెంబ్లీని ప్రదర్శించిన పద్ధతిలో వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తున్నారు. పార్టీ కార్యకర్తలనే కలెక్టర్లుగా భావించి ముఖ్యమంత్రి వేషంలో ఆదేశాలు జారీ చేస్తున్నారు. కరోనా మహమ్మారి నేపథ్యంలో ప్రపంచంలోని అన్ని దేశాలు రాజకీయ విభేదాలు పక్కనపెట్టాయి. ట్రంప్ వైఫల్యం కనిపిస్తున్నా ఆయన ప్రత్యర్థి కాబోతున్న జో బిడెన్ కూడా ఏమీ అనడంలేదు. కానీ ఆయన మాత్రం ప్రతిరోజూ విమర్శలనే పనిగా పెట్టుకున్నారు. ఎవరాయన? **క్లూ:** అడిగినవారికీ అడగని వారికీ తన ఆటోబయోగ్రఫీ వినిపించే అలవాటు ఆయనకు బాగా ఎక్కువ. మహాత్మాగాంధీ, లియోటాల్‌స్టాయ్, అబ్రహాం లింకన్, కులీకుతుబ్‌షా తదితరుల బయోగ్రఫీల్లోని కొన్ని భాగాలను పొరపాటున తన బయోగ్రఫీలో కలిపి చెప్పుకోవడం కూడా కద్దు.

**వీరివీరి గుమ్మడి పండు వీరి పేరేమి?**

muralivardelli@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### హీరోస్



ఆసుపత్రుల్లో ప్రాణాలను కాపాడుతున్న సూపర్ హీరోలందరికీ ఈ సందర్భంలో హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. కోవిడ్-19పై పోలీస్ విభాగం పెద్ద యుద్ధమే చేస్తోంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో మాకు, మా కుటుంబాలకు రక్షణగా నిలిచినందుకు వారందరికీ కృతజ్ఞతలు. – వెంకటేష్, హీరో

### లోగో



ఇటువంటి ట్వీట్ చేస్తున్నందుకు నన్ను మన్నించాలి. మన దూరదర్శన్ వాటర్ మార్క్‌ను కూడా తొలగించకుండా మోసర్ బేర్ డీవీడీ నుంచి రామాయణాన్ని అందిస్తోంది. – నేహా దీక్షిత్, జర్నలిస్ట్

### వైరస్



ద వైర్‌లో వచ్చిన ఒక కథనానికిగాను ఎస్. వరదరాజన్‌కు సమన్లు అందజేయడానికి ఏడుగురు పోలీసులు 700 కిలోమీటర్ల దూరం ప్రయాణించి వచ్చారు. ఈ బెదిరింపుల వైరస్ ఆమోదయోగ్యం కాదు. దీన్ని వెంటనే నిలిపివేయాలి. భావ ప్రకటనా స్వేచ్ఛను, పత్రికా స్వేచ్ఛను రక్షించాలి. – సునీత అరోరా, జర్నలిస్ట్

### ధరలు



ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లాలో గల ధంధా మార్కెట్లో ఇరవై కేజీల వంకాయలు రూ. 10, మూడు బస్తాల మిర్చి రూ. 50.. ఇలా ఉన్నాయి ధరలు. మూడు నెలలపాటు కష్టపడిన రైతులకు దక్కుతున్న ప్రతిఫలమిది. ఆర్థిక వ్యవస్థ పతనం కారణంగా వాళ్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఊహించుకోవచ్చు. – దేవిందర్ శర్మ, కాలమిస్ట్

### గ్రౌండ్



కరోనా ఆపత్కాలంలో రాజకీయాలు చేయకుండా జనసేన స్వీయ నియంత్రణ పాటిస్తోందట. రాజకీయాలు చేయడానికి నీకు గ్రౌండే లేదు కదా పవన్. ఎక్కడో హైదరాబాద్‌లో కూర్చుని 'నేను లేస్తే మనిషిని కాదు' అని చిటికె లేసినట్టుగా ఉంది నీ వాలకం. ప్రజా తీర్పును అప్పుడే మర్చిపోతే ఎలా? – విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

### గోశాల



లాక్‌డౌన్ సందర్భంగా గోశాలలోని ఆవులకు ఆహారం ఏర్పాటు చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కోరమంగళలోని ప్రాణి దయ సంఘ గోశాలకు వెళ్లి ఆహార ఏర్పాట్లను పర్యవేక్షించాను. అక్కడి బృందం దాదాపు 1100 ఆవుల బాధ్యతలను స్వీకరిస్తున్నారు. మీరు కూడా మీ దగ్గర గోశాలలకు సహాయం అందజేయండి. – తేజస్వీ సూర్య, బీజేపీ నేత

### మరణం



కరోనా మృతుల గురించి మనం ప్రతిరోజూ వింటూనే ఉన్నాం. కానీ, కశ్మీర్‌లోని పాఠశాలలో చదువుకునే రోజుల్లో నాకు అత్యంత సన్నిహితురాలైన సహాధ్యాయి యూఏఈలో కరోనాతో మరణించిందని తెలియగానే నా హృదయం ముక్కలయ్యింది. ముగ్గురు కూతుళ్లను వదిలి వెళ్లిపోయిందామె. చివరి బిడ్డ వయసు కేవలం ఆరు నెలలే. ఇప్పటికీ నాకు నమ్మశక్యం కావడం లేదు. – తబీనా అంజుమ్, జర్నలిస్ట్

## కష్టాల్లో అమెరికా రైతు

కరోనా వైరస్ మహమ్మారి ప్రపంచంలో అన్ని దేశాలనూ గడగడలాడిస్తోంది. అగ్రరాజ్యం అమెరికాయే దిక్కుతోచని స్థితిలో పడింది. ఆ దేశంలో అన్ని రంగాలనూ దెబ్బతీసినట్టే వ్యవసాయాన్ని, పాడిపరిశ్రమనూ ఈ వైరస్ వణికిస్తోంది. పాడి రైతులు యథావిధిగా పనిచేస్తున్నా, ఆ దిగుబడులు మార్కెట్‌కు పోతాయో లేదో తెలియడం లేదు. పంపిణీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని, కొత్త పరిస్థితులకు అలవాటుపడకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరమైంది. పర్యావరణ నిబంధనల ప్రకారం రైతులవద్ద మిగిలిన పాలను ఎరువుల్లో కలిపి పొలంలో జల్లుకోవాలి. ఇప్పుడూ రోజూ అది తప్పడం లేదు. ఈ సంక్షోభం మొదలయ్యాక పాలకు గిరాకీ తగ్గింది. రెస్టరెంట్లు, హోటళ్లు, ఇతర మార్కెట్లు మూతబడటంతో ఏరోజు ఏమేరకు డిమాండ్ వుంటుందో రైతులకు తెలియడం లేదు. తృణధాన్యాలు, మొక్కజొన్న, పత్తి తదితరాలు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. ఈ సంక్షోభానికి మునుపే తృణధాన్యాలు పండించే రైతులు అమెరికా-చైనాల వైరంతో తీవ్రంగా నష్టపోయారు. ఇరు దేశాధినేతల మధ్యా సంధి కుదిరి ఇక అంతా బాగుంటుందని ఆశించేలోగా కరోనా దాడి మొదలైంది. నవంబర్‌లో అధ్యక్ష ఎన్నికలు రానున్న తరుణంలో అన్ని రంగాలూ ఇలా చతికిలబడటం అధ్యక్షుడు ట్రంప్‌ను బెంబేలెత్తిస్తోంది. అందుకే 'మిమ్మల్ని ఆదుకుంటా, నిరాశపడకండి' అంటూ ట్వీట్లు చేస్తున్నారు.

# ఆపత్కాలానికి జర్మనీ 'రిజర్వ్' నిధులు

విశ్లేషణ



అన్నెట్టీ వెయిష్‌బాహ్



కరోనా వైరస్ వ్యాప్తి సందర్భంగా అన్ని పరిశ్రమలూ మూతపడిన నేపథ్యంలో జర్మనీ భారీ స్థాయి లేఆఫ్‌లను నిరోధించడానికి ఒక సుపరిచిత ఆయుధాన్ని ఉపయోగిస్తోంది. దీంతో కార్మికులు పనిచేయనప్పటికీ వారికి వచ్చే వేతనంలో మూడింట రెండొంతులకంటే ఎక్కువ వేతనాన్నే పొందగలరు. అదేసమయంలో కంపెనీలకు కూడా తీవ్రమైన ఆర్థిక ఒత్తిడి సమయాల్లో ఉద్యోగులపై పెడుతున్న ఖర్చుల భారం కాస్త తగ్గుతుంది. కరోనా వైరస్ సాంక్రమిక వ్యాధి కాలంలో సుశిక్షితులైన తమ సిబ్బందిని తమతో అట్టిపెట్టుకునేందుకు లుఫ్తాన్సా, బీఎమ్‌డబ్ల్యూ, వోక్స్‌వేగన్, డైమ్లర్ వంటి కంపెనీలు ఇప్పటికే ఈ ప్రత్యేకమైన లేబర్ మార్కెట్ సాధనాన్ని ఉపయోగించుకున్నాయి.

విషయానికి వస్తే, జర్మనీలో దాదాపు 5 లక్షల కంపెనీలు తమ సిబ్బందిని తాత్కాలిక పని పథకాలకు పంపించివేశాయి. జర్మనీలో ఈ పథకాలను కుర్జార్‌బియట్ అని పిలుస్తారు. ఉద్యోగుల వేతనాల భారాన్ని తగ్గించుకోవడానికి జర్మనీ కంపెనీలు తక్షణమే ఈ పథకాన్ని అమలులో పెట్టేశాయి. జర్మనీ ఇటీవలి చరిత్రలో చివరకు 2008 అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం సమయంలో కూడా ఇంత అధిక స్థాయిలో తాత్కాలిక పని పథకాలకు అప్లికేషన్లు రాలేదు. ఈ తాత్కాలిక పని పథకం చాలా బాగా పనిచేసింది. గత సంక్షోభ కాలంలో భారీ స్థాయిలో లేఆఫ్‌లను నిరోధించే సాధనంగా ఇది తన పాత్ర నిర్వహించింది. ఈ పథకం ఉద్యోగులను ఇంటికే పరిమితం చేసింది లేక వారి పని గంటల్ని తగ్గించింది. అదే సమయంలో ఉద్యోగుల వేతనాల్లో మూడింట రెండొంతుల దాకా ప్రభుత్వమే చెల్లించడంతో ఉద్యోగులు అధికారికంగా కంపెనీ ఉద్యోగులుగా ఉంటూ వచ్చారు.

ఈ సందర్భంగా కుర్జార్‌బియట్ అటు ఉద్యోగులకు, ఇటు యజమానులకూ ఉపయోగపడే గొప్ప సాధనమైంది. అది ఏకకాలంలో ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించింది. ఇటు యజమానులకు రాబోయే నెలల్లో ఆర్థిక వ్యవస్థ డిమాండుకు తగినట్లుగా ప్లాన్ చేసుకునే విషయంలో వారికి మరింత భద్రతను కల్పించింది అని డాయిష్ బ్యాంకుకు చెందిన చీఫ్ జర్మన్ ఆర్థికవేత్త స్టీఫెన్ షెనిడర్ చెప్పారు. 2008 ఆర్థిక సంక్షోభంలో ఈ తాత్కాలిక పని విధానం నిరూపిత సాధనంగా నిలిచింది. 2009లో జర్మనీ ఆర్థిక ఫలితం 5 శాతం మేరకు కుదించుకుపోయినప్పుడు సంవత్సర కాలంలోనే సగటున 11 లక్షలమంది కార్మికులు తీవ్రంగా దెబ్బతిన్నారు. దీంతో బెర్లిన్ పది బిలియన్ యూరోల (10.9 బిలియన్ డాలర్లు)ను నష్టపోయింది. కానీ సంవత్సరాంతానికి, ఉపాధి రేటు 7.6 శాతం వద్ద నిలిచింది. ఇది 2008 కంటే తక్కువ.

కరోనా నేపథ్యంలో ఈసారి దాదాపు 23.5 లక్షలమంది ఉద్యోగులు ఈ 'కుర్జార్‌బియటెర్‌గెల్డ్' (తాత్కాలిక అలవెన్స్)లో చేరనున్నారని అంచనా. దీనివల్ల ఫెడరల్ లేబర్ ఆఫీసుకు 10 బిలియన్ యూరోల కంటే ఎక్కువ ఖర్చు అవుతుంది. కానీ జర్మనీ సాంప్రదాయికంగా తక్కువ ఖర్చు చేసి పొదుపుకు ప్రాధాన్యం ఇచ్చే దేశం కనుక, అలా ఆర్థిక పరిస్థితి సజావుగా సాగిన కాలంలో పొదుపు చేసిన నిధులను ప్రస్తుత సంక్షోభ సమయంలో వెచ్చించింది. చివరకు లేబర్ ఆఫీసు కూడా 26 బిలియన్ యూరోల నిల్వలను సిద్ధం చేసి ఉంచుకుంది. ఈ భారీ మొత్తం ఇప్పుడు కంపెనీలకు, ఉద్యోగులకు దన్నుగా నిలిచేందుకు ఉపయోగపడింది. గత సంక్షోభంలో వలే కాకుండా, ఇప్పుడు రెస్టారెంట్లు, కన్సల్టెంట్లు వంటి చిన్నచిన్న సర్వీస్ సంస్థలు ఈ తాత్కాలిక పని పథకాన్ని చక్కగా ఉపయోగించుకున్నాయి.

జర్మన్ కార్పొరేట్ ప్రపంచం మొత్తంగా తమ సిబ్బందిని తాత్కాలిక పని పథకాలకు పంపించారు. కరోనా వైరస్ సాంక్రమిక వ్యాధి విజృంభిస్తున్న కాలంలో అత్యుత్తమ శిక్షణ పొందిన తమ కార్మికులను పోగొట్టుకోకుండా ఉండటానికి లుఫ్తాన్సా, బీఎమ్‌డబ్ల్యూ, వోక్స్‌వేగన్, డైమ్లర్ వంటి దిగ్గజ సంస్థలు కుర్జార్‌బియట్ అని పిలుస్తున్న ఈ లేబర్ మార్కెట్ సాధనాన్ని ఈసారి చక్కగా వినియోగించుకున్నాయి. ఆహ్వానించాయి కూడా. అయితే ఈ వినూత్న పథకాన్ని ఇతర దేశాలు కూడా ఉపయోగించుకోబోతున్నాయి. యూరోపియన్ యూనియన్ ప్రెసిడెంట్ ఉర్సులా వోన్ డెర్ లియెన్ ఇతర దేశాల్లోనూ ఈ పథకాన్ని ప్రవేశపెట్టాలనే ఆలోచనను పంచుకున్నారు. దీని కోసం ఈయూ 100 బిలియన్ల యూరోలను సేకరించాల్సి ఉంటుంది. అయితే ఇంత భారీ మొత్తాలను పెంచాలంటే ఈయూ సభ్య దేశాలన్నీ హామీ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈ నిధిలో 25 శాతం కంటే ఎక్కువ మొత్తాన్ని జర్మనీయే భరించాల్సి ఉంటుంది కూడా. యూరో జోన్ పొడవునా కరోనా బాండ్స్ పేరిట సంయుక్త రుణ సాధనం ప్రాధాన్యాన్ని తగ్గించడానికి బదులుగా, ఇప్పటికే వైరస్ బారిన పడి భారీగా నష్టపోతున్న స్పెయిన్, ఇటలీ వంటి దేశాల్లో భారీగా ఉద్యోగాల కోతను నిరోధించడానికి తాత్కాలిక ఉపాధి పథకం పట్ల సంఘీభావం ప్రకటించాల్సి ఉంది.

– వ్యాసకర్త సీనియర్ రిపోర్టర్, సీఎన్‌బీసీ

### భారత వలస కార్మికుల దుస్థితి!

కరోనా వైరస్ విజృంభణతో మనం బెంబేలెత్తిపోతున్నాం కానీ, ఆపత్కాలంలో ఎదురీడానికి జర్మనీ రిజర్వ్ నిధులను ముందే సిద్ధం చేసుకుంది. దీని దన్నుతో ఉద్యోగుల వేతనాలకు చిల్లుపడకుండా జర్మనీలో అమలు చేస్తున్న తాత్కాలిక ఉపాధి పథకం యూరప్ ఖండానికి ఆదర్శప్రాయంగా మారబోతోంది. భారత అసంఘటిత కార్మికుల్లో 18 శాతంమందికి మాత్రమే కేంద్రప్రభుత్వ ప్రాయోజిత పథకాలు అందుతున్నాయని తాజా సర్వే ప్రకటించింది. రేషన్ కార్డు కానీ, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వివిధ పథకాలకు సంబంధించిన ప్రత్యేక కార్డులు కానీ మన దేశంలో కోట్లాది మంది వలస కార్మికులకు లేని కారణంగా లాక్‌డౌన్ పొడిగింపు దశలో వీరు తీవ్రంగా దెబ్బతిన్నున్నారు. జర్మనీ కార్మికుల సంక్షేమానికి 26 బిలియన్ యూరోలను నిల్వచేసి వాడుతుంటే.. భారత కేంద్ర ప్రభుత్వం జన్‌ధన్ ఖాతాల్లో అతిస్వల్ప మొత్తాన్ని మాత్రమే వేసి ఊరుకుంది. కానీ, కోట్లాది వలస కార్మికులకు నెల వారీ ఆదాయం లభించే ఏర్పాటు చేయకపోతే పరిస్థితులు దారుణంగా తయారవుతాయన్నది వాస్తవం.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
ఆదివారం ॥ 12-4-2020

# వాహ్.. కలెక్టర్ సాబ్

**దూకుడుగా వ్యవహరించడం కాదు చురుగ్గా ఆలోచించడం రావాలి.. కేడర్ ఒక్కటే కాదు తగిన సమయస్ఫూర్తీ కావాలి. ఆజ్ఞలివ్వడం సరిపోదు.. అందరినీ కలుపుకొని వెళ్లి పనిచేయించుకునే సామర్థ్యమూ ఉండాలి.. ఈ మూడు లక్షణాలతో మరో మూడు సూత్రాలను అమలు చేసి రాజస్థాన్‌లోని బిల్వారా జిల్లాలో కరోనా వైరస్‌కు చెక్ పెట్టారు డైనమిక్ కలెక్టర్ రాజేంద్ర భట్..**

కరోనాను కట్టడి చేయడంలో దేశమంతా కేరళ ప్రణాళికలవైపు చూస్తుంటే చడీచప్పుడు లేకుండా ఆ వైరస్ వ్యాప్తిని నిలువరించారు. కరోనా కొత్త కేసు ఒక్కటి కూడా లేకుండా చేశారు.. సాక్షాత్తూ ప్రధానమంత్రి దృష్టినీ బిల్వారా వైపు తిప్పారు ఆ జిల్లా కలెక్టర్, 56 ఏళ్ల రాజేంద్ర భట్. విజయ రహస్యం ఏమిటని అడిగితే 'అదేం భగీరథ ప్రయత్నం కాదు.. సింపుల్ త్రీ స్టెప్స్ ప్లాన్ అంతే' అంటారు వినమ్రంగా.

**ఈ మూడు సూత్రాలు..**

బిల్వారా.. వస్త్రపరిశ్రమకు పెట్టింది పేరు. కాబట్టి సహజంగానే వలసకార్మికులకు ఆవాసంగా మారింది. కరోనాకూ హాట్‌స్పాట్ అయింది మొత్తం 27 పాజిటివ్ కేసులతో. బిల్వారా వాసులకు తెలిసి.. భయంకంపితులు కాకముందే తక్షణ కార్యాచరణ మొదలుపెట్టాడు రాజేంద్ర భట్. పాజిటివ్ వచ్చిన వాళ్లను ఐసోలేషన్‌లో ఉంచడం, ఇంటింటికీ తిరిగి పరీక్షలు నిర్వహించడం, క్వారంటైన్‌ను అమలు చేయడం.. ముఖ్యమైన ఈ మూడు అంశాలే ఆయన కార్యాచరణ. ఆయనకు మాత్రమే తెలిసిన సీక్రెట్స్ కావు.. కరోనా నివారణలో జగమెరిగిన ఉపాయాలే.

**ఎలా మొదలుపెట్టారు?**

కరోనా కర్ఫ్యూను ప్రకటించే ముందు తన సిబ్బందిని డెయిరీ ఫామ్స్‌కు పంపించాడు రాజేంద్ర భట్.. ప్రతి ఇల్లు రోజుకు ఎన్ని పాలను కొంటారో లెక్క తీయమని. అలాగే నిత్యావసరాల నిల్వలు, సరఫరా ఎంతో కూడా బేరీజు వేసుకున్నాడు. రోజుల తరబడి ఇంట్లో ఉన్నా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని రాష్ట్రప్రభుత్వాన్ని కోరాడు జిల్లా సరిహద్దులు మూసివేయడానికి అనుమతి ఇవ్వాలని. వెంటనే ఓకే చేసింది ప్రభుత్వం. అంతేకాదు బిల్వారాలోని ఆసుపత్రులు, హోటళ్లు మొదలైన అన్నిటిమీదా పూర్తి అధికారాలు ఇచ్చేసింది రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం. ఆ వెంటనే ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేయించారు. గ్రామాల నుంచి పట్టణాల దాకా జిల్లా మొత్తం పొలిమేరలు మూసి వేయించారు. వైద్య సిబ్బంది దిని 24 గంటలు అలర్ట్‌లో ఉంచాడు. ఇంకోవైపు కరోనా గురించి ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నాలు కొనసాగించారు. వీటన్నిటి నేపథ్యంలో 'కరోనా తీవ్రత జిల్లా ప్రజలకు అర్థమయ్యేలోపే ఆ వ్యాప్తిని 27 కేసులకే పరిమితం చేశారు. గడిచిన పది రోజులుగా రాజస్థాన్‌లోని బిల్వారా జిల్లాలో ఒక్కటంటే ఒక్క కొత్త పాజిటివ్ కేసు నమోదు కాలేదు. 'గ్రేట్ ఎఫర్ట్.. ' అంటూ రాజేంద్ర భట్‌ను ప్రశంసించబోయేంతలోనే 'ఇది నా ఘనత కాదు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహకారం, మా సిబ్బంది కలిసి చేసిన ప్రయత్నం. టీమ్ వర్క్' అని తన విజయంలో అందరినీ భాగస్వామ్యం చేస్తారు. 'అయినా.. ఒక్క కొత్త కేసు రాలేదని ఇప్పుడే ప్రకటించుకోవడం ఎందుకు? మే వరకూ వేచి చూద్దాం.. అప్పటికీ ఒక్కటి కూడా నమోదు కాకపోతే.. నిజంగానే ఈ ప్రయత్నంలో మేము సఫలీకృతమైనట్టే' అంటారు బిల్వారా కలెక్టర్ రాజేంద్ర భట్.

**స్టేట్ సర్వీస్ నుంచి సివిల్ సర్వీస్‌కు..**

రాజేంద్ర భట్ .. రాజస్థాన్ స్టేట్ సర్వీస్ నుంచి 2007లో ఐఏఎస్‌గా ప్రమోషన్ పొందాడు. 'స్టేట్ సర్వీస్ ఉద్యోగ అనుభవం ఈ కరోనా క్లిష్ట సమయంలో ఆయన చురుగ్గా ఆలోచించి, సమయానికి తగిన నిర్ణయాలు తీసుకోవడంలో ఎంతో ఉపయోగపడింది. డైరెక్ట్ ఐఏఎస్ యంగ్ కలెక్టర్ల కన్నా ఆయన ఎంతో సమర్థవంతుడు' అని ఆయన టీమ్‌లోని యువ ఐఏఎస్ ఆఫీసర్లు రాజేంద్రభట్‌ను కొనియాడుతున్నారు.



రాజేంద్ర భట్

కరోనా విషయంలోనే కాదు.. బిల్వారా జిల్లా కలెక్టర్‌గా రాజేంద్ర భట్ చార్జ్ తీసుకున్నప్పటి నుంచి జిల్లా సర్వతోముఖాభివృద్ధికోసం జిల్లాకు సంబంధించిన అన్ని శాఖలతో ఆయన నిర్వహిస్తున్న స్నేహపూర్వక సంబంధాలు, రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం.. దేశంలోని కలెక్టర్లు, యువ ఐఏఎస్ ఆఫీసర్లందరికీ ఆదర్శం, ఆయన పాలన నైపుణ్యత అందరూ తెలుసుకొని అమలు చేయవలసిన పాఠం.. అంటున్నారు రాజస్థాన్‌లోని ఐఏస్ అధికారులు.

# ఒంటరి నక్షత్రం



ప్రతీకాత్మక చిత్రం

**కో**యంబత్తూరులోని గవర్నమెంట్ ఇ.ఎస్.ఐ. ఆసుపత్రి కోవిడ్ వార్డులో కరోనా కంటే కూడా స్నేహను (అసలు పేరు కాదు) ఎక్కువగా భయపెట్టింది.. తొలిరోజు ఒంటరితనం! 26 ఏళ్ల అమ్మాయి. దేనికీ భయపడని అమ్మాయి. తనే ఆసుపత్రికి వచ్చి, తనే టెస్ట్ చేయించుకుని, తనే అడ్మిట్ అయిన అమ్మాయి. రెండు రోజులు చూసి మూడో రోజు మామూలైపోయింది! తనతో పాటు తెచ్చుకున్న ల్యాప్‌ట్యాప్, కొన్ని పుస్తకాలు.. వాటిలో పడిపోయింది స్నేహ. స్పెయిన్‌లో ఎంబీయే చేస్తోంది ఆమె. రెండో సెమిస్టర్ ఫైనల్ పరీక్షలకు ముందు ఇండియా వచ్చింది. తిరిగి వెళ్దామనుకునే లోపు కరోనా పాజిటివ్‌తో మార్చి 16న హాస్పిటల్‌లో చేరింది. కరోనా నెగిటివ్‌తో ఏప్రిల్ 6న డిశ్చార్జ్ అయింది. మధ్యలో మూడు వారాల ఒంటరితనం. ఒకరోజుకే ఒణికిపోయిన స్నేహ ఇన్నిరోజుల ఒంటరితనంతో ఎలా ఫైట్ చేసింది. ఫైట్ చెయ్యలేదు. స్నేహం చేసింది! ఒంటరితనంతో స్నేహం ఎవరైనా చేయగలిగిందే. ఐసొలేషన్ ఒంటరితనంలోకి వెళ్లే సాహసాన్ని చేసింది స్నేహ. అందుకు ఆశ్చర్యపోవాలి.

•••

స్పెయిన్ నుంచి మొదట ఢిల్లీకి, ఢిల్లీ నుంచి కోయంబత్తూర్‌కి వచ్చింది స్నేహ. నేరుగా ఇంటికి వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి కరోనా పరీక్షకు శాంపిల్స్ ఇచ్చింది. రిపోర్టులు వచ్చేవరకు ఇంట్లో ఎవరితోనూ కలవకుండా వేరుగా ఉంది. రిపోర్ట్స్‌లో నెగటివ్ అని వచ్చాక కూడా మూడు రోజులు వేరుగా ఉండి మళ్లీ టెస్ట్‌లకు వెళ్లింది. స్పెయిన్‌లో తన క్లాస్‌మేట్‌కు కరోనా పాజిటివ్ వచ్చింది. అదీ అనుమానం స్నేహకు. చివరికి ఆమె అనుమానం నిజమైంది. తనకూ పాజిటివ్! వెంటనే ఆసుపత్రిలో అడ్మిట్ అయింది. మళ్లీ ఇంకో అనుమానం.

> **ఇంట్లో వాళ్లంతా ఊరెళ్లారు.**
> **ఒంటరివాళ్లం అవుతామా?**
> **హాస్టల్‌లో ఎవరూ ఇంకా ఫ్రెండ్స్ కాలేదు.**
> **ఒంటరివాళ్లం అవుతామా?**
> **ఆఫీస్‌లో 'హాయ్' అనేవాళ్లు లేరు.**
> **ఒంటరివాళ్లం అవుతామా?**
> **కోవిడ్ వార్డులో ఏమీ తోచదు.**
> **ఒంటరివాళ్లం అవుతామా?**
> **స్నేహ ఈ మధ్యే**
> **ఐసొలేషన్ నుంచి వచ్చింది.**
> **కరోనాను మించింది ఒంటరితనం.**
> **ఆ ఒంటరితనాన్నే..**
> **జయించింది ఈ అమ్మాయి!**

అమ్మకు, నాన్నకు వచ్చి ఉంటుందా అని! వాళ్లకు టెస్ట్ చేయించింది. నెగటివ్ అని రావడంతో ఆమె మనసులోని భారం దిగిపోయింది. ఈలోగా స్నేహ గురించి వాట్సాప్ గ్రూపులలో వదంతులు! ఫలానా ఏరియాలో, ఫలానా వాళ్ల అమ్మాయి ఫారిన్ నుంచి వచ్చిందనీ.. ఇక్కడ మాల్స్‌లో, మార్కెట్‌లో తిరిగిందనీ, ఆసుపత్రి నుంచి పారిపోయిందనీ, పట్టుకొచ్చి మళ్లీ హాస్పిటల్‌లో పెట్టారనీ.. ఇలాంటివి. వాళ్లుండే అపార్ట్‌మెంట్‌లో స్నేహ తల్లికీ అంతా దూరంగా జరిగారు. స్నేహకు ఎలా ఉంది అని దగ్గరగా వచ్చి అడగడానికి కూడా వాళ్లు సంశయించారు. బయట స్నేహ తండ్రిని కొందరు ఆపి అడిగేవారు.. 'పాపకు ఇలాగయిందట కదా' అని. ఇంత జరిగిందని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యాక తెలిసింది స్నేహకు.

•••

మనిషి పక్కన లేకపోతేనే ఐసొలేషన్‌లా ఉంటుందే.. ఇక మనుషులే ఉండని ఐసొలేషన్ అంటే.. అంతరిక్ష ద్వీపంలో మినుకు మినుకుమనే ఒంటరి నక్షత్రమే. స్వప్న అనే ఈ నక్షత్రం చివరికి ఒక నిర్ణయానికి వచ్చింది. ఐసోలేషన్ నుంచే ఎంబీయే పరీక్షలకు ప్రిపేర్ అవ్వాలని! పైపైన చదువుదామని పుస్తకాలు తెచ్చుకున్న అమ్మాయి పరీక్షల కోసం స్పెయిన్ కాలమానాలకు అనుగుణంగా రేయింబవళ్లు చదివింది. ఆన్‌లైన్‌లో పరీక్షలు రాసింది. రాసిన నాలుగు సబ్జెక్టులూ పాస్ అయింది. ఆరోగ్యం పూర్తిగా నయమై బయటికి వచ్చేనాటికి స్నేహ సెకండ్ సెమిస్టర్ కూడా పూర్తయింది. ఒక్కోసారి ఆమె తెల్లవారు జామున 3 గంటల వరకు చదువుతూ కూర్చునేది. ఊరికే చదివితే కాదు. క్లాసులూ వినాలి. అక్కడ స్పెయిన్‌లో మధ్యాహ్నం క్లాసులు మొదలయ్యే సమయానికి ఇక్కడ సిస్టమ్‌లో తను లాగ్ అయ్యేది. వాళ్లు పెట్టిన గడువు సమయానికి అసైన్‌మెంట్‌లు పూర్తి చేసి పంపడానికి ఇక్కడ తన టైమ్‌ని సర్దుబాటు చేసుకునేది. ఆసుపత్రి నుంచి వచ్చేసే రోజైతే అక్కడి ఇంటెర్న్‌షిప్ ఇంటర్వ్యూకి కూడా ఆన్‌లైన్‌లోనే హాజరైంది స్నేహ.

డిశ్చార్జి అయి అపార్ట్‌మెంట్‌కి రాగానే ముప్పై మంది వరకు స్నేహకు ఎదురొచ్చి చప్పట్లతో స్వాగతం పలికారు. కొందరు గేటు దగ్గర, కొందరు లిఫ్టు దగ్గర, కొందరు బాల్కనీలలో పూలగుత్తులతో నిలుచున్నారు. పక్కన మనుషులు లేనప్పుడు మాత్రమే కాదు.. చుట్టూ ఎందరున్నా మనకు మనం లేకుండా పోయినప్పుడు మిగిలేది కూడా ఒంటరితనమే. మనకు మనం ఉండటమంటే.. మన లక్ష్యాల వైపు, గమ్యాలవైపు ఒంటరిగానైనా ప్రయాణించగలగడం. ఒంటరితనంలోనూ జీవించ గలగడం.

సింగింగ్ సోల్జర్స్

## పంజాబీ గానం



**భా**రత సరిహద్దుల్లో గజగజలాడే చలిలో కుటుంబాలకు దూరంగా, మనసును రాయి చేసుకుని మన రక్షణ కోసం కంటిమీద కునుకు లేకుండా పనిచేస్తారు సైనికులు. కేవలం సరిహద్దుల్లో ఉంటూ ప్రజలను రక్షించటమే కాదు, ఇటువంటి విపత్తులు వచ్చినప్పుడు కూడా దేశప్రజలను రక్షించవలసిన బాధ్యత ఉందని సైన్యంలో ఒక ఉన్నత పదవిలో ఉన్న పోలీసు అధికారి కరోనాను తరమాలంటూ ఒక పాటను పాడుతూ అందరినీ ఉత్తేజపరుస్తున్నారు.

ఈ లాక్‌డౌన్ సమయంలో ప్రజలంతా ఆరోగ్యానికి సంబంధించిన సూచనలను అనుసరిస్తూ, ఇంట్లోనే ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటూ ఈ గీతంలో పాడుతున్నారు. ఇలా ప్రజలంతా క్రమశిక్షణను పాటిస్తేనే, దేశం కరోనా వైరస్ మీద చేస్తున్న యుద్ధంలో గెలుపు సాధ్యమవుతుందంటున్నారు ఈ పంజాబీ పోలీసులు. ఈ వీడియోను పంజాబ్ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ తన ట్విటర్‌లో పోస్ట్ చేశారు. 'కరోనాకు సంబంధించి తీసుకోవలసిన ముందుజాగ్రత్తలు, కోవిడ్ 19 గురించి అవగాహన కల్పించేలా సృజనాత్మకంగా సాగిన రచన' అని అమరీందర్ సింగ్ ఈ పాట గురించి ట్విటర్‌లో రాశారు. యూనిఫారమ్‌లో ఉన్న పోలీసు, 'సబ్బుతో చేతులు కడుక్కోండి, హ్యాండ్ శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకోండి. కరోనా వైరస్‌ను తరిమికొట్టండి' అంటూ సాగే ఈ పాటను ప్రతాప్ పారస్ అనే పోలీసు అధికారి రచించారు. పమ్మా మల్హీ అనే పంజాబీ సైనికుడు ఈ పాటను పాడారు. నాలుగు నిమిషాల పాటు సాగే ఈ వీడియోలో, రాష్ట్ర పోలీసులంతా వారు చేస్తున్న సహాయ కార్యక్రమాలతాలూకు విజువల్స్‌ను చూపారు. ఒకప్పుడు సైన్యంలో పనిచేసిన కెప్టెన్ అమరీందర్‌సింగ్, ప్రస్తుతం కరోనాపై చేస్తున్న యుద్ధంలో, సైనికుల్లా పనిచేస్తున్న వైద్యులు, పోలీసులు, ఇతర రంగాలకు చెందిన అధికారులకు స్ఫూర్తినిచ్చేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం తరపు నుంచి పూర్తి సహకారం అందిస్తానని భరోసా ఇస్తున్నారు.

తల్లి మనసు

## నిండు గర్భిణి... మెండైన సేవ



**ప్ర**స్తుతం ప్రపంచం మొత్తం కరోనా వ్యాధి మూలంగా సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దైవంగా పిలువబడే వైద్య బృందం ధైర్యానికి, శక్తికి అంతటా జేజేలు పలుకుతున్నారు. రాజస్థాన్‌లోని బార్మెర్ జిల్లా వాసియైన రాజేశ్వరికి కూడా ఇప్పుడు అక్కడి స్థానికులు చేతులెత్తి మొక్కుతున్నారు. రాజేశ్వరి 2009 నుంచి ఎఎన్‌ఎమ్‌గా విధులను నిర్వర్తిస్తోంది. సాధారణంగా అయితే ఎవరూ ఈమె గురించి ప్రస్తావించేవారు కాదు. కానీ, రాజేశ్వరి ఇప్పుడు నిండు గర్భిణి. ఈ కరోనా మహమ్మారి సమయంలో ప్రజలకు సేవ చేస్తూ రాజేశ్వరి ఒక ప్రత్యేకమైన ఉదాహరణగా నిలుస్తోంది. ఆమె ప్రస్తుతం పాలి జిల్లాలోని దేశూరి కొండ ప్రాంతంలో గల మారుమూల గ్రామం కోట్ సోలంకియన్ ఉప కేంద్రంలో ఎఎన్‌ఎమ్‌గా పనిచేస్తోంది

**నిండు నెలల గర్భిణి ..** మహిళలు ఇళ్లనుండి బయటికి రావడానికే భయపడుతున్నారు. ఇలాంటి సమయంలో రాజేశ్వరి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి, కరోనా వ్యాధి లక్షణాలు ఎవరికైనా ఉన్నాయా అనే విషయాలను స్వయంగా తెలుసుకుంటోంది. గర్భిణిగా తన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటూనే మానవ సేవ చేయడంలోనే సంతృప్తి ఉందని చాటుతోంది రాజేశ్వరి. ఇక్కడి వైద్య ఉపకేంద్రంలో ఉత్తరప్రదేశ్, పూణె, ముంబాయి, మహారాష్ట్ర నుంచి వచ్చిన 177 మందిని ఐసోలేషన్‌లో ఉంచారు. అయినా, తన విధులను నిర్వర్తించడంలో ఏ మాత్రం వెనకడుగు వేయడంలేదు రాజేశ్వరి.

**నొప్పులైనా భరించగలను కానీ...**

వైద్య సిబ్బంది ఆమెను ఇంటికి వెళ్లి విశ్రాంతి తీసుకోమని చెప్పినా వినకుండా ఇంటింటికి వెళ్లి వైద్య సర్వేలు చేయడంతో పాటు వ్యాధి పట్ల గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. 'నాకు ఈ సమయంలో వచ్చే నొప్పులను భరించగలను. కానీ, ఈ గ్రామంలో ఎవరికి ఏమైనా భరించలేను' అంటోంది రాజేశ్వరి.

కరోనా హీరో / డాక్టర్ మేఘా భార్గవ

## తలుపుల మాటున ఆకలి



**క**రోనా లాక్‌డౌన్ కారణంగా షట్‌డౌన్‌లోకి వెళ్లింది వ్యాపారాలు మాత్రమే కాదు, కొన్ని జీవితాలు కూడా. ఏ రోజుకారోజు పని చేసుకుంటే తప్ప గడవని బతుకులు ఆకలి డొక్కలను మూసిన తలుపుల మాటున దాచుకుంటున్నాయి. ఆ తలుపులను తట్టి వారి ఆకలి తీరుస్తున్నారు ముంబయిలోని ఇన్‌కమ్ టాక్స్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ మేఘా భార్గవ. దినసరి కూలి మీద బతికే డెబ్బై కుటుంబాలను ఆమె దగ్గరగా చూశారు. ఈ సంక్షోభం సమయమంతా వాళ్ల అన్నం తినగలిగేలా ఈ నెలంతటికీ సరిపోయేటట్లు సరుకులను ప్యాక్ చేసి ఇస్తున్నారు. ఆమె కళ్లెదుట కనిపించింది డెబ్బై కుటుంబాలే, కానీ ఈ సహాయం చేయాలనుకున్న తర్వాత ఆమె సేకరించిన సమాచారం ప్రకారం ముంబయిలో అలాంటి తక్షణ సహాయం అవసరమైన కుటుంబాలు పదివేల వరకు ఉన్నాయని తెలిసింది. తొలి విడతగా అల్పాదాయ వర్గాల నివాస ప్రదేశం ధారవిలో 800 కుటుంబాలకు ఫ్యామిలీ కిట్‌లను పంపిణీ చేసింది మేఘాభార్గవ. లాక్‌డౌన్ కారణంగా ఎక్కువ సంక్షోభాన్ని ఎదుర్కొనేది ఇళ్లలో పనులు చేసుకునే అసంఘటిత వర్గాలు, సెక్యూరిటీ గార్డులు, ట్రక్కు డ్రైవర్‌లు, క్లీనర్‌లు, గ్యారేజీల్లో పనిచేసే వాళ్లు, గోడౌన్‌ల దగ్గర లోడింగ్– అన్‌లోడింగ్ చేసే కార్మికులు, కూరగాయలమ్ముకునే వాళ్లే. అందుకే వారి మీదనే దృష్టి పెడుతున్నట్లు చెప్పారు మేఘా భార్గవ.

**ఫ్యామిలీ కిట్**

మేఘా భార్గవ ఆలోచనలతో కలిసి వచ్చే వాళ్లతో బృందాన్ని ఏర్పాటు చేసింది. వాళ్లంతా కలిసి ఒక కుటుంబం ఒక నెల రోజుల పాటు ఆకలి తీర్చుకోవడానికి కావలసిన వస్తువుల జాబితా తయారు చేసుకున్నారు. అందులో బియ్యం, పప్పులు, నూనె, చక్కెర, కూరగాయలు, పోపు దినుసులు, సబ్బులు, శానిటైజర్ లిక్విడ్, మాస్కులు ఉంటాయి. మేఘా భార్గవ సామాజిక బాధ్యతగా చేపట్టిన ఈ పనిలో ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులు, వైద్యులు కూడా ఉన్నారు. ఈ పంపిణీ సులువుగా జరగడానికి ఆమె పోలీసు, గ్రేటర్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ సహకారం తీసుకున్నారు.

సువార్త

# మరణాన్ని మట్టికరిపించిన మహోదయం!!

**శు**భశుక్రవారపు మరుసటి ఆదివారం ఇంకా తెల్లారక ముందే. జెరూసలేం డేట్ లైన్ తో మగ్దలేనే మరియ అనే శిష్యురాలు యేసుక్రీస్తు సజీవుడయ్యాడంటూ ఆయన పునరుత్థాన శుభవార్తను ప్రపంచానికి 'అతిపెద్ద బ్రేకింగ్ న్యూస్' గా ప్రకటించింది. ఈ శుభవార్త ప్రబలి, యేసు మరణంతో విషాదంలో ఉన్న ఆయన అనుచరుల్లో పుట్టెడు ఆనందాన్ని నింపింది. కానీ యేసును చంపి తామేదో గొప్ప విజయం సాధించామని విర్రవీగుతున్న ఆయన శత్రువుల గుండెల్లో మాత్రం అది రైళ్లు పరుగెత్తించి 'నష్టనివారణ' చర్యలకు వారిని పురికొల్పింది. యేసు సిలువలో అసలు చనిపోనే లేదని, కేవలం మూర్ఛపోయిన యేసు స్పృహలోకొచ్చి నడుస్తూ ఎక్కడికో వెళ్లిపోయాడని కొందరు, అసలు యేసు అనే వ్యక్తే చరిత్రలోనే లేడని, ఆయన బోధలు, జీవితం, మరణం, పునరుత్థానం ఇదంతా కట్టుకథ అని మరికొందరు అబద్ధాలు ప్రచారం చేసినా, యేసు పునరుత్థానుడయ్యాడన్న 'సత్యం' వెయ్యింతల బలంతో అచిరకాలంలోనే ప్రబలి, ఆయన పునరుత్థానమే పునాదిగా 'క్రైస్తవం' భూదిగంతాలకు వ్యాపించింది.

చనిపోయిన వ్యక్తి మళ్ళీ బతకడం మనుషులకు కొత్త, ఒక వింత కావచ్చు కానీ, జనన మరణాలకు అతీతుడైన దేవునికి కాదు కదా? మహోన్నతుడు, సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు, విశ్వానికంతటికీ సృష్టికర్త అయిన దేవుడు యేసుక్రీస్తుగా, రక్షకుడుగా 'పుట్టి', 'మరణించి', 'పునరుత్థానుడై' ఉండకపోతే దేవుని సరిగ్గా, పూర్తిగా అర్థం చేసుకోవడం మనిషికి అసాధ్యమే. దేవుడేమిటో అర్థమయితేనే,



ఆయన దృష్టిలో ఒక నలుసంత కూడా లేని మానవుణ్ణి దేవుడు ప్రేమించడమెంత గొప్ప విషయమో అర్థమవుతుంది.

ఊరికే దేవుడూ, దేవుడూ అంటాం కానీ ఆ దేవుణ్ణి తెలుసుకునే స్థాయి మనిషిది కాదు. అందుకే మనిషిలో ఇంత మిడిసిపాటు, డాంబికం!! తన ప్రేమ మనిషికర్థమయ్యే రూపంలో, యేసుక్రీస్తుగా దేవుడు ఈ భూగ్రహాన్ని దర్శించేందుకు పుట్టి, చనిపోయి, పునరుత్థానుడై మానవాళిని తన కుమారులు, కుమార్తెలుగా స్వీకరించి వారికి తనదైన శాశ్వతత్వాన్నిచ్చేందుకు ఈ విశ్వంతో సంబంధమే లేని ఒక పరలోకరాజ్యాన్ని స్థాపించాలని సంకల్పించాడు. దేవుడు విశ్వాన్నంతా సృష్టించి, మనిషిని మాత్రం తన అద్భుతమైన స్వరూపంలో చేసి, అతన్ని ఈ విశ్వాన్ని ఏలే రాజుగా నియమించాడని బైబిల్ చెబుతోంది(ఆది 1:28). అలా ప్రేమ, క్షమాపణ వంటి దైవిక స్వభావ లక్షణాలతో వర్ధిల్లి విశ్వాన్ని మనిషి తన గుప్పిట్లో పెట్టుకోవాలని దేవుడాశిస్తే, దారితప్పి స్వార్థపరుడైన మనిషి ఈ విశ్వానికి సమాంతరంగా ఒక 'డబ్బు ప్రపంచాన్ని' నిర్మించుకొని క్రమంగా దానికి దాసుడయ్యాడు. ఒక రాజుగా విశ్వాన్ని ఏలాల్సిన మనిషి చివరికి కంటికి కనిపించని వైరస్ క్రిములకు కూడా గడగడలాడే ఇప్పటి దీనస్థితిని కొని తెచ్చుకున్నాడు. ప్రపంచమంతా ఎంతో కల్లోల భరితంగా ఉన్న ఇప్పటి పరిస్థితుల్లో, మానవాళి పట్ల దేవుని శాశ్వతమైన ప్రేమను, ఔన్నత్యాన్ని, ప్రణాళికలను గుర్తు చేసేదే యేసుపునరుత్థాన పర్వదినం... హేపీ ఈస్టర్...

– రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్

మీకు తెలుసా?

**గో**వుల మందలు ఉండే ప్రదేశాలలో, శ్మశాన భూమికి సమీపంలో, మల మూత్రాలు విసర్జించే ప్రదేశాలలో. ఉప్పు నేలలో, చవుడు నేలలయందు, ఎల్లప్పుడూ నీటి ఊటలు గల ప్రదేశాలలోనూ, రాతి భూముల యందు, రక్త వర్ణం గల భూమియందు, చెరువులను పూడ్చి గృహ నిర్మాణం చేయడం వలన కష్టాల పాలవుతారని శాస్త్రోక్తి.

•••

దేవతలకు శిరస్సుపై రెండు చేతులు జోడించి నమస్కరించాలి. గురు



వుకి నోటితో 'నమస్కారం' అని చెప్పకుండా రెండు చేతులూ జోడించి వినయవిధేయలతో నమస్కరించాలి. మహానుభావులకు, యోగులకు రెండు చేతులు వక్షస్థలంపై జోడించి నమస్కరించాలి. తండ్రికి, పరిపాలకుడికి రెండు చేతులు నోటి మీదగా జోడించి నమస్కరించాలి. తల్లికి ఉదరంపై రెండు చేతులు జోడించి నమస్కరించాలి.

స్త్రీ వైశిష్ట్యం- 33

## నోబెల్ ప్రైజ్ = ఒక్క రూపాయి

**ఎ**క్కడో పుట్టి ఈ దేశానికి వచ్చి భారతరత్న పొంది, నోబెల్ బహుమతి పొంది, కొన్ని కోట్ల మందికి మదర్‌గా (తల్లి)గా నిలబడి భారతీయురాలిగానే శరీరం విడిచిపెట్టి ఈ జాతికి ఖ్యాతిని తెచ్చిన మహాతల్లి–మదర్ థెరీసా. ఒకప్పుడు కలకత్తా వీధులలో వెడుతుండగా తన చేతులలోనే వ్యాధిగ్రస్థురాలయిన ఒక అభాగ్యురాలు ఒరిగిపోతే... ''ఇకమీదట ఇలా ఏ రోగీ తన చేతులలో ఒరిగిపోకూడదు. కుష్టురోగులతో సహా లక్షలాది దీనులకు తల్లినవుతా''.. అని సంకల్పం చెప్పుకుని కేవలం రు.5/–లు, ఒక పాత బకెట్టు, రెండు తెల్ల చీరెలు పట్టుకుని బయటకు వెళ్ళిపోతుంటే... సహచరులు నవ్వుతూ... ఈ పాతబకెట్టు, రెండు చీరెలతో అంతమందికి అన్నం పెడతావా, రోగాలు మాన్పిస్తావా... అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. వీటన్నింటికంటే ఎక్కువగా తనకు సంకల్పబలం ఉన్నదనీ, దానితోతాననుకున్నది సాధిస్తానని చెబుతూ గడప దాటింది.



'నిర్మల్ హృదయ్'లో ఆమె ఉన్నప్పుడు ఒక రిక్షా కార్మికుడు ఆమెను చూడాలని వచ్చాడు. రోగగ్రస్థుడై, ఆర్తితో అందరిలాగే వచ్చాడనుకుంది. కానీ అతని వినతి విని ఆమె నిర్ఘాంతపోయింది. ''అమ్మా! నీవు చేస్తున్న సేవాకార్యక్రమాలు చాలా గొప్పవమ్మా. నావంతు విరాళంగా ఈ ఒక్క రూపాయి బిళ్ళ ఉంచుకో తల్లీ'' అని ఇచ్చి వెళ్ళాడు. ఆమె దానిని చాలా భద్రంగా దాచుకుంది. తరువాత కాలంలో ఆవిడకు నోబెల్ బహుమతి అందింది. దాని పక్కన ఆ రూపాయి బిళ్ళ పెట్టి... ప్రేమతో ఇచ్చిన కానుక ఎంత గొప్పదో చెప్పడానికి..''నాకు ఈనాడు వచ్చిన నోబెల్ బహుమతి ఒకటయితే, నా సేవలకు సంతోషించి అతి సామాన్యుడిచ్చిన ఈ రూపాయి మరో నోబెల్ బహుమానం'' అని చెప్పుకుని పొంగిపోయింది.

– బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సాక్షి
# స్పోర్ట్స్
ఆదివారం
12-4-2020

## వేతనాల కోతకు మేం సిద్ధం: పాకిస్తాన్ టెస్టు కెప్టెన్ అజహర్ అలీ



**కరాచీ:** కరోనా మహమ్మారి ప్రపంచ క్రీడా రంగాన్ని కుదిపేస్తున్న వేళ గొప్ప గొప్ప క్రీడా సమాఖ్యలే ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇలాంటి స్థితిలో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. సహజంగానే ఆర్థిక వనరులు తక్కువగా ఉన్న పీసీబీ రాబోయే రోజుల్లో జట్టు కాంట్రాక్ట్ ఆటగాళ్లకు ఇవ్వాల్సిన వేతనాల్లో కోత తప్పదంటూ పరోక్షంగా చెప్పింది. దీనిపై పాక్ టెస్టు కెప్టెన్ అజహర్ అలీ స్పందించాడు. అన్నింటికీ సిద్ధంగా ఉన్నామని అతను వ్యాఖ్యానించాడు. పీసీబీ కాంట్రాక్ట్‌లో 19 మంది ఆటగాళ్లు ఉండగా... ప్రస్తుతానికి సర్దుబాటు చేస్తున్నామని, జూన్ తర్వాత పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పలేమని బోర్డు వెల్లడించింది. 'దేశంలో పరిస్థితి బాగా లేదు. లాక్‌డౌన్ కొనసాగితే మరింత దిగజారుతుందని తెలుసు. మా వేతనాల్లో కోత పెడతామని బోర్డు మమ్మల్ని కోరవచ్చు. ఇందుకోసం మానసికంగా సిద్ధమైపోయాం. ప్రేక్షకులు లేకుండా మ్యాచ్‌లు నిర్వహిస్తే వారు కనీసం టీవీల్లోనైనా చూస్తారనేది మంచి ఆలోచనే కాని ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేయలేం కదా' అని అలీ అన్నాడు.

# ధోనిని బలవంతపెట్టొద్దు

**ఇలాంటి క్రికెటర్లు తరానికొక్కరు కనిపిస్తారు ● ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ నాసిర్ హుస్సేన్ అభిప్రాయం**




నాసిర్ హుస్సేన్

**న్యూఢిల్లీ:** భారత మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని మళ్లీ జాతీయ జట్టుకు ఆడతాడా, అసలు ఆడే అవకాశం ఉందా ఎవరికీ తెలియదు. గత ఏడాది వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్ తర్వాత అతను మళ్లీ బరిలోకి దిగలేదు. ఈసారి ఐపీఎల్‌లో బాగా ఆడితే టి20 ప్రపంచకప్‌కు ఎంపికయ్యే అవకాశం ఉందని వినిపించినా.... లీగ్ జరగడం సందేహంగా మారింది. ఈ నేపథ్యంలో ధోని ఇక రిటైర్ అయినట్లేనని, అధికారిక ప్రకటనే మిగిలిందంటూ వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ నాసిర్ హుస్సేన్ స్పందించాడు. ధోని లాంటి అరుదైన క్రికెటర్లను బలవంతంగా రిటైర్మెంట్ వైపు తోస్తే అది జట్టుకు మేలు చేయదని అతను వ్యాఖ్యానించాడు. 'ఒక్కసారి ధోని రిటైర్ అయితే అతడిని మళ్లీ వెనక్కి పిలిపించలేం. క్రికెట్ ప్రపంచమంతా కీర్తించే దిగ్గజాలు కొందరే ఉంటారు. అలాంటివారు తరానికొక్కరే కనిపిస్తారు. ధోని కూడా అలాంటి ఆటగాడే. కాబట్టి అతడిని రిటైర్మెంట్ ప్రకటించమని బలవంత పెట్టవద్దు. తన మానసిక పరిస్థితి ఏమిటో ధోనికి మాత్రమే తెలుసు. సెలక్టర్లు ఎంపిక చేస్తే ఎలా తమ బాధ్యత నెరవేర్చాలో ఆటగాళ్లకు తెలుసు. అయితే ప్రస్తుత జట్టులో చోటు దక్కించుకునే సత్తా ధోనికి ఉందా అనేది ఎవరైనా చూస్తారు. నా దృష్టిలో మాత్రం భారత జట్టుకు మరికొంతకాలం సేవలు అందించగల సామర్థ్యం ఇంకా ధోనిలో ఉంది' అని హుస్సేన్ అభిప్రాయపడ్డాడు. అయితే ప్రపంచకప్‌లో ఒకటి, రెండు మ్యాచ్‌లలో ధోని తన సహజశైలిలో ఆడలేకపోయాడనే విషయం మాత్రం వాస్తవమని ఇంగ్లండ్ మాజీ సారథి అంగీకరించాడు. 'లక్ష్య ఛేదనలో ఒకట్రెండుసార్లు అతను లెక్క తప్పినట్లు అనిపించింది. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో అతను ఏదో కారణం చేత చివరి వరకు కూడా నెమ్మదిగానే ఆడే ప్రయత్నం చేయడం నాకు గుర్తుంది. అయితే ఓవరాల్‌గా ధోని గొప్ప ఆటగాడు. కాబట్టి అతని రిటైర్మెంట్‌ను కోరుకునేవారు ఆలోచించి వ్యాఖ్య చేస్తే బాగుంటుంది' అని నాసిర్ హుస్సేన్ సూచించాడు. 2004లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన 38 ఏళ్ల ధోని ఇప్పటివరకు 90 టెస్టులు, 350 వన్డేలు, 98 టి20 మ్యాచ్‌లు ఆడాడు. 2014లో టెస్టు ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పిన ధోని వన్డే, టి20 ఫార్మాట్‌లలో కొనసాగుతున్నాడు.

## ఐపీఎల్ నిరవధిక వాయిదా!



**న్యూఢిల్లీ:** ఈ ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 టోర్నమెంట్ నిరవధికంగా వాయిదా పడటం ఖాయమైంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధికారికంగా ప్రకటించకపోయినా... శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో వీడియో కాన్ఫరెన్స్‌లో పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈనెలాఖరువరకు లాక్‌డౌన్ పొడిగింపునకు మొగ్గు చూపడంతో ఐపీఎల్ టోర్నీ జరిగే పరిస్థితి కనిపించడంలేదు. 'పంజాబ్, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఢిల్లీ రాష్ట్రాలు లాక్‌డౌన్‌ను పొడిగించాయి. ఫలితంగా ప్రస్తుతానికైతే ఐపీఎల్ జరిగే పరిస్థితి లేదు. దాంతో ఐపీఎల్‌ను నిరవధికంగా వాయిదా వేయక తప్పదు. కానీ ఈ ఏడాది టోర్నీని రద్దు చేసే ఆలోచన లేదు' అని బీసీసీఐ అధికారి ఒకరు తెలిపారు.

## భవిష్యత్‌లో ఆలోచిస్తా!

**ఏఐఎఫ్‌ఎఫ్ అధ్యక్ష పదవికి పోటీ చేయడంపై బైచుంగ్ భూటియా**



**న్యూఢిల్లీ:** అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) అధ్యక్ష పదవి గురించి భవిష్యత్‌లో కచ్చితంగా ఆలోచిస్తానని భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా అన్నాడు. ఫేస్‌బుక్ చిట్‌చాట్‌లో అభిమానులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా భూటియా తన ఆకాంక్షను బయటపెట్టాడు. 2011లో కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన ఈ సిక్కిం ఆటగాడు ప్రస్తుతం తన దృష్టంతా క్షేత్రస్థాయిలో ఫుట్‌బాల్ అభివృద్ధి పైనే ఉందని పేర్కొన్నాడు. 'ఏఐఎఫ్‌ఎఫ్ అధ్యక్ష పదవికి భవిష్యత్‌లో ఏదో ఒక రోజు పోటీదారుగా ఉంటా. కానీ ప్రస్తుతానికైతే క్షేత్రస్థాయి నుంచి ఫుట్‌బాల్ క్రీడ అభివృద్ధి చేయడమే నా లక్ష్యం. బైచుంగ్ భూటియా ఫుట్‌బాల్ స్కూల్, యునైటెడ్ సిక్కిం క్లబ్‌ల ద్వారా నేను అదే పనిలో ఉన్నా' అని 43 ఏళ్ల భూటియా అన్నాడు. ఫుట్‌బాల్‌లో అపార నైపుణ్యం ఉన్న భూటియా భారత్‌కు చెందిన మిడ్‌ఫీల్డర్ బ్రాండన్ ఫెర్నాండోస్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు 'ఈ కాలం స్ట్రయికర్‌లలో సునీల్ ఛెత్రి, మిడ్ ఫీల్డర్‌లలో బ్రాండన్ ఫెర్నాండోస్ ఉత్తమ ప్లేయర్లు. ఐఎస్‌ఎల్‌లో ఎఫ్‌సీ గోవా తరఫున బ్రాండన్ అద్భుతంగా ఆడుతున్నాడు. మైదానంలో అతని నైపుణ్యాలు గొప్పగా ఉంటాయి' అని భూటియా తెలిపాడు. 1995 నుంచి 2011 వరకు భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన భూటియా జూనియర్, సీనియర్ స్థాయిలలో కలిపి మొత్తం 104 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 40 గోల్స్ సాధించాడు.

## షూటింగ్ క్రీడలో కొత్త పుంతలు!

- ఆన్‌లైన్‌లో అంతర్జాతీయ చాంపియన్‌షిప్
- ఈనెల 15న నిర్వహణ
- బరిలో మను భాకర్, సంజీవ్ రాజ్‌పుత్


మను భాకర్

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ కారణంగా ఇప్పటివరకు ఆటలు రద్దవడమే చూశాం కానీ ఈ మహమ్మారి పుణ్యమా అని ఆట కొత్త పుంతలు తొక్కుతోంది. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఆన్‌లైన్ చాంపియన్‌షిప్‌లు పుట్టుకొస్తున్నాయి. ఆటలో ఈ సాంకేతిక విప్లవానికి ఏప్రిల్ 15న జరుగనున్న ఇంటర్నేషనల్ ఆన్‌లైన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌తో తెర లేవనుంది. ఎలక్ట్రానిక్ టార్గెట్ బోర్డ్, మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ సహాయంతో ఇళ్ల నుంచే తమ లక్ష్యాలకు గురిపెట్టేందుకు షూటర్లంతా సిద్ధమయ్యారు. భారత్ నుంచి మను భాకర్, సంజీవ్ రాజ్‌పుత్, దివ్యాన్ష్ సింగ్ పన్వర్ ఈ కొత్త విధానంలో తమ నైపుణ్యాలను ప్రదర్శించనున్నారు. భారత మాజీ షూటింగ్ నిపుణుడు (మార్క్స్‌మ్యాన్) షిమోన్ షరీఫ్ చొరవతో బీజం పడిన ఈ ఆన్‌లైన్ చాంపియన్‌షిప్‌లో ప్రపంచవ్యాప్తంగా మొత్తం 50 మంది షూటర్లు పాల్గొననున్నారు. ప్రముఖ విదేశీ షూటర్లు పాల్గొనే ఈ టోర్నీ ఆన్‌లైన్‌లో ప్రత్యక్ష ప్రసారంతో పాటు ఒలింపియన్ జాయ్‌దీప్ కర్మాకర్ కామెంటరీతో మార్మోగనుంది. 2019 ప్రపంచకప్ రెండు స్వర్ణాల విజేత వెరోనికా (హంగేరి), ఫ్రాగా కరెడోరియా (స్పెయిన్), ఎమిలా, ఇసాబెల్, ఎవాన్స్ (స్కాట్లాండ్) టోర్నీలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. 'కఠిన పరిస్థితుల్లోనూ షూటింగ్ క్రీడను సజీవంగా ఉంచేందుకు ఈ కొత్త తరహా విధానాన్ని ప్రయత్నిస్తున్నాం. భారత కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం 4 గంటలకు టోర్నీ ప్రారంభమవుతుంది. ఆటగాళ్లంతా తమ తమ ఇళ్ల నుంచే పోటీలో పాల్గొంటారు. ఆసక్తి గలవారు ఫేస్‌బుక్ లేదా indianshooting.com వెబ్‌సైట్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించవచ్చు' అని షరీఫ్ తెలిపాడు.

## అదో మేలుకొలుపు

**భారత్ చేతిలో సిరీస్ ఓటమిపై ఆస్ట్రేలియా కోచ్ లాంగర్ వ్యాఖ్య**



**సిడ్నీ:** భారత టెస్టు క్రికెట్ చరిత్రలో చిరకాలంగా పూర్తి కాని లక్ష్యాలలో ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ గెలవడం ఒకటి. అయితే కోహ్లి సేన గత పర్యటనలో (2018–19) దీనిని చేసి చూపించింది. 2–1తో సిరీస్ నెగ్గిన టీమిండియా ఈ ఘనత సాధించిన తొలి భారత జట్టుగా నిలిచింది. సహజంగానే ఈ ఫలితం ఆసీస్ జట్టు కోచ్ జస్టిన్ లాంగర్‌ను అమితంగా బాధించింది. తన కెరీర్‌లో విపరీతంగా బాధపడే క్షణాలలో ఇది ఒకటని అతను చెప్పుకున్నాడు. 2018 మార్చిలో బాల్ ట్యాంపరింగ్ ఉదంతం అనంతరం లాంగర్ జట్టు కోచ్‌గా బాధ్యతలు చేపట్టగా... ప్రధాన ఆటగాళ్లు స్మిత్, వార్నర్ లేకుండానే ఆసీస్ బరిలోకి దిగింది. 'నా కోచింగ్ కెరీర్‌లో ఈ పరాజయం పెద్ద దెబ్బ. ఇది ఎప్పటికీ నన్ను వెంటాడుతుంది. నిజంగా నా జీవితంలో అది కఠిన సమయం. ఇంకా చెప్పాలంటే ఈ ఓటమి అందించిన కుదుపు మాకు మేలుకొలుపులాంటిది. ఆటగాడిగా 2001 యాషెస్ సిరీస్ ఆరంభంలో నన్ను తుది జట్టు నుంచి తప్పించినప్పుడు ఎంతగా బాధపడ్డానో ఇప్పుడు అదే తరహాలో బాధకు గురయ్యాను. అయితే నాడు యాషెస్ తర్వాత నా కెరీర్ అద్భుతంగా సాగింది. ఇప్పుడు కూడా అంతే. కఠిన పరిస్థితుల నుంచే మనం పాఠాలు నేర్చుకుంటాం' అని లాంగర్ అభిప్రాయపడ్డాడు.

---

**సినిమా**

# నన్ను రక్షించండి - ఆండ్రూ






● శ్రియ, ఆండ్రూ

**లా**క్ డౌన్ సమయాన్ని సరదాగా గడుపుతున్నారు శ్రియ, ఆమె భర్త ఆండ్రూ కొచీవ్. ఈ మధ్యే ఆండ్రూ గిన్నెలు శుభ్రం చేస్తున్న వీడియో షేర్ చేసి ''ఈ ఖాళీ సమయంలో భర్తలందరూ గిన్నెలు శుభ్రం చేయాలి'' అనే సరదా ఛాలెంజ్ విసిరారు శ్రియ. తాజాగా మరో సరదా వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. ఈ వీడియోలో ''నా భార్య నుంచి నన్ను రక్షించండి'' అంటున్నారు ఆండ్రూ. విషయం ఏంటంటే... ''అందరూ ఇంట్లోనే ఉండండి, జాగ్రత్తలు పాటించండి, ఈ సమయాల్లోనూ మా కోసం పని చేస్తున్న అందరికీ ధన్యవాదాలు, దయచేసి బయటకు రావద్దు'' అనే సందేశాలను పేపర్ మీద రాసి , చూపిస్తున్న వీడియోను పంచుకున్నారు శ్రియ. ఈ వీడియోలో శ్రియ ఆ పేపర్లను చూపిస్తున్నప్పుడు ఆమె భర్త ఆండ్రూ ఆమె వెనకే ఉండి ''శ్రియ ఎప్పుడూ ఏదో ఒకటి వాగుతూనే ఉంటుంది, రోజంతా నాతో పనులు చేయిస్తూ ఉంటుంది. ప్లీజ్ ఆమె నుంచి నన్ను రక్షించండి. లాక్‌డౌన్ త్వరగా ముగిస్తే బావుండు'' అని రాసి ఉన్న పేపర్‌ని చూపించారు. లాక్ డౌన్ సమయాన్ని ఇద్దరూ ఇలా సరదా సరదాగా గడిపేస్తున్నారు.

## కరోనాతో హాలీవుడ్ నటి మృతి

**క**రోనా లక్షణాలతో హాలీవుడ్ నటి హిల్లరీ హీత్ (74) మరణించారు. ఈ విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. 'విచ్ ఫైండర్ జనరల్' అనే హారర్ మూవీ ద్వారా పాపులారిటీ సంపాదించారు హిల్లరీ హీత్. ఆ తర్వాత 'నిల్ బై మౌత్', 'యాన్ ఆవ్‌ఫుల్లీ బిగ్ అడ్వెంచర్' వంటి సినిమాలను నిర్మించారు. హీత్ మృతి పట్ల పలువురు హాలీవుడ్ సినీ రంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.


● హిల్లరీ హీత్


● 'అహం బ్రహ్మాస్మి'లో మంచు మనోజ్

## అంతా బాగుంటాం రా

**క**రోనా పోరాటానికి స్ఫూర్తి నింపడానికి తమకు తోచిన విధంగా తమ స్టయిల్లో పాటలు విడుదల చేస్తున్నారు స్టార్స్. తాజాగా మంచు మనోజ్ కరోనాపై పోరాటం చేస్తున్న వారికి భరోసా ఇవ్వడానికి ఓ పాటను రికార్డ్ చేశారు. వచ్చే వారం ఈ పాట విడుదల కాబోతోంది. ఈ విషయం గురించి మనోజ్ మాట్లాడుతూ –'మూడు సంవత్సరాల విరామం తర్వాత మంచి సినిమా (మనోజ్ హీరోగా 'అహం బ్రహ్మాస్మి' అనే సినిమా పూజా కార్యక్రమాలు లాక్ డౌన్‌కి కొన్ని రోజుల ముందు జరిగాయి) తో మిమ్మల్ని పలకరిద్దాం అనుకున్నాను. మనమంతా ఒక స్క్రిప్ట్ రాసుకుంటే దేవుడు మరొక స్క్రిప్ట్ రాస్తాడు. 'యాక్షన్' అన్న పదం వినే అదృష్టాన్ని ఇంకొన్ని రోజులు దూరం జరిపాడు. వచ్చే వారం డాక్టర్లకు, పోలీసులకు, ఆర్మీకి, పారిశుధ్య కార్మికులకు ముఖ్యంగా వాళ్ల త్యాగానికి 'అంతా బాగుంటాం రా' అనే పాటను అంకితం చేస్తున్నాను. సంగీత దర్శకుడు అచ్చు స్వరపరిచిన ఈ పాటను నేను, నా మేనకోడలు విద్యా నిర్వాణ (మంచు లక్ష్మి కుమార్తె) కలిసి పాడి, పాట రూపంలో ఇస్తున్న చిన్న భరోసా ఇది'' అన్నారు.

## కన్నడంలోకి ఎవరు


● దిగంత్

**గ**త ఏడాది మంచి విజయం సాధించిన సినిమాల్లో అడవి శేష్ నటించిన 'ఎవరు' ఒకటి. వెంకట్ రాంజీ తెరకెక్కించిన ఈ సినిమాలో రెజీనా, నవీన్ చంద్ర ముఖ్య పాత్రల్లో నటించారు. స్పానిష్ చిత్రం 'ది ఇన్‌విజిబుల్ గెస్ట్' ఆధారంగా ఈ సినిమా రూపొందించారు. 'ఎవరు'లోని ట్విస్ట్ లు తెలుగు ఆడియన్స్‌ను బాగా థ్రిల్ చేశాయి. ఆ థ్రిల్ ను కన్నడ ఆడియన్స్ కూడా ఆస్వాదించబోతున్నారని తెలిసింది. ఈ చిత్రం కన్నడంలో రీమేక్ కానుంది. దిగంత్ అనే కన్నడ నటుడు ఈ రీమేక్ లో హీరోగా కనిపిస్తారట. దర్శకుడు, ఇతర నటీనటులు ఎవరనేది తెలియాల్సి ఉంది.

## గుంగూబాయ్‌కి దీపిక స్పెషల్


● దీపికా పదుకోన్

**మా**ఫియా క్వీన్ గంగూబాయ్ కోసం దీపికా పదుకోన్ ఓ స్పెషల్ సాంగ్ చేయబోతున్నారని బాలీవుడ్ తాజా వార్త . సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'గంగూబాయ్ కతియావాడి'. ఈ చిత్రంలో ఆలియా భట్ టైటిల్ రోల్ చేస్తున్నారు. అజయ్ దేవగన్ ఓ కీలక పాత్ర చేస్తున్నారని టాక్. ముంబైకి చెందిన గ్యాంగ్‌స్టర్ గంగూబాయ్ జీవితం ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రం ఇది. కథ రీత్యా ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్‌కి స్కోప్ ఉందట. ఈ పాట కోసం దీపికా పదుకోన్‌ను సంప్రదించారట. ఈ సినిమాకు ముందు దీపికా పదుకోన్‌కు 'పద్మావత్' రూపంలో మంచి హిట్ ఇచ్చారు భన్సాలీ. అందుకని 'గుంగూబాయ్'లో ప్రత్యేక పాట చేయడానికి దీపిక సై అంటారని బాలీవుడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## రిస్క్ తీసుకున్నా


● కీర్తీ సురేష్

**వి**క్రమ్‌ప్రభు హీరోగా నటించిన 'ఇదు ఎన్న మాయమ్' (2015) చిత్రంతో తమిళంలో, రామ్ హీరోగా నటించిన 'నేను.. శైలజ' (2016) చిత్రంతో తెలుగులో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు కీర్తి సురేష్. 'మహానటి' చిత్రంతో తనలో అద్భుత నటి ఉందని నిరూపించుకున్నారు. ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో ఆమె కెరీర్ జోరుగా ఉంది. ఈ విషయం గురించి కీర్తి సురేష్ మాట్లాడుతూ –''నేనీ స్థాయికి చేరుకోవడానికి చాలా కష్టపడ్డాను. ప్రయోగాత్మక పాత్రలు చేస్తూ కెరీర్‌లో రిస్క్ తీసుకుని ధైర్యంగా ముందడుగు వేశాను. నేను ఓవర్‌నైట్ స్టార్‌ని కాలేదు. కానీ ఊహించనదాన్ని కన్నా తక్కువ సమయంలోనే ఇండస్ట్రీలో నాకు మంచి ఫేమ్ వచ్చిందని మాత్రం చెప్పగలను. అలాగే ఇంత తక్కువ సమయంలో జాతీయ అవార్డు ('మహానటి' చిత్రానికి) సాధిస్తానని కూడా ఊహించలేదు. నేను చేసిందల్లా శక్తివంచన లేకుండా నా పాత్రలకు న్యాయం చేయడమే'' అన్నారు. ప్రస్తుతం రజనీకాంత్ హీరోగా రూపొందుతున్న 'అన్నాత్తే' చిత్రంలో ఓ కీలక పాత్ర చేస్తున్నారు కీర్తి సురేష్. అలాగే ఇటు తెలుగు అటు తమిళంలో ఆమె నటించిన లేడీ ఓరియంటెడ్ సినిమాలు 'మిస్ ఇండియా, గుడ్‌లక్ సఖి, పెంగ్విన్' విడుదలకు సిద్ధమవుతున్నాయి.



## తండ్రికి వైరస్.. కొడుక్కి నెగెటివ్...



కర్ణాటకలోని బాగల్‌కోటలో 75 ఏళ్ల వ్యక్తి ఇటీవల కరోనా కారణంగా ప్రాణాలు కోల్పోయారు. ఈయన స్వయంగా విదేశాలకు వెళ్లిందీ లేదు. ఇరుగు పొరుగులో ఎవరికీ వైరస్ కూడా సోకలేదు. కానీ కొన్ని రోజుల క్రితం ఈయన కొడుకు బెంగళూరు నుంచి వచ్చాడని తెలుసుకున్న అధికారులు.. ముసలాయనకు వైరస్ ఎలా సోకిందో అర్థమైపోయిందనుకున్నారు. కొడుక్కు పరీక్షలు చేయించారు. ఆశ్చర్యకరంగా అతడిలో వైరస్ లేదని నిర్ధారణ అయ్యింది. అదెలా? అని జిల్లా యంత్రాంగం తలబద్దలు కొట్టుకుంటూనే ఉంది. ఈ లోపు ఆ ముసలాయన నివసించిన ఇంటి నుంచి కనీసం అర కిలోమీటర్ దూరం వరకూ మొత్తం బంద్ పెట్టేశారు. ఒక్కో ఇంటికి వెళుతూ ఎవరైనా కోవిడ్ బారిన పడి తమకు తెలపకుండా ఉన్నారా? అని వెతకడం మొదలుపెట్టారు. చనిపోయిన వ్యక్తి నూనెలు అమ్ముకునే వ్యక్తి కావడంతో అతడి వినియోగదారుల్లో ఎవరైనా వైరస్‌ను మోస్తూ ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. చివరకు ఈ వెతుకులాట ఫలితంగా పోలీసులకు ఒక కొత్త విషయం తెలిసింది. బెంగళూర్ నుంచి వచ్చిన కొడుకు మరో ఆరుగురితో కలసి ప్రయాణించాడని.. హమ్మయ్యా అనుకున్న పోలీసులు వారందరినీ వెతికి నిర్బంధంలో ఉంచారు. నమూనాలు సేకరించి పరీక్షలకు పంపారు కూడా. వీరిలో ఎవరికైనా వైరస్ ఉందని స్పష్టమైతే ముసలాయనకు వ్యాధి ఎలా వచ్చిందో తెలిసిపోతుంది. లేదంటే..?

## ముందు నెగెటివ్.. తర్వాత పాజిటివ్...



కరోనా వైరస్ పుట్టిల్లు వూహాన్‌లో వైద్యులకు, శాస్త్రవేత్తలకు అంతుపట్టని మిస్టరీ ఒకటి చోటు చేసుకుంటోంది. ఒకసారి కరోనా బారిన పడి తేరుకున్న వారిలో ముందుగా నెగెటివ్ సూచించినా... కొంత సమయం తర్వాత పరీక్షల్లో పాజిటివ్ రావడం ఆశ్చర్యపరుస్తోంది. మార్చి 18 నుంచి 22 మధ్య వూహాన్‌లో ఒక్క కొత్త కేసు కూడా నమోదు కాలేదు. దీంతో గత ఏడాది డిసెంబర్ ఆఖరులో మొదలైన వైరస్ శాంతించిందని భావించారు. కానీ.. వ్యాధి నయమైన కొందరిలో మళ్లీ వైరస్ కనిపించింది. వూహాన్‌లోని వేర్వేరు క్వారంటైన్ కేంద్రాల సమాచారం మేరకు ఐదు నుంచి పది శాతం మందిలో మళ్లీ పాజిటివ్ కనిపిస్తోంది. వీరిలో కరోనా లక్షణాలు కనిపించకపోవడం మిస్టరీగా మారింది. కొన్ని రోజుల నుంచి వారాల వ్యవధిలో రెండో పరీక్ష జరగ్గా అంత వేగంగా వైరస్ మళ్లీ సోకే అవకాశాలు తక్కువేనని వైరాలజిస్టులు చెబుతున్నారు. మొదటిసారి పరీక్షల్లో వారికి తప్పుగా నెగెటివ్ వచ్చిందా. తరువాతి పరీక్షల్లో తప్పు జరిగిందా? అన్నది అర్థం కావడం లేదు. రెండో పరీక్షలో పాజిటివ్‌గా తేలిన వారు వైరస్‌ను వ్యాపింపజేస్తారా? లేదా? అన్నది కూడా స్పష్టంగా తెలియకపోవడంతో ప్రస్తుతానికి వారిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచుతున్నారు. చైనాలో సార్స్ తరహా వైరస్ ఒకటి వ్యాపిస్తోందని అందరికంటే ముందుగా హెచ్చరించిన డాక్టర్ లీ వెన్ లియంగ్‌కు కూడా చాలాసార్లు నెగెటివ్ వచ్చిన తరువాత గానీ ఒకసారి పాజిటివ్ రాలేదు. అయితే చైనాలో వైరస్ నిర్ధారణకు ఉపయోగిస్తున్న న్యూక్లియిక్ ఆసిడ్ టెస్ట్ కచ్చితత్వం తక్కువని చైనీస్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ డైరెక్టర్ వాంగ్ చెన్ స్వయంగా ప్రకటించడం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం.

# గబ్బిలాలతో కరోనా.. అబద్ధమే!

**సాక్షి, హైదరాబాద్:** గబ్బిలాలతో కోవిడ్–19 మనుషులకు సోకిందనడం అబద్ధమేనని, అలాంటి తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని బ్యాట్ బయాలజిస్ట్, ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) బ్యాట్ స్పెషలిస్ట్ గ్రూప్ సభ్యుడు డాక్టర్ చెల్మల శ్రీనివాసులు పేర్కొన్నారు. గబ్బిలాల్లో ఉన్న వైరస్‌కు కోవిడ్–19కు సంబంధం లేదని తెలిపారు. కోవిడ్ పులుసు పంది నుంచి (ప్యాంగోలిన్) నుంచి మనుషులకు సోకినట్లు పరిశోధనల్లో తేలిందని, ఈ విషయాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రకటించిందన్నారు. అయినా గబ్బిలాలతో ఈ వైరస్ సోకుతుందని అపోహలు ప్రజల్లో పెరిగిపోయాయని, అందుకు అనేక కారణాలు ఉన్నాయని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ సెంటర్ ఫర్ బయోడైవర్సిటీ అండ్ కన్జర్వేషన్ స్టడీస్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న శ్రీనివాసులు గత 25 ఏళ్లుగా సౌత్ ఏషియాలో గబ్బిలాలపై ఆయన పరిశోధన చేస్తున్నారు. కొత్త వైరస్ అనగానే గబ్బిలాలపై ఎందుకు అనుమానం వస్తుందన్న దానిపై 'సాక్షి'తో మాట్లాడారు. ఈ సందర్భంగా వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే..

**తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు**

- ఐయూసీఎన్ సౌత్ ఏషియా బ్యాట్ బయాలజిస్ట్ డాక్టర్ చెల్మల శ్రీనివాసులు
- గబ్బిలాలను అంతమొందిస్తే ప్రకృతికి నష్టం
- పులుసు పందితోనే మానవ శరీరంలోకి కరోనా వైరస్
- అధికారికంగా ప్రకటించిన డబ్ల్యూహెచ్‌వో
- ఇతర జంతువుల్లాగే గబ్బిలాల్లో కరోనా జాతికి చెందిన వైరస్
- వైరస్ అనగానే గబ్బిలాలపై మొదట అనుమానం అందుకే..

### గబ్బిలాల్లో 40 శాతం వరకు..

కరోనా జాతికి చెందిన 100 రకాల వైరస్‌ల్లో 80 శాతం వైరస్‌లు అటవీ జంతువులు, పక్షుల్లోనే ఉంటాయి. వీటిలో 40 శాతం వైరస్‌లు ఒక్క గబ్బిలాల్లోనే ఉంటాయి. మిగిలిన 20 శాతం వైరస్‌లు పెంపుడు జంతువులు, పక్షుల్లో ఉండగా, అందులో ఒక్కోసారి ఒక్కో వైరస్ మనుషులకు సోకుతుంది. ఎక్కువ శాతం వాటిని తినడంతోనే వచ్చాయి. ప్రపంచ వ్యాప్తంగా ఏ కొత్త వైరస్‌తో వ్యాధి ప్రబలినా ముందుగా అనుమానం వచ్చేది గబ్బిలంపైనే. ఇతర జంతువులు, పక్షుల కంటే దానిపైనే ఎక్కువ పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గత 20 ఏళ్లలో వైరస్‌ల కారణంగా ఏ వ్యాధి ప్రబలినా ముందుగా గబ్బిలాలపై చేసిన పరిశోధనలే బయటకొచ్చాయి. కొంత మేర ఆ వ్యాధులకు కారణమైన వైరస్‌లు గబ్బిలాల్లో ఉండటం, ఆ పరిశోధనలు ముందుగా బయటకు రావడంతో ప్రజల్లో గబ్బిలాలపై అనుమానాలు పెరిగిపోయాయి. అన్ని వ్యాధుల్లోనూ గబ్బిలాల్లో ఉన్న వైరస్‌కు, మనిషికి సోకిన వైరస్‌కు వంద శాతం మ్యాచ్ కాకపోవడంతో తర్వాత లోతైన పరిశోధనల్లో ఇతర జంతువుల వల్ల ఆ వైరస్‌లు మనిషికి సోకినట్లు తేలింది.

### సార్స్ సమయం నుంచి మొదలుకొని..

2000 సంవత్సరంలో ప్రబలిన సార్స్.. కరోనా–1 వైరస్ కూడా గబ్బిలాల నుంచే వచ్చిందని చైనాలో శాస్త్రవేత్తలు ప్రాథమికంగా ప్రకటించారు. అయితే సార్స్ సంబంధ వైరస్ గబ్బిలాల్లో ఉన్నా 100 శాతం మ్యాచ్ కాలేదు. దీంతో లోతుగా పరిశోధన చేస్తే పునుగు పిల్లి నుంచి కరోనా–1 వైరస్ మనుషులకు సోకిందని తేల్చింది. ఈ విషయాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ప్రకటించింది. తర్వాత 2013–14లో మిడిల్ ఈస్టర్న్ రెస్పిరేటరీ సిండ్రోమ్ (మెర్స్) సోకినప్పుడు.. అదీ గబ్బిలాల వల్లే వచ్చిందని యూరోప్ దేశాలు పేర్కొన్నాయి. అప్పుడూ వైరస్ వంద శాతం మ్యాచ్ కాకపోవడంతో మళ్లీ పరిశోధన చేస్తే ఒంటె నుంచి సోకిందని తేలింది. ఎబోలా వచ్చినప్పుడు కూడా మొదట గబ్బిలాలనే అనుమానించారు. తర్వాత గొరిల్లా నుంచి సోకినట్లు వెల్లడైంది. ఇప్పుడు చైనాలోని వూహాన్‌లో ప్రబలిన కోవిడ్–19కు కూడా మొదట్లో చేపలు అని, తర్వాత పాములని, అనంతరం గబ్బిలాల కారణంగా సోకిందని చెబుతూ వచ్చారు. అయితే వూహాన్‌లో మనుషులకు సోకిన వైరస్‌కు గబ్బిలం నుంచి వచ్చిన వైరస్‌కు 90 శాతమే మ్యాచ్ అయింది. మిగతా 10 శాతం ఎందుకు మ్యాచ్ కాలేదని పరిశోధన చేస్తే కోవిడ్ సోకింది గబ్బిలాల వల్ల కాదని తేలింది. పులుసు పంది (ప్యాంగోలిన్) నుంచి మనుషులకు సోకిందని వెల్లడైంది. ఈ విషయాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ప్రకటించింది.



**అనవసర భయాలతో చంపొద్దు..**

గబ్బిలాలతో కోవిడ్–19 వచ్చిందన్నది అబద్ధమే. సోషల్ మీడియా కారణంగా వాటిపై ప్రజల్లో ఆందోళన పెరిగింది. ఎబోలా సోకినప్పుడు వందల సంఖ్యలో గబ్బిలాలనే చంపేశారు. ఇప్పుడు అలాంటివి చేయొద్దు. పర్యావరణ పరిరక్షణకు, మానవ ఉనికికి గబ్బిలాలు ఎంతో ముఖ్యం. వీటిలో ప్రధానంగా ఫల భక్షి గబ్బిలాలు, కీటక భక్షి గబ్బిలాలు ఉంటాయి. ఫల భక్షి గబ్బిలాలు అరుదైన వృక్ష జాతుల ఫలాలను తిని వాటి విత్తనాలను ఇతర ప్రాంతాల్లో విసర్జించడం ద్వారా వృక్షాల విస్తరణకు తోడ్పడతాయి. కీటక భక్షి గబ్బిలాలు.. రాత్రి వేళల్లో పంట పొలాలను పాడు చేసే కీటకాలను తింటూ రైతులకు ఎంతో మేలు చేస్తాయి. ఇక మన రాష్ట్రంలో 17 రకాల గబ్బిలాలు ఉండగా, అందులో 5 రకాల గబ్బిలాలు హైదరాబాద్ పట్టణ, పరిసర ప్రాంతాల్లో ఉన్నాయి. పట్టణాల్లో ఈ గబ్బిలాల కారణంగా దోమల బెడద తగ్గుతోంది. పట్టణాల్లో ఉంటున్న గబ్బిలాలు తమ ఆహారంగా దోమలనే 30 శాతం తింటున్నట్లు తేలింది. ప్రస్తుతం కోవిడ్ మహమ్మారి వ్యాప్తిని అరికట్టేందుకు భౌతిక దూరం పాటించడమే ప్రధానం. జూనోటిక్ వ్యాధుల వ్యాప్తిని తగ్గించడానికి దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం. ఆ దిశగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. నిర్దిష్ట మానవ కార్యకలాపాలను, అడవి జంతువులను తినడాన్ని, పర్యావరణ విధ్వంసాన్ని నియంత్రించడం ద్వారా ఇలాంటి వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చు.

## గవర్నర్ ఈస్టర్ శుభాకాంక్షలు



**సాక్షి, హైదరాబాద్:** గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రాష్ట్ర ప్రజలకు, క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఏసు ప్రభువు పునర్జన్మకు సంకేతంగా ప్రపంచ వ్యాప్తంగా ఈస్టర్ పర్వదినం జరుపుకుంటారని పేర్కొన్నారు. ఈస్టర్ పండుగ సమాజంలో సానుకూల దృక్పథాన్ని బలోపేతం చేస్తుందన్నారు. ఈ పర్వదినం మనకు కరోనాపై పోరాడటానికి శక్తినివ్వాలని, సాధారణ జనజీవనం పునరుద్ధరించబడాలని ఈ సందర్భంగా గవర్నర్ అభిలషించారు.

## పూలేకు సీఎం కేసీఆర్ నివాళి

**సాక్షి, హైదరాబాద్:** సామాజిక తత్వవేత్త, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా సీఎం కేసీఆర్ ఆయన సేవలను స్మరించుకున్నారు. సమసమాజ స్థాపనకై అహర్నిశలు కృషి చేసిన జ్యోతిరావ్ పూలే మహనీయుడని ముఖ్యమంత్రి కీర్తించారు. కుల, లింగ వివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన అందరికీ విద్యనందించాలని ఉద్యమం చేపట్టి ఆదర్శప్రాయుడిగా నిలిచారని కొనియాడారు. రాష్ట్రం అనుసరిస్తున్న విధానాలే పూలేకు నిజమైన నివాళి అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## నిరాడంబరంగా పూలే జయంతి వేడుకలు

**సాక్షి, హైదరాబాద్:** మహాత్మా జ్యోతిబా పూలే 194వ జయంతి వేడుకలు నిరాడంబరంగా జరిగాయి. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ తన కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంక్షేమ శాఖ కమిషనరేట్, జిల్లా కార్యాలయాలు, గురుకుల సొసైటీ కార్యాలయాల్లో పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. కరోనా వ్యాప్తిని అరికట్టే క్రమంలో ప్రభుత్వం పూలే జయంతి వేడుకలను రద్దు చేసిన విషయం తెలిసిందే. దీంతో పూలే అభిమానులు ఇంట్లోనే వేడుకలు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

## పూలేకు సీపీఎం నేతల నివాళి

**సాక్షి, హైదరాబాద్:** మహాత్మా జోతిబా పూలే గొప్ప సంస్కర్త అని, సంఘ సంస్కరణల కోసం, కుల అసమానతలకు వ్యతిరేకంగా, సాంఘిక సమానత్వ సాధనకు జీవితాంతం పోరాడిన మహా యోధుడని సీపీఎం నాయకులు, కార్యకర్తలు కొనియాడారు. శనివారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వారు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. కుల వ్యత్యాసాలే కాకుండా ఆర్థిక వ్యత్యా సాలు కూడా పోయేందుకు పూలే కషి చేశారని, స్త్రీ సంస్కరణలు, ధనిక, పేద తారతమ్యాలు రూపుమాపేందుకు పనిచేశారని గుర్తు చేశారు. దేశ విముక్తి, సామాజిక విముక్తిలో ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా చేసే పోరాటంతోపాటు కుల, సాంఘిక అసమానతలకు వ్యతిరేకంగా అంతేస్థాయిలో పోరాడాలని తమ్మినేని పిలుపునిచ్చారు.

## టెన్త్ విద్యార్థులకు నేటి నుంచి రివిజన్ క్లాసులు

**సాక్షి, హైదరాబాద్:** కరోనా విస్తరిస్తున్న నేపథ్యంలో పరీక్షలు వాయిదా పడిన పదో తరగతి విద్యార్థులకు దూరదర్శన్ యాదగిరి చానెల్ ద్వారా పునశ్చరణ తరగతులను ఏర్పాటు చేస్తున్నామని విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఈ తరగతులను ఆదివారం నుంచి ఈనెల 23 వరకు ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇంగ్లిష్, గణితం, ఫిజికల్ సైన్స్, బయాలజీ, సోషల్ సబ్జెక్టులకు సంబంధించి ఈ పునశ్చరణ తరగతులుంటాయని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోజనం కోసం ఏర్పాటు చేసిన ఈ సౌకర్యాన్ని ఇంట్లో ఉండే సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## రైతులకు నష్ట పరిహారం

### సీఎం కేసీఆర్‌కు సీపీఎం లేఖ



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగానికి వెంటనే పరిహారం అందించడంతో పాటు మామిడి రైతులకు మార్కెట్ సౌకర్యం కల్పన, వరి ధాన్యం కొనుగోలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్‌కు సీపీఎం విజ్ఞప్తిచేసింది. గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు వివిధ జిల్లాల్లో దాదాపు 37 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా వేసిన నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎంకు రాసిన లేఖలో సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు.

## సహాయ కార్యక్రమాల్లో కేడర్ నిమగ్నం

### టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన చాడ



**సాక్షి,హైదరాబాద్:** రాష్ట్రంలో లాక్‌డౌన్ నేపథ్యంలో వివిధ జిల్లాల్లో బియ్యం, పప్పులు, నూనె తదితర సామగ్రి పంపిణీ చేయడంతో పాటు వివిధ రూపాల్లో సహాయ కార్యక్రమాలను చేపట్టిన పార్టీ నాయకులు, కేడర్‌ను సీపీఐ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అభినందించారు. శనివారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర సమితి సభ్యులు, నాయకులతో పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను ఆయన సమీక్షించారు. లాక్‌డౌన్ పొడిగించనున్న నేపథ్యంలో పేదలకు ఖర్చు కోసం ఇచ్చే మొత్తాన్ని రూ.5 వేలకు, బియ్యాన్ని 25 కేజీలకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి చాడ విజ్ఞప్తి చేశారు.

## రంపం విరిగిపడి వడ్రంగి దుర్మరణం



వడ్రంగి రామస్వామి మృతదేహం

**ములుగు(గజ్వేల్):** రంపం విరిగిపడి ఓ వడ్రంగి మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం తున్కి బొల్లారంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ములుగు మండలం మామిడ్యాల ముంపు గ్రామానికి చెందిన రాయబండి రామస్వామి (38) వడ్రంగి. ఇతనికి భార్య లలిత, ఇద్దరు పిల్లలున్నారు. గ్రామం ముంపునకు గురికావడంతో వారి కుటుంబానికి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో అధికారులు ఇల్లు కేటాయించారు. 25 రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలసి రామస్వామి కొత్త ఇంట్లో చేరాడు. ఈ నేపథ్యంలో రామస్వామి కాలనీలోని కొందరి ఇంటి అవసరాల కోసం రంపపు యంత్రంతో శనివారం సాయంత్రం పనులు చేస్తున్నాడు. ఈ సందర్భంగా ప్రమాదవశాత్తు రంపపు బ్లేడ్ విరిగి ఎగిరిపడి రామస్వామి గొంతును కోసేసింది. దీంతో అతను అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ మార్చురీకి తరలించారు.

## ఎంసెట్ 15 రోజులు వాయిదా

### లాక్‌డౌన్ పొడిగింపు నేపథ్యంలో ఉన్నత విద్యామండలి నిర్ణయం



**సాక్షి, హైదరాబాద్:** లాక్‌డౌన్‌ను ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించిన నేపథ్యంలో ఎంసెట్, ఈసెట్ తదితర సెట్లను 15 రోజుల పాటు వాయిదా వేయనున్నట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి పేర్కొన్నారు. ముందస్తు షెడ్యూల్ ప్రకారం పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్ష ఈసెట్‌ను మే 2న నిర్వహించాల్సి ఉంది. అలాగే ఇంజనీరింగ్, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 4, 5, 7, 9, 11 తేదీల్లో ఎంసెట్ నిర్వహించాల్సి ఉంది. అయితే లాక్‌డౌన్‌ను ముందుగా ఈనెల 14వ తేదీ వరకు ప్రకటించిన నేపథ్యంలో అన్ని ప్రవేశ పరీక్షల (సెట్స్) దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 20వ తేదీ వరకు ఉన్నత విద్యామండలి పొడిగించింది. అయితే శనివారం లాక్‌డౌన్‌ను ఈ నెల 30వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో ప్రవేశ పరీక్షలను వాయిదా వేస్తామని పాపిరెడ్డి తెలిపారు. దాదాపు అన్ని ప్రవేశ పరీక్షలు వాయిదా పడతాయని పేర్కొన్నారు. అయితే ఈ వాయిదా ప్రభావం విద్యా సంవత్సరంపై లేకుండా అన్ని చర్యలు చేపడతామని, ఇబ్బందేమీ ఉండదని వెల్లడించారు. వివిధ సెట్లలో ముందుగా నిర్వహించాల్సిన ఈసెట్, ఎంసెట్ వాయిదా పడనుండగా, ఆ తర్వాత మే 13 నుంచి నిర్వహించాల్సిన పీఈసెట్, 20, 21 తేదీల్లో నిర్వహించాల్సిన ఐసెట్, 23న నిర్వహించాల్సిన ఎడ్‌సెట్, 27న నిర్వహించాల్సిన లాసెట్, 28 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించాల్సిన పీజీఈసెట్ కూడా వాయిదా పడే అవకాశం ఉంది.

# ప్రియుడే హంతకుడు

- తంగడపల్లి మహిళ హత్య కేసు విచారణ కొలిక్కి
- స్నేహితుడితో కలిసి చంపేసిన ఫేస్‌బుక్ ఫ్రెండ్

**చేవెళ్ల:** సంపన్న కుటుంబానికి చెందిన ఆమె.. ఫేస్‌బుక్‌లో పరిచయమైన ఓ ఫ్రెండ్ మాయలో పడింది. భర్త, పిల్లల్ని వదిలేసి అతడి వద్దకు వెళ్లిపోయింది. చివరకు కోరుకున్న ప్రియుడే కాలయముడై ఆమె ప్రాణాలు తీశాడు.. ఇదీ కొద్ది రోజుల క్రితం 'దిశ'ఘటన తరహాలో సంచలనం సృష్టించిన రంగారెడ్డి జిల్లా తంగడపల్లి బ్రిడ్జి కింద వెలుగు చేసిన మహిళ (36) హత్య కేసు మిస్టరీ. తన స్నేహితుడి సాయంతో ప్రియుడు ఈ ఘాతుకానికి పాల్పడినట్టు తేల్చారు. ప్రియుడి స్నేహితుడిని పట్టుకున్న పోలీసులు ఈ మేరకు కీలక ఆధారాలు సేకరించారు. అతడిని రిమాండ్‌కు తరలించినట్టు తెలుస్తోంది.

**ఆ రోజేం జరిగిందంటే..**

మార్చి 17న చేవెళ్ల మండలం తంగడపల్లి శివారులోని బ్రిడ్జి కింద యువతి మృతదేహం కనిపించింది. నగ్నంగా పడి ఉన్న ఆమె ముఖం పూర్తిగా ఛిద్రమైంది. ఒంటిపై ఖరీదైన నగలున్నాయి. పక్కనే నైలాన్ తాడు పడి ఉంది. ఇది మరో 'దిశ'ఘటనలా ఉందంటూ అప్పట్లో ప్రచారమైంది. చేవెళ్ల పోలీసులు మహిళ ఆచూకీ కోసం రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల పోలీసులకు తెలిపారు. మృతదేహం కుళ్లిపోతుండటంతో ఇటీవల చేవెళ్లలోనే పూడ్చిపెట్టారు. మృతురాలిని సిక్కింకు చెందిన మహిళగా గుర్తించారు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు కుటుంబీకులు నిరాకరించినట్లు తెలుస్తోంది. సంపన్న కుటుంబానికి చెందిన ఈ మహిళ భర్త వ్యాపారవేత్త అని, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం.

**ఫేస్‌బుక్ ద్వారా పరిచయం**

ముంబైలో ఉండే ప్రధాన నిందితుడికి ఈ మహిళ ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైంది. అది ప్రేమ, వివాహేతర సంబంధానికి దారితీసింది. ఆమె భర్త, పిల్లల్ని వదిలేసి సిక్కిం నుంచి 4 నెలల క్రితం ముంబైకి వెళ్లి అక్కడే ఉండేది. ప్రియుడు మరో మహిళతో చనువుగా ఉంటున్నట్టు గుర్తించిన ఆమె.. తనను పెళ్లిచేసుకోవాలని ఒత్తిడి చేయటంతో ఆమెను అడ్డు తొలగించుకునేందుకు ప్రియుడు పథకం పన్నాడు.

**చంపేసి ముంబైకి చెక్కేసి..**

సీసీ కెమెరాల పుటేజీలు, సెల్‌ఫోన్ సిగ్నల్ల జీపీఎస్ ట్రాక్‌ను సేకరించడం ద్వారా పోలీసులు ఓ కారులో ఇద్దరు వ్యక్తులు వచ్చినట్లు గుర్తించారు. ప్రధాన నిందితుడికి బంధువు, స్నేహితుడైన యువకుడు హైదరాబాద్‌లో ఇంటర్న్‌షిప్ కోసం ఉంటున్నాడు. ప్రధాన నిందితుడు తాను హైదరాబాద్ వస్తున్నానని, కారు ఏర్పాటు చేయాలని కోరటంతో ఈ యువకుడు అద్దె కారును ఏర్పాటు చేశాడు. గత నెల 15న ముంబై నుంచి నిందితుడు తన ప్రియురాలిని తీసుకొని విమానంలో హైదరాబాద్ వచ్చాడు. ఇక్కడి యువకుడితో కలిసి అద్దె కారులో లాంగ్ డ్రైవ్ కోసమని ముగ్గురూ వికారాబాద్‌కు వచ్చారు. పథకం ప్రకారం నైలాన్ తాడుతో కారులోనే మహిళ మెడకు ఉరిబిగించి హత్య చేశారు. తంగడపల్లి బ్రిడ్జి వద్ద వాహనం ఆపి మృతదేహాన్ని తాడుతో కిందికి దించారు. ముఖం గుర్తించకుండా బండరాయితో మోది ఛిద్రం చేశారు. రాయితోపాటు మహిళ దుస్తులను తమతో తీసుకెళ్లారు. కారు తంగడపల్లి ప్రగతి రిసార్టు మీదుగా ప్రొద్దటూరు నార్సింగి మీదుగా ఔటర్ రింగ్‌రోడ్డుకు చేరుకున్నట్లు సీసీటీవీ పుటేజీలో పోలీసులు గుర్తించారు. అనంతరం ప్రధాన నిందితుడు ముంబై వెళ్లిపోయాడు. కారు నంబర్ ఆధారంగా దానిని అద్దెకు తీసుకున్న యువకుడిని అదుపులోకి తీసుకోవటంతో ఈ కీలక ఆధారాలు లభించినట్లు సమాచారం.



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు (ఫైల్)

# డయల్ 100కు ఏడేళ్లు!

- 2013లో ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పడ్డ కంట్రోల్ రూమ్
- నాటి నుంచి 16 కోట్ల కాల్స్‌కు సమాధానం
- రోజుకు సగటున 62 వేల ఫోన్ కాల్స్..

**సాక్షి, హైదరాబాద్:** ఎలాంటి ఆపద వచ్చినా.. అందరికీ గుర్తుకు వచ్చే నంబరు డయల్ 100. ఈ డయల్ 100 కంట్రోల్ రూముకు శనివారంతో ఏడేళ్లు పూర్తయ్యాయి. 2013 ఏప్రిల్ 11న ఉమ్మడి రాష్ట్రంలోనే ఈ కంట్రోల్ రూమును ఏర్పాటు చేశారు. అనంతరం రాష్ట్ర విభజన తర్వాత దీన్ని కూడా విభజించారు. కేవలం నేరాలకు సంబంధించిన కాల్స్ మాత్రమే కాదు.. రోడ్డు ప్రమాదాలు, తగాదాలు, చోరీలు, కొట్లాటలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, అగ్ని ప్రమాదాలు ఇలా సమస్య ఏదైనా ముందు ఫోన్ వెళ్లేది '100'కే. ఎమర్జెన్సీ రెస్పాన్స్‌లో అత్యంత కీలకమైనది డయల్ 100. అందుకే, ఇక్కడ పనిచేసే సిబ్బంది నిత్యం చాలా అప్రమత్తంగా ఉంటారు. ప్రతి కాల్‌ని వెంటనే రిసీవ్ చేసుకుంటారు. అందులో కొన్ని అనవసరమైనవి, బ్లాంక్ కాల్స్, ఫేక్ కాల్స్, చిన్నపిల్లలు, ఆకతాయిలు చేసే కాల్స్ అలా అనేక రకమైన కాల్స్ వస్తుంటాయి.

### 2017లో అత్యధికంగా 4.5 కోట్ల కాల్స్..

ఈ ఏడేళ్లలో కంట్రోల్ రూము సిబ్బంది 15.9 కోట్లు, అంటే దాదాపుగా 16 కోట్ల ఫోన్ కాల్స్ స్వీకరించారు. ఈ లెక్కన రోజుకు దాదాపు 62 వేల కాల్స్, గంటకు 2,597, నిమిషానికి 43 కాల్స్ చొప్పున కంట్రోల్ రూముకు కాల్స్ వెళ్తున్నాయి. 2017లో అత్యధికంగా 4.5 కోట్ల కాల్స్ వచ్చాయి. అంటే రోజుకు 1.25 లక్షల కాల్స్ ఆన్సర్ చేశారన్నమాట. మూడు షిఫ్టుల్లో పని చేసే ఈ సిబ్బందికి ఆ ఏడాది మొత్తం నిమిషానికి 86 కాల్స్‌కు పైగానే సమాధానం చెప్పాల్సి వచ్చింది. ఈ కాల్స్‌కు స్పందించిన సిబ్బంది వెంటనే బాధితులు ఎక్కడున్నారో కనుక్కొని వారికి తక్షణ సాయం అందజేశారు. ఈ క్రమంలో వందలాది మంది ప్రాణాలు కాపాడారు. ఈ ఫోన్ కాల్స్‌ని విశ్లేషిస్తే.. 2018 నుంచి తగ్గాయి. కానీ, అత్యవసర కాల్స్ పెరగడం గమనార్హం. పోలీసులకు సమాచారం అందించేందుకు ఫోన్లు, హాక్ ఐ, సోషల్ మీడియా మాధ్యమాలు పెరగడం ఇందుకు కారణం.




**ఏడేళ్లలో డయల్ 100కు వచ్చిన కాల్స్ వివరాలు**

| సంవత్సరం | వచ్చిన కాల్స్ | ఎమర్జెన్సీ కాల్స్ |
|---|---|---|
| 2014 | 1,35,15,611 | 2,99,004 |
| 2015 | 2,50,52,303 | 6,07,900 |
| 2016 | 3,74,08,755 | 5,44,442 |
| 2017 | 4,54,22,735 | 5,34,967 |
| 2018 | 2,66,39,637 | 8,76,998 |
| 2019 | 89,15,696 | 13,57,369 |
| 2020 | 23,15,623 | 4,11,823 |

(జనవరి 1 నుంచి మార్చి 31 వరకు)

**ఏడేళ్ల సగటు ఫోన్ కాల్స్**

రోజుకు: 62,336, గంటకు: 2,597, నిమిషానికి: 43 కాల్స్

## బత్తాయి, మామిడి ఎగుమతులకు ప్రత్యేక రైలు

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ నుంచి బత్తాయి, మామిడి ఎగుమతులకు ప్రత్యేక రైలు సర్వీసులు ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి బి.జనార్దన్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. పంట ఉత్పత్తుల రవాణాకు ప్రత్యేక రైలు సర్వీసుల ఏర్పాటుపై కేంద్ర వ్యవసాయ శాఖ అదనపు కార్యదర్శి అభిలాష లిక్కి, రైల్వే బోర్డు ఇ.డి.శైలేంద్ర శర్మ అన్ని రాష్ట్రాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా పంట ఉత్పత్తుల సరఫరాకు ప్రతి రైల్వే జోన్‌కు అధికారులను నియమించినట్లు కేంద్రం తెలిపింది. దక్షిణ మధ్య రైల్వేకి ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చీఫ్ కమర్షియల్ మేనేజర్‌ను సమన్వయకర్తగా నియమించారు. రాష్ట్రం నుంచి వెళ్లాల్సిన పంట ఉత్పత్తులు కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లు, హైదరాబాద్ సనత్ నగర్ గూడ్స్ షెడ్ నుంచి ఏర్పాటు చేస్తామని రైల్వే అధికారులు తెలిపారు. కనీసం 23 టన్నుల సరుకు రవాణా పార్శిల్ వ్యాగన్లను బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. 23 టన్నుల పార్శిల్ వ్యాన్‌ను ఢిల్లీకి పంపేందుకు హైదరాబాద్ నుంచి రూ. 1.20 లక్షలు, ఇతర స్టేషన్ నుంచి రూ.1.25 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అవసర మైన వారు చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఫ్రైట్ క్రిస్టోఫర్ 9701370952 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## వైద్యుడే దేవుడైన వేళ...



శిశువును పరీక్షిస్తున్న వైద్యుడు

**ముంబై:** వైద్యోనారాయణో హరి అన్న సూక్తిని నిజం చేశారో వైద్యుడు. అప్పుడే పుట్టిన పసికందుకి ఊపిరిపీల్చుకోవడంలో ఇబ్బంది ఏర్పడడంతో స్వయంగా వైద్యుడే ఆ పసికందుని ఆసుపత్రికి తీసుకెళ్ళిన ఘటన ఇది. ఆలీబాగ్ నివాసి శ్వేతాపాటిల్‌కి పురిటినొప్పులు రావడంతో ఆమె భర్త దగ్గర్లోని ఆసుపత్రిలో చేర్చారు. శ్వేత ప్రసవం అయిన వెంటనే బిడ్డ ఊపిరి తీసుకోలేకపోవడంతో శరీరం మొత్తం నీలంగా మారిపోయింది. లాక్‌డౌన్ కారణంగా ఎటువంటి రవాణా సౌకర్యం లేకపోవడంతో డాక్టరే స్వయంగా తన స్కూటర్‌పై వారిని ఆసుపత్రికి తీసుకెళ్ళి పిల్లవాడిని రక్షించారు. ప్రస్తుతం బిడ్డ క్షేమంగా ఉన్నాడు.

## డిజిటల్ స్టెతస్కోప్

**న్యూఢిల్లీ:** స్టెతస్కోప్‌ని ఛాతీపై ఉంచకుండానే, దూరం నుంచే హృదయ స్పందనలను తెలుసుకునే డిజిటల్ స్టెతస్కోప్‌ని ముంబై ఐఐటీ పరిశోధక బృందం తయారుచేసింది. కరోనా పీడితుల నుంచి ఆరోగ్య సిబ్బందికి వైరస్ వ్యాప్తి ప్రమాదాన్ని తగ్గించేందుకు ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆ బృందం తెలిపింది. డిజిటల్ స్టెతస్కోప్ వినియోగించడం ద్వారా రోగి హృదయ స్పందనలకు సంబంధించిన డేటా బ్లూ టూత్ ద్వారా వైద్యులకు చేరుతుంది. దీనివల్ల డాక్టర్లు పేషెంట్‌ని తాకాల్సిన అవసరం ఉండదు. ఈ టెక్నాలజీ ద్వారా తయారుచేసిన 1,000 స్టెతస్కోప్‌లను దేశవ్యాప్తంగా ఉన్న ఆసుపత్రులకు పంపించారు.

## వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ఊరట!

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ తీవ్రత అంతగా లేని ప్రాంతాల్లో వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు ఆంక్షల నుంచి కొంత మినహాయింపు ఇవ్వాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం. కరోనా పాజిటివ్ కేసుల ఉధృతిని బట్టి దేశాన్ని మూడు జోన్లుగా.. రెడ్, ఆరెంజ్, గ్రీన్ జోన్లుగా విభజించాలన్న ప్రతిపాదన ఉంది. ఆరెంజ్, గ్రీన్ జోన్లలో భౌతిక దూరాన్ని పాటిస్తూనే పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తులు అందుతున్నాయి. వైరస్ వ్యాప్తి చెందకుండా హాట్‌స్పాట్లలో పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టడం, లాక్‌డౌన్ ముగిసిన వెంటనే ఆర్థిక రంగం పునరుత్తేజం చెందేలా చేయడంపైనే కేంద్రం ప్రధానంగా దృష్టి సారించింది.

## వేసవి సెలవులు రద్దు చేయండి: సుప్రీం బార్

**న్యూఢిల్లీ:** ప్రస్తుతం నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల్లో అత్యున్నత న్యాయస్థానానికి వేసవి సెలవులు రద్దు చేయాలని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ కోరింది. కక్షిదారులు, చట్టం యొక్క విస్తృత ప్రయోజనాలు నెరవేరేందుకు ఈ వేసవిని పనికాలంగా పరిగణించాలని ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ ఎస్‌ఏ బాబ్డే, ఇతర న్యాయమూర్తులకు విజ్ఞప్తి చేసింది. సుప్రీంకోర్టుకు ఏటా మే 16 నుంచి జూలై 5వ తేదీ వరకు అమలయ్యే వేసవి సెలవుల్లోనూ న్యాయవాదులంతా అందుబాటులో ఉండాలని కోరినట్లు అందులో వివరించింది. ఈ మేరకు చేసిన తీర్మానాలను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దుష్యంత్ దవే సీజేఐ దృష్టికి తీసుకెళతారని పేర్కొంది.

## చైనాలో కుక్క మాంసంపై నిషేధం

**బీజింగ్:** కరోనా మహమ్మారి వ్యాప్తి నేపథ్యంలో కుక్క మాంసం వ్యాపారానికి ఫుల్‌స్టాప్ పెట్టేందుకు చైనా సిద్ధమైంది. కుక్కలను ఆహారానికి ఉపయోగించకుండా, పెంపుడు జంతువులుగా చూడాలంటూ కమ్యూనిస్టు ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను విడుదల చేసింది. కుకలతోపాటు కుక్కలు, పిల్లులను కూడా మినహాయింపు జాబితాలో చేర్చింది. కరోనా వైరస్ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించిందనే అనుమానాల నేపథ్యంలో ఆహారపు జాబితాలో మార్పులు చేపట్టినట్లు ప్రభుత్వం పేర్కొంది. చైనాలో ఏటా కోటి కుక్కలను మాంసం కోసం వధిస్తున్నట్లు అంచనా.

## త్యాగ గుణం అలవర్చుకోండి

**జైపూర్:** లాక్‌డౌన్ లాంటి కఠిన సమయాల్లో ఏదో ఒకటి త్యాగం చేయడం నేర్చుకోవాలని రాజస్తాన్ రాష్ట్రం చూరు జిల్లా కలెక్టర్ సందేశ్ నాయక్ పిలుపునిచ్చారు. లాక్‌డౌన్ వల్ల తమకు చాక్లెట్లు, ఐస్ క్రీములు, కోరుకున్న కూరగాయలు వంటివి దొరకడం లేదని అధికారులు, ప్రజలు తనకు ఫోన్లు చేస్తున్నారని ఆయన అన్నారు. ఇలాంటి సమయాల్లో ఏదో ఒకటి త్యాగం చేయడం నేర్చుకోవాలని, త్యాగం చేసిన దాన్ని పేదలకు దానం చేయాలని పేర్కొన్నారు. తనకు తానుగా మధ్యాహ్న భోజనాన్ని మానేస్తున్నానని చెప్పారు. ఏదో ఒకటి త్యాగం చేయాలనే కార్యక్రమం గత మూడు రోజులుగా రాష్ట్రంలో సత్ఫలితాలను ఇస్తోందన్నారు. ఘంఘుకు చెందిన బీర్బల్ నొఖ్వాల్ తనకు ఇష్టమైన బంగాళాదుంపను త్యాగం చేయగా, ఆయుర్వేద డాక్టర్ లీలాధర్ శర్మ తన ఆహారంలో సగ భాగాన్ని తగ్గించుకున్నారు. గాంధేయవాది ఎల్డీ జోషి అల్పాహారాన్ని, పాలను త్యజిస్తున్నట్లు చెప్పారు. వాటిని పేదలకు అందిస్తానని జోషి చెప్పారు.

# లాక్‌డౌన్ పొడిగింపునకే మొగ్గు!

- ఈ విషయంలో ముఖ్యమంత్రుల్లో ఏకాభిప్రాయం ఉంది
- సీఎంలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** దేశంలో కరోనా రక్కసిని పూర్తిగా అంతమొందించేందుకు ఏప్రిల్ 14వ తేదీ తరువాత కూడా లాక్‌డౌన్‌ను కొనసాగించేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిపిన సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టమైన సంకేతాలిచ్చారు. లాక్‌డౌన్‌ను కనీసం 2 వారాలైనా కొనసాగించేందుకు దాదాపు అన్ని రాష్ట్రాలు ఏకాభిప్రాయంతో ఉన్నట్లు స్పష్టమవుతోందని ప్రధాని పేర్కొన్నారు. కోవిడ్ –19పై పోరులో ముందుండి పోరాడుతున్న వైద్యులు, ఇతర శాఖల సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాలను తగినన్ని అందుబాటులో ఉంచుతామని ప్రధాని సీఎంలకు వివరించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా, ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. లాక్‌డౌన్ కారణంగా కుదేలయిన రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలను ఆదుకునేందుకు, కోవిడ్–19పై పోరు కొనసాగించేందుకు కేంద్రం సాయం అందించాలని పలువురు సీఎంలు ప్రధానిని అభ్యర్థించారు. కరోనా వైరస్ వ్యాప్తిని సంపూర్ణంగా అడ్డుకునేందుకు లాక్‌డౌన్‌ను కొనసాగించడమే అత్యుత్తమ, ఏకైక మార్గమని పంజాబ్, ఢిల్లీ ముఖ్యమంత్రులు అమరీందర్ సింగ్, అరవింద్ కేజ్రీవాల్ ప్రధానికి సూచించారు. ఏప్రిల్ ఆఖరు దాకా లాక్‌డౌన్‌ను కొనసాగించాలని వారు ప్రధానికి సూచించారు. పంజాబ్, ఒడిశా రాష్ట్రాలు ఇప్పటికే లాక్‌డౌన్‌ను కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ప్రధాని మోదీ తెల్లని వస్త్రంతో చేసిన మాస్క్‌ను ధరించగా, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు కూడా మాస్క్‌లతో ఈ భేటీలో



లాక్‌డౌన్ కారణంగా కోల్‌కతాలో తన ఇంటి నుంచి బయటకు చూస్తున్న వృద్ధుడు

పాల్గొన్నారు. కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఏ మేరకు ఫలితాలను ఇచ్చాయన్నది రానున్న 3, 4 వారాల్లో తేలుతుందని ప్రధాని వ్యాఖ్యానించారు. వైరస్‌ను పూర్తిగా రూపుమాపేందుకు రానున్న 3, 4 వారాలు అత్యంత కీలకమన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో మమతా బెనర్జీ (బెంగాల్), యోగి ఆదిత్యనాథ్(ఉత్తరప్రదేశ్), ఉద్ధవ్ ఠాక్రే(మహారాష్ట్ర), ఎంఎల్ ఖట్టర్(హరియాణా), నితీశ్‌కుమార్(బిహార్) తదితర రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కొన్ని ఆంక్షల సడలింపుతో లాక్‌డౌన్‌ను కొనసాగించనున్నారన్న వార్తల నేపథ్యంలో శనివారం ఉదయం 11 గంటలకు ఈ వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభమైంది.

### ప్రాణాలూ ముఖ్యమే.. అభివృద్ధీ ముఖ్యమే

మొదట లాక్‌డౌన్ ప్రకటించినప్పుడు ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రభుత్వాల ప్రాథామ్యమని చెప్పామని, అయితే, ఇప్పుడు ప్రభుత్వాల లక్ష్యం ప్రాణాలను కాపాడటంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడటం కూడా అని ప్రధాని వ్యాఖ్యానించారు. 'లాక్‌డౌన్ ప్రకటిస్తున్న సమయంలో ప్రాణాలు ఉంటేనే అభివృద్ధి అన్నాను. నా మాటలను అర్థం చేసుకున్న దేశప్రజలు లాక్‌డౌన్ నిబంధనలను అద్భుతంగా పాటించారు. ఇప్పుడు ప్రాణాలతో పాటు దేశాభివృద్ధిపైనా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది' అన్నారు. కరోనా కట్టడిలో కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పని చేస్తున్నాయన్నారు. ఔషధాలు, నిత్యావసర వస్తువులు తగినన్ని అందుబాటులో ఉన్నాయని, వాటిని అక్రమంగా నిల్వ చేస్తే తీవ్ర చర్యలుంటాయని హెచ్చరించారు. వైద్య సిబ్బంది, ఈశాన్య రాష్ట్రాలు, కశ్మీర్ విద్యార్థులపై దాడులను ప్రధాని ఖండించారు. కోవిడ్ 19కి చికిత్స లేనందున భౌతిక దూరం పాటించడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం తప్పని సరి అని ప్రధాని పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్లలో రద్దీని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దేశం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధం కావడానికి ఈ సంక్షోభాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

# 24 గంటల్లో 1035 కేసులు

- రికార్డు స్థాయిలో నమోదైన కొత్త కరోనా పాజిటివ్ కేసులు
- మహమ్మారి కాటుకు ఒకే రోజు 40 మంది కన్నుమూత
- మొత్తం మరణాలు: 242.. మొత్తం కేసులు: 7,529



మహారాష్ట్రలోని కరాడ్‌లో కోవిడ్‌తో మృతి చెందిన వ్యక్తి దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేస్తున్న వైద్య సిబ్బంది

**న్యూఢిల్లీ:** దేశంలో కరోనా ప్రకోపానికి జనం బలవుతూనే ఉన్నారు. గత 24 గంటల్లో ఏకంగా 1,035 కొత్త పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కరోనా కాటుతో తాజాగా 40 మంది కన్నుమూశారు. దీంతో మృతుల సంఖ్య 242కు, పాజిటివ్ కేసుల సంఖ్య 7,529కు చేరిందని కేంద్ర ఆరోగ్య శాఖ శనివారం ప్రకటించింది. యాక్టివ్ కరోనా కేసులు 6,634 కాగా, 652 మంది బాధితులు చికిత్సతో పూర్తిగా కోలుకున్నారు. రాష్ట్రాల వారీగా గణాంకాలను పరిశీలిస్తే..కరోనా దేశవ్యాప్తంగా 261 మంది మృతి చెందినట్లు, 8,016 కరోనా పాజిటివ్ కేసులు నమోదయినట్లు స్పష్టమవుతోంది.

**నియంత్రణ చర్యలు లేకుంటే..**

కరోనా కట్టడికి ప్రభుత్వం ముందుగానే చర్యలు ప్రారంభించిందని కేంద్ర ఆరోగ్య శాఖ సంయక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ మీడియాతో అన్నారు. లాక్‌డౌన్, ఇతర నియంత్రణ చర్యలు చేపట్టకపోతే కరోనా కేసుల సంఖ్య ఇప్పటికే 2.08 లక్షలకు, ఈనెల 15 నాటికి ఏకంగా 8.2 లక్షలకు చేరేదని అన్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల కేసుల సంఖ్య ఇప్పటిదాకా 7,447కే పరిమితమైందన్నారు.

**586 ఆసుపత్రుల్లో వైద్య సేవలు**

దేశవ్యాప్తంగా 586 ఆసుపత్రుల్లో కరోనా వైరస్ బాధితులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు లవ్ అగర్వాల్ వెల్లడించారు. ఈ హాస్పిటళ్లలో లక్షకుపైగా ఐసోలేషన్ పడకలు, 11,836 ఐసీయూ పడకలను కేటాయించినట్లు తెలిపారు. దేశంలో ప్రస్తుతం యాంటీ మలేరియా ఔషధం హైడ్రాక్సీ క్లోరోక్విన్ కొరత లేదని స్పష్టం చేశారు. కాగా, ఢిల్లీ స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్(డీఎస్‌సీఐ)లో సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ ఆసుపత్రిలో ఒక డాక్టర్, 9 మంది పారామెడికల్ సిబ్బందితోపాటు 11 మందికి కరోనా వైరస్ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు, ఇతర రోగులను సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేర్చారు. మొత్తం ఆసుపత్రిని శానిటైజ్ చేశారు. దేశంలో 80 శాతం కరోనా పాజిటివ్ కేసులు 17 రాష్ట్రాల్లోని 71 జిల్లాల్లోనే నమోదయ్యాయని ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ తెలిపారు. కరోనా వైరస్ కట్టడిలో కువైట్‌కు భారత్ అన్ని విధాలా సహకారం అందిస్తోందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. లాక్‌డౌన్ కారణంగా ఇళ్లకే పరిమితమైన కేంద్రమంత్రులు సోమవారం నుంచి విధుల్లో చేరనున్నారు. కేంద్ర ప్రభుత్వ సూచన మేరకు వారు విధులు పునఃప్రారంభించనున్నారు.

**వైద్య బృందంపై దాడి**

కరోనా వైరస్ లక్షణాలున్న వ్యక్తిని ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా కొందరు దుండగులు వైద్య సిబ్బందిపై రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్‌లో జరిగింది. ఈ వ్యవహారంతో సంబంధమున్న ఓ ఇమామ్‌తో సహా నలుగురిని అరెస్టు చేసి, జాతీయ భద్రతా చట్టం కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు చెప్పారు.

### తబ్లిగీల ఆచూకీ చెప్తే 5,000 రివార్డు

తబ్లిగీ జమాత్ సభ్యుల ఆచూకీ కనిపెట్టడంలో సహకరించిన వారికి రివార్డు ఇస్తామని ఉత్తరప్రదేశ్ పోలీసు శాఖ ప్రకటించింది. గత నెలలో ఢిల్లీ నిజాముద్దీన్‌లో జరిగిన మత సమ్మేళనంలో పాల్గొని, తిరిగి వచ్చిన వారిలో కొందరు ఇప్పటికీ అజ్ఞాతంలోనే ఉన్నారని పోలీసులు చెబుతున్నారు. కరోనా నిర్ధారణ పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు రావడం లేదని అంటున్నారు. వీరి ఆచూకీ చెప్పినవారికి రూ.5,000 రివార్డు అందజేస్తామని తాజాగా ప్రకటించారు.

### మహారాష్ట్ర, కర్ణాటకల్లోనూ 30దాకా

లాక్‌డౌన్‌ను 30వ తేదీ వరకు కొనసాగించాలని మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాని మోదీతో వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఏప్రిల్ 14 తరువాత కొన్ని ప్రాంతాల్లో ఆంక్షల సడలింపు ఉంటుందని, వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మరింత కఠిన ఆంక్షలు ఉంటాయన్నారు. కర్ణాటకలో కూడా లాక్‌డౌన్ మరో రెండు వారాలు కొనసాగుతుందని, సంబంధిత విధివిధానాలను కేంద్రం ప్రకటిస్తుందని సీఎం యడ్యూరప్ప శనివారం చెప్పారు.

భారతీయ జీవన బీమా నిగమ
LIFE INSURANCE CORPORATION OF INDIA

## ఎల్ఐసీ ప్రీమియం గడువు పొడిగింపు

**ముంబై:** కోవిడ్–19 కారణంగా వాయిదాల చెల్లింపు గడువును 30 రోజుల పాటు పెంచుతున్నట్లు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ప్రకటించింది. లాక్ డౌన్ కారణంగా పాలసీదారులు సమస్యలు ఎదుర్కొంటున్నందున మార్చి, ఏప్రిల్ గడువుల చెల్లింపులకు ఇది వర్తిస్తుందని తెలిపింది. గ్రేస్ పీరియడ్ మార్చి 22తో ముగిసినా ఏప్రిల్ 15వరకూ అనుమతిస్తున్నట్లు తెలిపింది. సర్వీసు చార్జీలు లేకుండా ఆన్‌లైన్ ద్వారా కూడా చెల్లించవచ్చని పేర్కొంది. మొబైల్ యాప్ ఎల్ఐసీ పే డైరెక్ట్, నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, ఫోన్ పే, పేటీఎం, గూగుల్ పే, భీమ్, యూపీఐల ద్వారా చెల్లించవ్చని తెలిపింది. ఐడీబీఐ, యాక్సిస్ బ్యాంకుల వద్ద, కామన్ సర్వీస్ సెంటర్స్ (సీఎస్సీ)ల ద్వారా ప్రీమియం చెల్లించవచ్చని పేర్కొంది. కోవిడ్ –19తో మరణించిన 16 మంది పాలసీదారుల సంబంధీకులకు డబ్బులు చెల్లించినట్లు స్పష్టం చేసింది. అదే విధంగా, మార్చి, ఏప్రిల్, మే నెలలకు చెల్లించాల్సిన బీమా ప్రీమియంను జూన్ 30 వరకూ పెనాల్టీ లేకుండానే చెల్లించవచ్చని తపాశాల శాఖ ప్రకటించింది. వీటిలో పోస్టల్ లైఫ్ న్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలున్నాయి. రిజిస్టర్డ్ పోర్టల్ ద్వారా వినియోగదారులు ప్రీమియం చెల్లించవచ్చని పేర్కొంది.

# ఏ ఆపరేటర్‌కైనా అదే సెట్‌టాప్ బాక్సు

**న్యూఢిల్లీ:** డీటీహెచ్ సంస్థలు తమ వినియోగదారులకు ఇచ్చే సెట్‌టాప్ బాక్సులు... ఒక ఆపరేటర్ నుంచి వేరొక ఆపరేటర్‌కు మారినా సరే ఉపయోగపడేటట్లు ఉండాలని టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) స్పష్టం చేసింది. ఇలాంటి బాక్సులనే వినియోగదార్లకు ఇవ్వాల్సిందిగా కంపెనీలను ఆదేశించాలని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు సూచించింది. అంటే వినియోగదారుడు ఆపరేటర్‌ను మార్చాలని భావించినా (డీటీహెచ్ పోర్టబిలిటీ) సెట్‌టాప్ బాక్సు మాత్రం మార్చాల్సిన పని ఉండదు. ఈ సెట్‌టాప్ బాక్సులన్నీ యూఎస్‌బీ ఆధారిత కనెక్షన్‌తో పనిచేసేలా ఉండాలని కూడా ట్రాయ్ స్పష్టంచేసింది. ఈ మేరకు కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ మార్గదర్శకాలను సవరించాలని కూడా ట్రాయ్ సూచించింది. ఈ మార్పులను అమలు చేసేందుకు డీటీహెచ్ కంపెనీలకు 6 నెలల గడువివ్వాలని ట్రాయ్ పేర్కొంది. దీనికోసం ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ట్రాయ్, భారత ప్రమాణాల సంస్థ(బీఐఎస్), టీవీ ఉత్పత్తిదారులతో కూడిన సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రిత్వ శాఖను కోరింది. ప్రతిపాదిత ప్రమాణాలను డీటీహెచ్, కేబుల్ టీవీ విభాగాలు అమలు చేస్తున్నదీ లేనిదీ ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది.



## కరోనా సమయంలోనూ దక్షిణకొరియాలో పార్లమెంట్ ఎన్నికలు

**సియోల్:** కరోనా విజృంభిస్తున్న సమయంలోనూ విజయవంతంగా పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించి దక్షిణ కొరియా చరిత్ర సృష్టించింది. పోలింగ్ సమయంలో కరోనా వ్యాప్తి చెందకుండా అధికారులు పూర్తి జాగ్రత్తలు తీసుకున్నారు. దేశవ్యాప్తంగా దాదాపు 14 వేల పోలింగ్ బూత్‌లను క్రిమిరహితం చేశారు. ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్ద పరస్పరం 3 అడుగుల దూరం పాటించారు. బూత్‌లోకి వెళ్లేమందే ఓటర్ల టెంపరేచర్‌లను పరీక్షించి, జ్వరం ఉన్నవారిని లోపలికి అనుమతించలేదు. బూత్‌లోకి వెళ్లాక చేతులను శానిటైజ్ చేసుకుని, అధికారులు ఇచ్చిన గ్లవ్స్ వేసుకుని ఓటేశారు. నిజానికి 300 మంది సభ్యుల నేషనల్ అసెంబ్లీకి ఎన్నికలు బుధవారం జరగాల్సి ఉంది. అయితే, అక్కడ ముందుగానే ఓటేసే అవకాశం ఉంది. దాంతో శుక్ర, శనివారాల్లోనే పోలింగ్ నిర్వహించారు.



ఢిల్లీలోని జీకే-1 పోలీస్‌స్టేషన్‌లో పేదల కోసం మాస్కులు కుడుతున్న మహిళా పోలీసులు

## కరోనాతో ఇండిగో ఉద్యోగి మృతి

**ముంబై:** తమ సంస్థకు చెందిన ఉద్యోగి ఒకరు కరోనా వైరస్ బారినపడి చెన్నైలో మృతి చెందినట్లు విమానయాన సంస్థ ఇండిగో శనివారం ప్రకటించింది. అయితే, పూర్తి వివరాలు బయటపెట్టలేదు. 55 ఏళ్లకుపైగా వయసున్న అతడు ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడని, శుక్రవారం చనిపోయాడని సమాచారం. 2006 నుంచి ఇండిగో సంస్థలో పనిచేస్తున్నాడని తెలిసింది. దేశంలో ఒక విమానయాన సంస్థ ఉద్యోగి కరోనాతో చనిపోవడం ఇదే మొదటిసారిగా భావిస్తున్నారు.

# అమెరికాలో మృత్యుఘోష

ఒకే రోజు రెండు వేలు దాటిన కోవిడ్ మరణాలు ● 40 మందికి పైగా ఇండియన్ అమెరికన్లు మృతి

| ఈ అంకెలు శనివారం రాత్రి 11 గంటలకు.. | ప్రపంచవ్యాప్తంగా మొత్తం కేసులు | మరణాలు | కోలుకున్న వారు |
|---|---|---|---|
| | 17,16,674 | 1,07,637 | 3,95,586 |

**వాషింగ్టన్/వూహాన్/లండన్/ఇస్తాంబుల్:** అమెరికాలో కోవిడ్–19 విధ్వంసం సృష్టిస్తోంది. ఇప్పటివరకు 18,860 మంది మృతి చెందారు. ప్రాణాంతక ఈ వైరస్ సోకి 40 మందికి పైగా భారతీయ సంతతికి చెందిన వారు మరణించారు. వీరిలో12 మంది వరకు భారతీయ పౌరులు ఉన్నట్టు తెలుస్తోంది. కోవిడ్‌తో కన్నుమూసిన వారిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఇద్దరు, కేరళకు చెందిన వారు 17 మంది, గుజరాతీయులు 10 మంది, నలుగురు పంజాబీయులు, ఒడిశాకు చెందిన వారు ఒకరు ఉన్నారు. మృతుల్లో అత్యధికులు 60 ఏళ్లకు పై బడిన వారే. 21 ఏళ్ల వయసున్న వ్యక్తి కూడా మృతుల్లో ఉన్నారు. న్యూయార్క్‌లో వెయ్యి మందికిపైగా, న్యూజెర్సీలో 400 మందికి పైగా ఇండియన్ అమెరికన్లకు వైరస్ సోకింది. కోవిడ్ బాధితులకు సాయం చేయడానికి ఇప్పటికే పలు ప్రవాస భారతీయ సంస్థలు రంగంలోకి దిగాయి. స్థానిక యంత్రాంగంతో కలిసి తమ వంతు సాయం అందిస్తున్నాయి. న్యూయార్క్, న్యూజెర్సీలోని మినీ ఇండియాగా పిలిచే ఓక్ ట్రీ రోడ్డులో మృతుల సంఖ్య అత్యధికంగా ఉంది. న్యూయార్క్‌లో 15 మంది, న్యూజెర్సీలో 12 మందికి పైగా, ఫ్లోరిడా, పెన్సిల్వేనియాలో నలుగురు చొప్పున, టెక్సాస్, కాలిఫోర్నియాలో ఒక్కొక్కరు మరణించినట్టు అమెరికాలో స్థానిక అధికారులు వెల్లడించారు. ఇలాంటి పరిస్థితుల్ని గతంలో ఎప్పుడూ చూడలేదని ఓక్ ట్రీ రోడ్డులో వ్యాపారం చేస్తున్న ప్రవాస భారతీయుడు భవేష్ దవే అన్నారు. ప్రాణాలు కోల్పోయిన భారతీయుల్లో సున్నోవా అనలిటికల్ సీఈవో మారేపల్లి హనుమంతరావు, న్యూజెర్సీ పారిశ్రామికవేత్త చంద్రకాంత్ అమిన్(75), మహేంద్ర పటేల్ (60) ఉన్నారు. మరికొందరు భారతీయుల పరిస్థితి విషమంగా ఉండడంతో ప్లాస్మా డోనర్ల కోసం పలు ప్రవాస భారతీయ సంస్థలు ప్రయత్నాలు చేస్తున్నాయి. మరోవైపు న్యూజెర్సీలో ఉంటున్న నీల పాండ్య అనే గుజరాతీ మహిళ తన కుటుంబానికి చెందిన అయిదుగురు కోవిడ్‌తో పోరాడుతున్నారని, బెడ్స్ కొరత కారణంగా వారిలో ఇద్దరినే ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్నారంటూ ఆమె ఒక వీడియోను సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. కోవిడ్‌ని చాలా సీరియస్‌గా తీసుకోవాలని, నిర్లక్ష్యం వద్దంటూ ఆమె పెట్టిన వీడియో భారతీయ సంతతి వారిలో గుబులు రేపుతోంది. మరోవైపు అమెరికా ఒకే రోజు 2,104 మరణాలు నమోదైన తొలి దేశంగా నిలిచింది.



స్పెయిన్‌లోని లెగనెస్ పట్టణ ఆస్పత్రిలో తోటి నర్సు కరోనాతో మృతి చెందడంతో రోదిస్తున్న నర్సులు

**యూకేకి పారాసెటమాల్ మాత్రలు**

యూకేకి తొలి విడతగా 30 లక్షల పారాసెటమాల్ ప్యాకెట్లు ఆదివారం చేరుకోనున్నాయి. కోవిడ్ విజృంభిస్తున్న నేపథ్యంలో మందుల ఎగుమతులపై ఆంక్షల్ని తొలిగించిన భారత ప్రభుత్వం వెంటనే పారాసెటమాల్ ట్యాబ్లట్లను పంపింది.ఈ మందులు ఆదివారానికి చేరుకుంటాయని బ్రిటన్ విదేశాంగ శాఖ అధికారి వెల్లడించారు. కోవిడ్‌తో బాధపడుతున్న బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ ఆరోగ్యం మరింత మెరుగుపడిందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

**చైనాలో మళ్లీ వైరస్ భయం**

కరోనా వైరస్ భయం మళ్లీ చైనాలో మొదలైంది. కరోనా వైరస్ ప్రభావిత దేశాల నుంచి వందలాది మంది చైనీయులు తిరిగి స్వస్థలాలకు చేరుకోవడంతో వారి ద్వారా రెండోసారి వైరస్ విజృంభిస్తుందనే ఆందోళనలో ఉంది. విదేశాల నుంచి వచ్చిన వారి నుంచి సోకిన కేసులు 1,183కి చేరుకోవడంతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తోంది.

**కోవిడ్‌ను జయించిన 93 ఏళ్ల అవ్వ**

టర్కీకి చెందిన 93 ఏళ్ల వయసున్న అల్యే గుండాజ్ కోవిడ్‌ను జయించారు. పది రోజుల పాటు కోవిడ్‌తో పోరాటం చేసిన ఆమె ఆ వ్యాధి నుంచి బయటపడ్డారు. ఇస్తాంబుల్ ఆస్పత్రి నుంచి ఆ వృద్ధురాలిని డిశ్చార్జ్ చేసిన సమయంలో అందరిలోనూ ఈ మహమ్మారిని ఎదుర్కోగలమన్న ఆశాభావం కలిగింది.. వైద్య సిబ్బంది చేసిన కృషికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తాయి.

## నా జీవితంలో అతి పెద్ద నిర్ణయం

కంటికి కనిపించని శత్రువు కోరల్లో చిక్కుకొని విలవిల్లాడుతున్న దేశ ఆర్థిక రంగాన్ని గాడిలో పెట్టడానికి ఆంక్షల్ని ఎత్తి వేయడం పెను సవాల్‌గా మారిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఆ నిర్ణయమే తన జీవితంలో అతి పెద్దదన్న ట్రంప్ దానిని ఎప్పుడు తీసుకుంటారో వెల్లడించలేదు. కోవిడ్ –19 దెబ్బతో అగ్రరాజ్యం సంక్షోభంలో పడిపోయింది. దేశంలోని 33 కోట్ల మందిలో 95 శాతానికి పైగా ఇళ్లకే పరిమితమయ్యారు. కొద్ది వారాల్లోనే 1.7 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయారు.



వైట్ హౌస్‌లో శుక్రవారం ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ ప్రజల్ని ఇల్లు కదలవద్దన్న ఆంక్షల్ని ఎత్తి వేయడమే తాను జీవితంలో తీసుకోబోయే అతి పెద్ద నిర్ణయమని వ్యాఖ్యానించారు. దేశాన్ని ఆర్థికంగా గాడిలో పెట్టాలంటే ప్రజలందరూ మళ్లీ పనుల్లోకి రావాలని, దానికి తగిన సమయం కోసం చూస్తున్నామని అన్నారు. 'దేశ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టడానికి సంబంధించి కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీనికి ఆ దేవుడిపైనే భారం వేశారు. అయితే కచ్చితంగా ఆ నిర్ణయం నేను నా జీవితంలో తీసుకునే అతి పెద్ద నిర్ణయం అవుతుంది'అని ట్రంప్ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

# సాక్షి 24|7 నల్లగొండ

NALGONDA DISTRICT

ఆదివారం । 12 । ఏప్రిల్ । 2020




## కరోనా మీటర్

(11వ తేదీ వరకు)

శనివారం సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేటలో 9, తిరుమలగిరి, నేరేడుచర్లలో ఒక్కో పాజిటివ్ కేసు నమోదైంది.

నల్లగొండలో

| | |
|---|---|
| మీర్‌బాగ్ కాలనీ | 4 |
| బర్కత్‌పుర | 2 |
| మాన్యంచెల్క | 2 |
| రెహమాన్‌బాగ్ | 1 |
| బర్మా దేశస్తులు | 4 |




## న్యూస్‌రీల్

### నేడు 'హలో డీఎంహెచ్‌ఓ'

- ఉదయం 9 గంటలనుంచి 10 గంటల వరకు



సాక్షి మీడియా ఆధ్వర్యంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావుతో నేడు (ఆదివారం) ఫోన్ ఇన్ కార్యక్రమం జరగనుంది. కరోనా వైరస్‌పై మీకున్న అనుమానాలు, వైరస్ వ్యాప్తి నిరోధానికి జిల్లా వైద్యారోగ్యశాఖ తీసుకుంటున్న జాగ్రత్తలు, మీమీ ప్రాంతాల్లో ఎదురవుతున్న సమస్యలు.. వాటి పరిష్కార మార్గాలను ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా తెలుసుకోవచ్చు. 12వ తేదీ సమయం ఉదయం 9గంటల నుంచి 10 గంటల వరకు సెల్‌నంబర్ 99669 21036కు ఫోన్ చేసి మీ అనుమానాలను నివృత్తి చేసుకోవాలి.

### లాక్‌డౌన్ పాటించి కరోనాను కట్టడి చేద్దాం : గుత్తా



కొండమల్లేపల్లి (దేవరకొండ) : లాక్‌డౌన్‌ను పాటించి కరోనాను కట్టడి చేయాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం దేవరకొండ ఆర్య వైశ్య మిత్ర బృందం, దేవరకొండ పట్టణానికి చెందిన కర్నాటి పురుషోత్తం సహకారంతో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో పారిశుద్ధ్య, వలస కార్మికులకు బియ్యం, నిత్యావసర వస్తువులను స్థానిక ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌తో కలిసి అందజేశారు. కరోనా వైరస్‌ని కట్టడి చేసేందుకు ప్రతి ఒక్కరూ భౌతిక దూరం పాటించాలని గుత్తా సూచించారు. బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వాసుచంద్ర, ఎంపీపీ నల్లగాసు జాన్ యాదవ్, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, జెడ్పీటీసీ మారుపాకుల అరుణసురేష్‌గౌడ్, తహసీల్దార్ వెంకటేష్ పాల్గొన్నారు.

### రైస్‌మిల్లు సీజ్

మిర్యాలగూడ : ఐకేపీలనుంచి వచ్చిన ధాన్యం దిగుమతి చేసుకోని సాయి మానస రైస్ మిల్లును ఆర్డీఓ రోహిత్ సింగ్ సీజ్ చేశారు. హన్‌మాన్‌పేటలో గల ఈ మిల్లులో ఐకేపీ నుంచి వచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడం లేదని ఐకేపీ సిబ్బంది కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

### పవర్ కట్ చేస్తారా అంటూ తిట్లదండకం

నల్లగొండ క్రైం : నల్లగొండ జిల్లా కేంద్రంలో రెండు, మూడు రోజులుగా ఉదయం సమయంలో ఇష్టానుసారంగా పవర్ కట్ చేస్తున్నారంటూ.. విద్యుత్ అధికారిని ఓ వ్యక్తి దుర్భాషలాడడం స్థానికంగా కలకలం రేపింది. ఆ ఆడియో క్లిప్ శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. పట్టణంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన టీఎస్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు అంజిరెడ్డి..కరెంటు పోవడంతో విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్ చేశాడు. ఏఈ ఇచ్చిన సమాధానం వినకుండానే.. అంజిరెడ్డి దుర్భాషలాడాడు. తాను టీఆర్ఎస్ అనుబంధ సంఘం నాయకుడిని అనీ.. వారంలోపు నీ ఉద్యోగం ఊడపీకిస్తానని ఫోన్‌లో హెచ్చరించాడు. దీంతో ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది నల్లగొండ టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలు ప్రకారమే కరెంటు సరఫరా నిలిపేసి.. విద్యుత్తు లైన్లకు అడ్డుగా, ప్రమాదంగా ఉన్న చెట్లను నరికివేస్తున్నామని చెబుతున్నా వినలేదని పేర్కొన్నారు. తమ విధులకు ఆటంకం కలిగించేలా ప్రవర్తిస్తూ.. ఫోన్‌లో బూతులు తిట్టి బెదిరించిన అంజిరెడ్డి మీద చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే ఏఈపైన అంజిరెడ్డి కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదులు స్వీకరించి దర్యాప్తు జరుపుతున్నట్లు టూటౌన్ ఎస్ఐ నరసింహులు తెలిపారు.



## మాస్క్ లేకపోతే యమలోకానికే

'మాస్క్ వేసుకోకపోతే భూలోకం నుంచి నేరుగా యమలోకానికే' అంటూ ఓ వ్యక్తి యముడి వేషధారణ వేసి మాస్క్ ధరించని వారిని హెచ్చరించాడు. కరోనా నిర్మూలనకు నల్లగొండ రూరల్ పోలీస్‌లకు సహాయంగా హైదరాబాద్ రోడ్డులోని మర్రిగూడ బైపాస్ వద్ద వాటర్ ప్లాంట్ నడుపుకునే సల్లా సైదులు యముడి వేషధారణతో ప్రజలకు కరోనాపై అవగాహన కల్పించాడు. మాస్కు లేకుండా, అనవసరంగా ఇంటినుంచి బయటికి వస్తే నేరుగా యమలోకానికి తీసుకెళ్తానంటూ వినూత్న ప్రదర్శనతో ఆకర్శించాడు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

## జిల్లాలో క్వారంటైన్ వివరాలు (శనివారం సాయంత్రం వరకు)

| కేంద్రం | క్వారంటైన్‌లో.. | డిశ్చార్జ్ |
|---|---|---|
| మిర్యాలగూడ | 00 | 00 |
| నల్లగొండ | 07 | 00 |
| నకిరేకల్ | 00 | 00 |

### క్వారంటైన్ సెంటర్లు, ఇన్‌చార్జ్ సెల్ నంబర్

| | | | |
|---|---|---|---|
| నల్లగొండ | ఎంజీయూ | రాజ్‌కుమార్ | 7780696154 |
| మిర్యాలగూడ | తుంగపాడు మోడల్ స్కూల్ | కేసా రవి | 9246349881 |
| నకిరేకల్ | ప్రభుత్వ వైద్యశాల | డాక్టర్ శ్రీనాథ్ | 8142292229 |

### కూరగాయలు, నిత్యావసరాల సరఫరా

జిల్లాలోని మిర్యాలగూడలో మొబైల్ రైతు బజార్లు 10 ఉన్నాయి. ఎన్ఎస్పీ క్యాంపు వద్ద రైతు బజార్ ఉంది. నల్లగొండ, దేవరకొండలలో మీ కోసం యాప్ ద్వారా నిత్యావసరాలను డోర్ డెలివరీ చేయనున్నారు. ఎన్జీ కాలేజ్, ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, ప్రతిక్ జూనియర్ కాలేజ్, బాలికల జూనియర్ కాలేజీల్లో కూరగాయల మార్కెట్‌లు ఏర్పాటు చేశారు.

అధిక ధరకు విక్రయిస్తే ఫిర్యాదు చేయాల్సిన నంబర్లు — మిర్యాలగూడ : 7330733557, 7330733558; టోల్‌ఫ్రీ నంబర్ : 18004251442

మీకోసం యాప్ అడ్రస్ :(https://covid-19.egovindia.in/nalgonda)

# నాటు.. పల్లెల రూటు!

ఐదురోజుల కిందట త్రిపురారం మండలం లోక్యాతండాలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని తయారీదారులపై కేసులు నమోదు చేశారు.

ఇటీవల కాలంలో దేవరకొండ, డిండి మండల కేంద్రాలతో పాటు తాజాగా దేవరకొండ మండలం గొట్టిముక్కల, డిండి మండలం పడమటితండాలో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి 1,680 కిలోల తెల్లబెల్లం, 90కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు

చండూరు మున్సిపాలిటీ కేంద్రంలో రెండు కిరాణ దుకాణాలపై శనివారం దాడి చేసిన ఎక్సైజ్ అధికారులు బెల్లం సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో పూర్తిగా ఆగిపోయిన నాటు సారా తయారీ.. ఇప్పుడు లాక్‌డౌన్ సమయంలో మళ్లీ ఊపిరి పోసుకుని ఇలా జడలు విప్పుతోంది. ఇందుకు మారుమూల గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాలు కేంద్రాలయ్యాయి. ఇక్కడ తయారవుతున్న నాటుసారాను అడ్డుకునేందుకు ఆబ్కారీ శాఖ ప్రయత్నాలు మొదలు పెట్టింది.

- జడలు విప్పుతున్న.. గుడుంబా
- లాక్‌డౌన్‌తో మూతపడిన మద్యం దుకాణాలు
- మందుప్రియుల అవసరాలు తీర్చేందుకు గుడుంబా తయారీ
- జిల్లాలో ప్రాథమికంగా 200 లీటర్ల సారా సీజ్, ఏడుగురిపై కేసుల నమోదు
- 2,100 కేజీల బెల్లం, 90 కేజీల పటిక స్వాధీనం



దేవరకొండ నియోజకవర్గంలో పట్టుబడిన తెల్లబెల్లం కాటన్లు

సాక్షిప్రతినిధి, నల్లగొండ : కరోనా లాక్‌డౌన్ కొందరు నాటుసారా తయారీదారులకు బాగా కలిసి వస్తోంది. జిల్లావ్యాప్తంగా అన్ని మద్యం దుకాణాలు మూతపడ్డాయి. అక్కడక్కడా వైన్ షాపులను రాత్రివేళ తెరిచి అందుబాటులో ఉన్న మద్యం మొత్తాన్ని చాటుమాటుగా విక్రయించారు. గ్రామాల్లోని బెల్టషాపుల్లో ఉన్న మద్యం నిల్వలు కూడా కరిగిపోయాయి. ఈ పరిస్థితుల్లో మద్యానికి డిమాండ్ పెరగడం, దొంగచాటుగా విక్రయిస్తున్న వారిపై ఎక్సైజ్, పోలీస్‌శాఖలు విరుచుకుపడి అరెస్టులు చేయడం, మద్యాన్ని సీజ్ చేయడంతో గుడుంబా తయారీదారులకు రెక్కలు వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో నాటు సారా లీటరు రూ.వెయ్యిదాకా పలుకుతోందని చెబుతున్నారు. లిక్కర్‌కు దీటుగా ఉన్న ఈ రేట్లను గమనిస్తే.. మద్యానికి ఉన్న డిమాండ్ ఇట్టే తెలిసిపోతోంది.

దేవరకొండ : నియోజకవర్గం పరిధిలోని పలు తండాలు, గ్రామాల్లో కొంత మంది నాటుసారా తయారీపై దృష్టి సారించారు. డిండి మండల పరిధిలోని ఎడ్లగడ్డతండా, వీరబోయినపల్లి తండా, పెద్దతండా, బొగ్గులదొన తండా, ప్రతాప్‌నగర్, కుందేలుబాయి తండా, పడమటితండా, చింతపల్లి మండల పరిధిలోని వింజమూరు, జర్పుల తండా, కొక్కిరాల, గౌరారం, ఉమ్మడి చందంపేట మండల పరిధిలోని పలు తండాల్లో నాటుసారా విచ్చల విడిగా తయారు చేస్తున్నారు. దేవరకొండ మండల పరిధిలోని పద్మట్‌పల్లి తండా, మేగ్యతండా, పాత్లావత్ తండాలతో పాటు పలు గ్రామాల్లో నాటుసారా తయారీ జోరందుకుంది. గడిచిన 20రోజుల్లో 8కేసులు నమోదు చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

హాలియా : నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని త్రిపురారం, నిడమనూరు మండలాల్లో నాటుసారా యథేచ్ఛగా తయారీ, విక్రయాలు జోరందుకున్నాయి. లాక్‌డౌన్ నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు నియోజకవర్గంలోని మద్యం దుకాణాలకు సీల్ వేయడం వల్ల నాటుసారా తయారీ దారులకు అవకాశం కలిసోచ్చింది. త్రిపురారం మండలంలోని లోక్యాతండా, అప్పలమ్మగూడెం, డొంకతండా, పలుగుతండా, కాపువారిగూడెం, మాటూరు, చౌళ్ళతండ, నిడమనూరు మండలంలోని మేగ్యాతండా, తిరుమలగిరి మండలంలోని డొక్కలబావితండా తదితర గ్రామాల్లో నాటు సారాను తయారు చేస్తున్నారు.

సంస్థాన్ నారాయణపురం : మునుగోడు నియోజకవర్గం పరిధిలో మర్రిగూడ మండలం అంతంపేట, బీమ్లతండా, అజ్జలపురం, భీమనపల్లితండాలలో గుడుంబా తయారు చేస్తున్నారు. తినడానికి వినియోగించే తెల్ల బెల్లాన్ని తీసుకు వస్తుండడంతో ఎక్సైజ్ ఆధికారులు అడ్డ చెప్పడం లేదు. చింతపల్లి మండలం మాల్, రంగారెడ్డి జిల్లాలో పలు ప్రాంతాలనుంచి తెల్ల బెల్లం తీసుకొచ్చి గుడుంబా తయారు చేస్తున్నారు. చండూరు మండలంలో గట్టుప్పల్, తేరట్‌పల్లి గ్రామాలకు సంస్థాన్ నారాయణపురం మండలం వావిళ్ళపల్లి, చిల్లాపురం రెవెన్యూ గ్రామా పరిధిలోని తండాల నుంచి గిరిజనులు గుడుంబా విక్రయిస్తున్నారు.

మిర్యాలగూడ : నియోజకవర్గంలో గుడుంబా విక్రయాలు పెరిగాయి. మిర్యాలగూడ, అడవిదేవులపల్లి మండలాల పరిధిలోని పలు తండాలలో సారాయి తయారు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల మిర్యాలగూడ మండలంలోని రాఘవాపురం తండాలో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి ఏడు లీటర్ల సారాయిని పట్టుకొని ముగ్గురిని అరెస్టు చేశారు. అడవిదేవులపల్లి మండలంలోని గోన్యాతండాలో అయిదు లీటర్ల సారాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు.

### తినే బెల్లంతోనే సారా తయారీ : శంకరయ్య, ఎక్సైజ్ ఎస్ఈ

నాటుసారా తయారీలో వినియోగించే నల్లబెల్లంపై నిషేధం ఉండడంతో తినడానికి ఉపయోగించే తెల్ల బెల్లాన్నే గుడుంబా తయారీకి వాడుతున్నారు. పటికను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని హైదరాబాద్ నుంచి తెప్పించుకుంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం దేవరకొండ ప్రాంతంలోనే అత్యధికంగా నాటు సారా తయారు చేస్తున్నారు. మర్రిగూడ, నాంపల్లి మండలాలు, మిర్యాలగూడ సమీప గిరిజన ప్రాంతాల్లో నాటు సారా తయారీ మొదలైనట్లు గుర్తించాం. ఇప్పటికే ఏడుగురిని అరెస్టు చేశాం.

## ఏడుగురిపై కేసు..

కొండమల్లేపల్లి (దేవరకొండ) : దేవరకొండ, డిండి మండలాల పరిధిలో రెండు చోట్ల ఎక్సైజ్ అధికారులు జరిపిన దాడుల్లో బెల్లం పటికను స్వాధీనం చేసుకున్నారు. దేవరకొండ ఎక్సైజ్ సీఐ వెంకటేశ్ శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివవరాలు వెల్లడించారు. డిండి మండలం చెర్కుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల పడమటితండాకు చెందిన రమేశ్, లచ్చిరాంలు శుక్రవారం జస్ట్ డయల్ అనే యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో టాటా ఏస్ వాహనాన్ని బుక్ చేసుకొని హైదరాబాద్‌నుంచి 480 కేజీల బెల్లం, 60 కేజీల పటికను కొనుగోలు చేసి పడమటితండాకు తరలించారు. ఎక్సైజ్ అధికారులు శుక్రవారం చెర్కుపల్లి వద్ద రూట్ వాచ్ నిర్వహిస్తుండగా ఖాళీగా వస్తున్న టాటా ఏస్ వాహనాన్ని ఆపి వాహన డ్రైవర్ అహ్మద్‌ను అధికారులు విచారించారు. బెల్లంతోపాటు పట్టిక రవాణా విషయం తెలిసింది. అధికారులు తండాలో దాడులు నిర్వహించి 480 కేజీల బెల్లం, 60 కేజీల పటికను స్వాధీనం చేసుకున్నారు. శనివారం దేవరకొండ మండల పరిధిలోని గొట్టిముక్కల గ్రామంలో ఓ షాపు వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 1,200 కిలోల బెల్లంతోపాటు మరో 30 కేజీల పటికను అధికారులు పట్టుకున్నారు. కాగా, టాటా ఏస్ వాహన డ్రైవర్ అహ్మద్‌తోపాటు రమేశ్, లచ్చిరాం, కల్యాణ్, చందు, జయమ్మ, రవినాయక్‌లపై కేసు నమోదు చేయగా ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. సమావేశంలో దేవరకొండ ట్రైనీ ఎక్సైజ్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది తదితరులున్నారు.

**బెల్లం వ్యాపారులపై..**

చండూరు : చండూరులో సారా తయారికీ వాడే బెల్లం విక్రయిస్తున్న రెండు కిరాణ షాపుల్లో శనివారం ఎక్సైజ్ చండూరు, నాంపల్లి సీఐలు చంద్రభానునాయక్, మాధవయ్యలు తనిఖీలు నిర్వహించి బెల్లాన్ని స్వాధీనం చేసుకుని యజమానులపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో 230కిలోల బెల్లాన్ని సీజ్ చేశారు. సాయిరాం కిరాణం షాపులో 97 కిలోలు, గురు రాఘవేంద్ర షాపులో 133 కిలోల బెల్లం లభ్యమైనట్లు తెలిపారు.



దేవరకొండ : నిందితులతో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

## 'పేట'లో ఒకేరోజు 11 పాజిటివ్

- సూర్యాపేటలో 9, తిరుమలగిరి, నేరేడుచర్లలో ఒక్కో కేసు నమోదు

సాక్షిప్రతినిధి, సూర్యాపేట : సూర్యాపేట జిల్లాలో శనివారం ఒక్కరోజే 11 పాజిటివ్ కేసులు బయటపడ్డాయి. దీంతో జిల్లా ప్రజల్లో భయాందోళన నెలకొంది. సూర్యాపేట పట్టణంలో 9, తిరుమలగిరి, నేరేడుచర్లలో ఒక్కో కేసు నమోదైంది. మర్కజ్ మత ప్రార్థనలకు వెళ్లి వచ్చిన వారితో ప్రైమరీ, సెకండరీ కాంటాక్టులకు వైరస్ అంటుకోవడంతో జిల్లావాసులు వణికిపోతున్నారు. సూర్యాపేట మున్సిపాలిటీతోపాటు జిల్లాలోని నాగారం, తిరుమలగిరి, నేరేడుచర్ల మండలాలకు వైరస్ వ్యాప్తి చెందడంతో.. అధికారులు హై అలర్ట్ అయ్యారు. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 20 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

**ఆ కేసు తేలింది..**

ఈ నెల 8న సూర్యాపేట పట్టణంలోని కొత్తగూడెం బజార్‌కు చెందిన ఒకరికి కరోనా పాజిటివ్ వచ్చినట్లు పరీక్షల్లో తేలింది. కరోనా లక్షణాలు ఉండడంతో తానే స్వయంగా జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి వెళ్లాడు. పరీక్షల్లో అతనికి పాజిటివ్ వచ్చినట్లు తెలిసింది. ఇతను పాజిటివ్ వచ్చిన వ్యక్తిని ఎవరిని కాంటాక్టు అయ్యాడన్న సమాచారం తొలుత తేలలేదు. ఇతని ద్వారా తన కూతురుకు కూడా శనివారం పాజిటివ్ వచ్చింది. కుడకుడ వ్యక్తినుంచి వర్ధమానుకోటలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురికి వైరస్ సోకితే, కొత్తగూడెం బజార్‌లో మాత్రం ఒకే కుటుంబానికి చెందిన తండ్రి, కూతుళ్లు వైరస్ బారినపడ్డారు. ఇతనినుంచే పాత మార్కెట్ పరిధిలోని 8 మందికి కరోనా సోకినట్లు శనివారం రాత్రి 11 గంటలకు అధికారులు ప్రకటించారు.

**డిశ్చార్జ్ అయ్యి.. మళ్లీ పాజిటివ్..**

మూడు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ క్వారంటైన్లనుంచి కొంతమందిని డిశ్చార్జ్ చేశారు. ఇలా చేసిన వారికి చివరలో పరీక్షలు చేయగా అందరికీ నెగెటివ్ రాగా, నేరేడుచర్లకు చెందిన వ్యక్తికి మాత్రం పాజిటివ్ వచ్చింది. గత నెల చివరలో సదరు వ్యక్తి మర్కజ్‌కు వెళ్లి వచ్చాడు. అదేవిధంగా కుడకుడకు చెందిన వ్యక్తి మర్కజ్ వెళ్లి వస్తూ గత నెల తిరుమలగిరిలో ప్రార్థన మందిరంలో బస చేశాడు. మసీదులో అతనితో ఉన్న వ్యక్తికి తాజాగా పాజిటివ్ అని తేలింది.

## ఉద్యోగుల సేవలు మరువలేనివి : ఉత్తమ్



మున్సిపల్ సిబ్బందిపై పూలు చల్లుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : కరోనా వైరస్‌ను నిర్మూలించడానికి విశేష కృషి చేస్తున్న వైద్యులు, పోలీసులు, పారిశుద్ధ్య తదితర ఉద్యోగుల సేవలు మరువలేనివని టీ.పీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నల్లగొండలోని మున్సిపాలిటీ కార్యాలయంలో కార్మికులను సన్మానించి కూరగాయలు అందజేశారు. అదే విధంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ, పలువురు వైద్య సిబ్బందిని సన్మానించారు. అనంతరం అక్కచెల్మ, పానగల్ లెప్రసీ కాలనీలో పేదలకు కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాక్‌డౌన్ సమయంలో పేద ప్రజలు, వలస కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వారిన్ని ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ సాయం పూర్తిస్థాయిలో పేద ప్రజలకు అందడం లేదన్నారు. అదే విధంగా ఇటీవల మృతి చెందిన కౌన్సిలర్ దుబ్బ కాంతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దుబ్బాక నర్సింహారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొంత వెంకటయ్య, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, దుబ్బ మధు, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

**చాలామందికి అందని ప్రభుత్వ సాయం**

లాక్‌డౌన్ నేపథ్యంలో రేషన్‌కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం 12 కేజీల బియ్యం, రూ.1500 ఇస్తానగా, కేంద్రం కూడా 5 కేజీల చొప్పున బియ్యం ఇస్తానని చెప్పిందని, అవి రెండు చాలామందికి అందని పరిస్థితి ఉందని టీపీసీసీ చీఫ్ ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కరోనా పరీక్షల్లో జాప్యాన్ని నివారించాలంటే ఐసీఎంఆర్ అనుమతి ఉన్న ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ పరీక్షలు చేసే విధంగా అనుమతి ఇవ్వాలని కోరారు.

# గ్రామీణులకు ఉచితంగా మాస్కులు

నల్లగొండ : కరోనా వైరస్ వ్యాప్తి నిరోధానికి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా గ్రామీణులకు ఉచితంగా మాస్కులు ఇవ్వనున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కుటుంబాలను లెక్కించి ప్రతి ఒక్కరికీ మాస్కులు అందజేస్తారు. వీటిని మహిళా సంఘాలతో తయారు చేయించి కొనుగోలు చేయాలని పంచాయతీలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం పంచాయతీ నిధులను వెచ్చించాలని సూచించారు.

**కరోనానుంచి ప్రజలను కాపాడేందుకు ...**

జిల్లాలో 844 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో దాదాపు 13లక్షల పైచిలుకు జనాభా ఉంది. ప్రస్తుతం ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా జిల్లాలోని ప్రజలను ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఇప్పటికే జిల్లాలో 16 కేసులు నమోదు కాగా, అందులో 12 కేసులు జిల్లాకు చెందిన వ్యక్తులు ఉన్నారు. బర్మా దేశంనుంచి వచ్చిన మరో నలుగురికి సోకిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంతో జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే గ్రామీణ ప్రాంతప్రజలకు ఉచితంగా మాస్కులు అందించాలని ఆదేశించింది.

- గ్రామ పంచాయతీ నిధులనుంచి కొనుగోలు చేసి ఇవ్వాలి
- 15లోగా అందజేయాలని కలెక్టర్ ఆదేశం
- మహిళా సంఘాలు తయారు చేసి గ్రామంలోనే విక్రయించాలి
- ఇప్పటికే 47వేల వరకు మాస్కుల తయారీ



మాస్కులు కుడుతున్న మహిళా సంఘం సభ్యులు

**పంచాయతీ నిధులనుంచే కొనుగోలు**

పంచాయతీ నిధులనుంచి అవసరమైన మాస్కులు అన్నింటినీ కొనుగోలు చేసి ప్రజలకు ఉచితంగా అందించాలని కలెక్టర్ ఇప్పటికే జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డీపీఓ కూడా అన్ని పంచాయతీలకు మార్గదర్శకాలు జారీ చేశారు.

**మహిళా సంఘాలనుంచే కొనుగోలు చేయాలి**

డీఆర్‌డీఏ పరిధిలోని స్వయం సహాయక మహిళ సంఘాలనుంచే మాస్కులు కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో మాస్కుల తయారీలో ఆలస్యం అవుతుండడంతో ఇప్పటికే అన్ని గ్రామాల్లోని మహిళ సంఘాలు మాస్కులు తయారు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓకు సూచించారు. దీంతో ఆయన 4 రోజులనుంచి కుట్టిస్తున్నారు. ఇప్పటికే 47వేల వరకు మాస్కులు తయారు చేశారు. ఈ నెల 15వ తేదీలోపే అన్ని గ్రామాల్లోని ప్రజలకు అవసరమైన మాస్కులను తయారు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో మాస్కును రూ.15 చొప్పున కొనుగోలు చేయనున్నారు. 15వ తేదీ తర్వాత గ్రామాల్లో మాస్కులు లేకుండా బయటికి వస్తే చర్యలు తీసుకోనున్నారు.

### నిధుల కొరత లేదు

కరోనా వ్యాప్తి నిరోధానికి గ్రామీణ ప్రజలకు ఉచితంగా మాస్కులు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ నిధులనుంచి ఒక్కోటి రూ.15 చొప్పున కొనుగోలు చేయాలి. ప్రతినెలా పంచాయతీలకు వచ్చే నిధుల్లో భాగంగా ఈసారి కూడా రూ.19కోట్లు వచ్చాయి. నిధుల కొరత లేదు. అన్ని పంచాయతీలు కొనుగోలు చేసి ఇస్తారు. 15 తర్వాత మాస్కులు లేకుండా ఏ ఒక్కరూ బయటికి రావడానికి వీలులేదు.

– డీపీఓ, విష్ణువర్ధన్‌రెడ్డి

## బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే కృషి : కలెక్టర్



నల్లగొండ : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే ఎనలేని కృషి చేశారని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. శనివారం మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా నల్లగొండ గడియారం సెంటర్‌లోని పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు ఉండాలని కోరిన మహానుభావుడు పూలే అని కొనియాడారు. సమాజంలో పురుషులతో సమానంగా స్త్రీలకు సమాన హక్కులు ఉండాలని పోరాటం చేసిన వ్యక్తి అని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి గాలి అనసూర్య, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

epaper.sakshi.com

# సాక్షి హాయ్... మీరేం చేస్తున్నారు?

**సాక్షితో పంచుకోండి...**

మీ విశేషాలు పంపాల్సిన వాట్సప్ నంబర్ : 9963823329

మెయిల్ ఐడీ: nalgondasakshidesk@gmail.com

పిల్లల ఇండోర్ గేమ్స్, పెద్దవాళ్ల కబుర్లు, హోమ్ మేడ్ ఫుడ్, హౌస్ ఫుల్ టైమ్.. మన కోసం.. మన చేత.. మన వల్ల అన్నట్లుగా మారేందుకు వచ్చిన అరుదైన అవకాశం లాక్‌డౌన్. ఈ సమయంలో యాక్టివిటీస్ డౌన్ కావడంతో అనుబంధాలు ఆన్ అవుతున్నాయి. వంటలు చేసే మగవాళ్లు, ఆడవాళ్లు, పిల్లలతో కలిసి ఆటలాడుతున్న పెద్దవాళ్లు, ఇలాంటి అరుదైన, అపురూపమైన దృశ్యాలు ఆవిష్కృతమవుతున్నాయి. మరి మీరేం చేస్తున్నారు? మీ ఇంట్లో ఎంత ఫన్ సృష్టిస్తున్నారు? నేడు ఎలా సందడి చేస్తున్నారు? రేపటికి ఎలా ప్రిపేర్ అవుతున్నారు? తదితర ఆసక్తికర విషయాలు 'సాక్షి'తో పంచుకోండి... గృహమే కదా స్వర్గసీమ అనే స్ఫూర్తిని అందరితోనూ పంచుకోండి. ఆయా అంశాలను మేము ప్రచురిస్తాం.






నల్లగొండలో దాగుడుమూతలు ఆడుతున్న చిన్నారులు, డ్రాయింగ్ వేస్తూ..


పానగల్లులో పచ్చీసు ఆడుతున్న మహిళలు


సూర్యాపేటలో వైకుంఠపాళి ఆడుతూ...


మిర్యాలగూడలో వైకుంఠపాళి ఆడుతున్న కుటుంబ సభ్యులు


మిర్యాలగూడలో చదువుకుంటున్న చిన్నారులు


మునగాలలో బొమ్మలు అంటిస్తున్న చిన్నారి


నకిరేకల్‌లో ధ్యానం చేస్తూ...


నల్లగొండలో బొమ్మలతో....


నల్లగొండలో క్యారం ఆడుతూ...



సూర్యాపేట, తుంగతుర్తిలో అష్టాచెమ్మా ఆడుతున్న చిన్నారులు


నారాయణపురంలో ప్రాజెక్టు వర్క్ చేస్తున్న విద్యార్థులు


నిడమనూరులో చెస్ ఆడుతూ..


తిరుమలగిరిలో క్యారం ఆడుతున్న కుటుంబ సభ్యులు


నల్లగొండలో క్యారం ఆడుతూ...


నల్లగొండలో చదువుకుంటున్న బాలికలు


నల్లగొండలో చిన్నారితో సరదాగా...

## సందడే సందడి..!

లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజలంతా ఇళ్ల వద్దే ఉంటుండడంతో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ప్రతిఇంట్లో ఎన్నో అపురూప దృశ్యాలు ఆవిష్కృతమవుతున్నాయి. ఈ దృశ్యాలను పలువురు 'సాక్షి హాయ్ మీరేం చేస్తున్నారు'తో పంచుకున్నారు.


నల్లగొండ శివాజీనగర్‌లో...

## బత్తాయిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

**హాలియా :** జిల్లాలో సాగు చేసిన బత్తాయి దిగుబడిని రైతుల వద్ద నుంచి టన్నుకు రూ.25వేల చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బత్తాయి రైతులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో బత్తాయి రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు జిల్లా ఉద్యానవన అధికారి సంగీత లక్ష్మీ, హలీం హాజరయ్యారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు గడ్డంపల్లి రవీందర్‌రెడ్డి, కున్‌రెడ్డి నాగిరెడ్డి, వాసుదేవుల సత్యనారాయణరెడ్డి, రాయపురెడ్డి, వడ్లపల్లి వెంకటేశ్వర రెడ్డి, చామకూరి లింగారెడ్డి, యాదగిరిరెడ్డి, చారి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా సీఎం కేసీఆర్

**నల్లగొండ రూరల్ :** పేదలకు అండగా సీఎం కేసీఆర్ ఉన్నారని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం తన నివాసంలో 37 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డితో కలిసి అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్, కనగల్ జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం, కౌన్సిలర్లు, నాయకులు సహదేవరెడ్డి, దేప వెంకట్‌రెడ్డి, యాదయ్య, శ్రీనివాస్, ఆలకుంట్ల రాజేశ్వరీ, బకరం వెంకన్న, గోవర్ధన్, సుధాకర్ పాల్గొన్నారు.

## హైపోక్లోరైడ్ ద్రావణం పిచికారీ

**మిర్యాలగూడ :** కరోనా వైరస్ వ్యాప్తి నివారణలో భాగంగా రెడ్‌జోన్‌గా ప్రకటించిన సీతారాంపురంలో శనివారం డ్రోన్ ద్వారా సోడియం హైపోక్లోరైడ్ ద్రావణాన్ని మున్సిపల్ సిబ్బంది పిచికారీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ మాట్లాడుతూ సీతారాంపురంలో కరోనా పాజిటివ్ కేసు నమోదు కావడంతో ఆ ప్రాంతంలో డ్రోన్ ద్వారా నివారణ ద్రావకాన్ని పిచికారి చేస్తున్నట్లు తెలిపారు.

**అడవిదేవులపల్లి :** మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. శనివారం కరోనా వైరస్ నేపథ్యంలో బ్లీచింగ్‌చల్లారు. పలు చోట్ల మందును స్ప్రేచేశారు.

## అక్రమకట్టడాల తొలగింపు

**నాగార్జునసాగర్ :** అమ్రాబాద్ అటవీప్రాంతంలో నాగార్జునసాగర్– హైదరాబాద్–హాలియా మూడు రోడ్ల కూడలి వద్ద రహదారివెంట ఉన్న సమ్మక్కసారమ్మ దగ్గర నిర్మించిన అక్రమకట్టడాలను అటవీ శాఖ అధికారులు శనివారం సాయంత్రం తొలగించారు.

# కొనసాగుతున్న దాతల సహకారం

**నల్లగొండటూటౌన్ :** నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వస్తున్న రోగుల సహాయకులకు బీజేపీ ఆధ్వర్యంలో శనివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొని దాతలను అభినందించారు. పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో స్థానిక కౌన్సిలర్ మారగోని నవీన్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బోయవాడలో ప్రభుత్వ డ్రైవర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

**నల్లగొండరూరల్ :** చందనపల్లి గ్రామంలో శనివారం గ్రామసర్పంచ్ సురిగి మనెమ్మరమేష్ ప్రతి ఇంటికి కూరగాయలు పంపిణీ చేశారు. వెలుగుపల్లి రైతులు పోలీసులకు బత్తాయి కాయలను పంపిణీ చేశారు. పోలీసులకు పీపీఈ కిట్లను గ్రేటర్ ఎన్ఆర్ఐ ఫోరం నుంచి అందజేశారు.

**నకిరేకల్ :** మండలంలోని సాయి దేవాలయ గౌరవ అధ్యక్షుడు కాసం లింగయ్య ఆధ్వర్యంలో పోలీసులు, జర్నలిస్టులకు, ప్రభుత్వాస్పత్రిలో సిబ్బందికి శనివారం అన్నదానం చేశారు.

**నార్కట్‌పల్లి(నకిరేకల్) :** మండలంలోని అమ్మనబోలు గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటాపురం, పెరమల్లబావి, అమ్మనబోలు గ్రామాల్లో ఉన్న బీద కుటుంబాలకు అమ్మనబోలు గ్రామ యువకుల సహకారంతో నిత్యావసర సరుకులను శనివారం అందజేశారు. నార్కట్‌పల్లిలో కొనసాగుతున్న అనాథ బాలుర, మానసిక వికలాంగుల పునరావాస కేంద్రానికి శ్రీసాయి మొబైల్ యజమాని బి. సంతోష్ 50 కేజీల బియ్యం అందజేశారు.

**కేతేపల్లి(నకిరేకల్) :** మండలంలోని ఇనుపాముల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న హమాలీలకు స్థానిక ఎంపీటీసీ బొజ్జ సుందర్ ఆధ్వర్యంలో మాస్కులు అందజేశారు.

**చిట్యాల :** లాక్‌డౌన్ నేపథ్యంలో చిట్యాలలో పోలీసు సిబ్బందికి మున్సిపాలిటీ ఐదో వార్డు కౌన్సిలర్ జడల పూలమ్మ మధ్యాహ్న భోజనాన్ని అందజేశారు. తొమ్మిదో వార్డులో కౌన్సిలర్ బెల్లి సత్తయ్య ఇంటింటికీ కూరగాయాలు అందజేశారు. శ్రీకనక దుర్గా ఆలయ చైర్మన్ వేలుపల్లి మధుకుమార్ పారిశుద్ధ్య సిబ్బందికి అన్నదానం చేశారు. వాసవీ లెజెండ్ క్లబ్ సభ్యులు ఇమ్మడి కృష్ణమూర్తి ఆర్థిక సహకారంతో కూరగాయాలు, నిత్యావసర వస్తువులను సుందరయ్యనగర్‌లో క్లబ్ అధ్యక్షుడు శీలా సత్యనారాయణ ఆధ్వర్యంలో అందజేశారు. లలితా పౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు ఆహారాన్ని అందజేశారు. కరోనా వైరస్ నివారణకు మండలంలోని ఎలికట్టె గ్రామానికి చెందిన సాగర్ల నర్సింహయాదవ్ సర్పంచ్ సత్తయ్య గౌడ్, ఎంపీటీసీ గొలనుకొండ దశరథలతో కలిసి గ్రామస్తులకు మాస్కులు అందజేశారు.

**కట్టంగూర్ :** కట్టంగూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ జీకే ప్రసాద్, సిబ్బందికి శనివారం సర్పంచ్ చెనగోని సతీష్, ఉపసర్పంచ్ అంతటి శ్రీను శానిటైజర్లు అందజేశారు.

**శాలిగౌరారం :** మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలోని హమాలీలకు మాస్కులను శనివారం బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షుడు జమ్ము రమేశ్ అందజేశారు. మండలంలోని వల్లాల జెడ్పీహెచ్‌ఎస్‌లకు చెందిన 2006–07 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు లాక్‌డౌన్‌లో విధులు నిర్వహిస్తున్నపోలీసులకు పండ్లు, తాగునీటిని అందజేశారు. నకిరేకల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో తాటికల్‌లో వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేశారు.

**మిర్యాలగూడటౌన్ :** పట్టణంలోని 43వ వార్డు సీతారాంపురంలో శేఖర్–మయూరిల కుమార్తె మిషిత పుట్టిన రోజు సందర్భంగా 30 కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులను మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ చేతుల మీదుగా చిన్నారి కుటుంబ సభ్యులు పంపిణీ చేశారు.

**మిర్యాలగూడ :** మాజీ కౌన్సిలర్ దండ శ్రీనివాస్‌రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా స్థానిక హౌజింగ్‌బోర్డు కాలనీలోని శ్రీనివాస్‌రెడ్డి విగ్రహానికి కుటుంబసభ్యులతో కలిసి డీసీసీ అధ్యక్షులు శంకర్‌నాయక్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు, మున్సిపల్ కార్మికులకు నిత్యావసర వస్తువులు, బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు.

**తాళ్లగడ్డలో..**

తాళ్లగడ్డలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ నిత్యావసర సరకులను 70 మంది కూలీల కుటుంబాలకు నిత్యావసర సరకులను శనివారం అందజేశారు.

**వేములపల్లి :** లాక్‌డౌన్ కారణంగా వృత్తి, ఉపాధి కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న మండలంలోని మొల్కపట్నం గ్రామంలో 350 మంది కుటుంబాలకు బియ్యం, 800 కుటుంబాలకు కూరగాయలు, ప్రతిఇంటికి మాస్కలను మాజీ ఎంపీపీ నామిరెడ్డి రవీనాతో కలిసి సర్పంచ్ నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి శనివారం పంపిణీ చేశారు.


నల్లగొండ : హౌజింగ్‌బోర్డు కాలనీలో అన్నదానం చేస్తున్న కౌన్సిలర్ నవీన్‌గౌడ్

**వేములపల్లి(మాడ్గులపల్లి) :** మాడ్గులపల్లి మండలంలోని చిరుమర్తి గ్రామ సమీపంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు, హమాలీలకు, ఐకేపీ నిర్వాహకులకు మాస్కులను ఆ గ్రామ చిరుమర్తి సర్పంచ్ శ్రీశైలం శనివారం అందజేశారు.

**దామరచర్ల :** దామరచర్ల మండల కేంద్రంలో పారిశుధ్య కార్మికులకు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం శానిటైజర్లు, మాస్కులు అందజేశారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వీరికి భోజనం ఏర్పాట్లు చేశారు.

**హాలియా(నాగార్జునసాగర్) :** పట్టణంలోని ఐదో వార్డులో పేద కుటుంబాలకు, ఒంటరిమహిళలు, వృద్ధులు, రేషన్‌కార్డులేని నిరుపేద కుటుంబాలకు సీకే యూత్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను , ఒక్కొక్కరికి రూ.100లను టీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మలిగిరెడ్డి లింగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్‌లు అందజేశారు.

**త్రిపురారం :** కరోనా వైరస్ నివారణకు ప్రతిఒక్కరూ మాస్కులు ధరించాలని ఎస్ఐ రాంమూర్తి సూచించారు. శనివారం మండలంలోని దుగ్గెపల్లిలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు, హమాలీలకు డాక్టర్ రెడ్డీస్ పౌండేషన్ సహకారంతో మాస్కులు పంపిణీ చేశారు.

**మునుగోడు :** విధులు నిర్వహిస్తున్న పోలీసులకు, కార్మికులకు శనివారం జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మునుగోడు మండల బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

**నాంపల్లి :** కరోనా వైరస్ నియంత్రనకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంలో కాంగ్రెస్ నాయకులు మండలంలో పారిశుద్ధ్య కార్మికులకు, పోలీస్, వైద్యసిబ్బందికి శానిటైజర్లు, మాస్కులు పంపిణీ చేశారు.

**చింతపల్లి(దేవరకొండ) :** మండల కేంద్రంలోని ఆదర్శ వృద్ధాశ్రమంలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో వృద్ధులకు నిత్యావసర సరుకులను మాజీ ఎమ్మెల్యే బాలునాయక్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

**కొండమల్లేపల్లి :** ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీ పిలుపు మేరకు శనివారం దేవరకొండలోని జంగాల కాలనీకి చెందిన సుమారు 300 కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బియ్యం, కూరగాయలను మాజీ ఎమ్మెల్యే బాలునాయక్ అందజేశారు.

**పెద్దఅడిశర్లపల్లి(దేవరకొండ) :** మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద విధులు నిర్వహిస్తున్న గుడిపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బందికి అజ్మాపురం ఎంపీటీసీ గుండాల నాగమణిశ్రీనివాస్‌యాదవ్ మాస్కులు, పండ్లు అందజేశారు. మండలంలోని కోదండాపురంలో కొండలన్న యువసేన ఆధ్వర్యంలో శనివారం హెచ్‌ఎండబ్ల్యూఎస్ కార్మికులకు నిత్యావసర వస్తువులను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముచ్చర్ల ఏడుకొండల్‌యాదవ్, ఎస్ఐ గోపాల్‌రావు అందజేశారు.

**డిండి :** మండల పరిధిలోని రామంతాపూర్ గ్రామంలో స్థానిక ఎంపీటీసీ తూం శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 400 కుటుంబాలకు శనివారం పలు రకాల కూరగాయలను అందజేశారు.

**డిండి :** కరోనా వైరస్ నివారణలో భాగంగా ప్రభుత్వాదేశాల మేరకు మండలంలో మహిళలు చేపడుతున్న మాస్కుల తయారీకి ఎంపీపీ మాధవరం సునీత తన సొంత డబ్బులు ఖర్చు చేసి కొనుగోలు చేసిన కాటన్ క్లాత్‌ను శనివారం వెలుగు సీసీలకు అందించారు. ఈ సందర్భంగా క్లాత్‌ను మాస్కలను తయారు చేస్తున్న మహిళ సంఘాల సభ్యులకు అందించాలని ఆమె వారికి సూచించారు.


వేములపల్లి : నిత్యావసర సరుకులు అందజేస్తున్న సర్పంచ్ నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి


కొండమల్లేపల్లి : బియ్యం అందజేస్తున్న బాలునాయక్

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**శాలిగౌరారం :** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన శనివారం పెర్కకొండారంలో జాతీయ రహదారిపై జరిగింది. ఎస్ఐ హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పెర్కకొండారం గ్రామానికి చెందిన పులిజాల ఆంజనేయులు(26) నకిరేకల్‌లోని నిమ్మకాయల మార్కెట్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి పనులు ముగించుకొని అదే గ్రామానికి చెందిన దోరెపల్లి వెంకన్నతో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. రహదారిపై ఉన్న కర్ర ను తప్పించే క్రమంలో వాహనం అదుపుతప్పి కిందపడిపోవడంతో ఆంజనేయులు తలకు తీవ్ర గాయాలై మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సీఎం సహాయ నిధికి విరాళం

**నార్కట్‌పల్లి :** కరోనాపై పోరాటానికి తనవంతు సహకారంగా సీఎం సహాయనిధికి నార్కట్‌పల్లి గ్రామపంచాయతీ ఒకటో వార్డు సభ్యుడు అర్ధం శ్రీనివాస్ రూ.10వేలను ఎమ్మె ల్యే చిరుమర్తి లింగయ్యకు శనివారం అందజేశారు.

## మోదీ, కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం

**నకిరేకల్ :** కరోనా వైరస్ నుంచి దేశాన్ని కాపాడాలని సాయినాథుడి చిత్రపటానికి, వైరస్ నివారణకు చర్యలు తీసుకుంటున్న పీఎం నరేంద్ర మోదీ, సీఎం కేసీఆర్ చిత్రపటాలకు శనివారం సాయి దేవాలయ గౌరవ అధ్యక్షులు కాసం లింగయ్య ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు.

## బీజేపీ నుంచి సస్పెన్షన్

**నకిరేకల్ :** పార్టీ వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కొండేటి శ్రీనును పార్టీనుంచి సస్పెండ్ చేస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు యానాల శ్రీనివాస్‌రెడ్డి శనివారం తెలిపారు.

## రేపటి నుంచి ఆన్‌లైన్ తరగతులు

**నకిరేకల్ :** లాక్‌డౌన్ నేపథ్యంలో నకిరేకల్‌లోని ఏవీఎం విద్యాసంస్థల విద్యార్థులకు ఈనెల 13 నుంచి ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహిస్తున్నట్లు విద్యాసంస్థల అధినేత కందాళ పాపిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## మద్యం దుకాణాల సీజ్

**చండూరు :** నిబంధలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు చేస్తున్న మండలం పరిధిలోని నాలుగు వైన్స్‌షాపులను ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. సీజ్ చేసిన వారిలో ఎక్సైజ్ సీఐ భానుచంద్రనాయక్, ఎస్ఐ ఉపేందర్‌రెడ్డి, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ సత్యనారాయణ ఉన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

**నకిరేకల్ :** మంగళపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబాలకు చెందిన కందికంటి లక్ష్మమ్మ, గుడిపాటి శంకర్‌లు అనారోగ్యంతో మృతిచెందారు. శనివారం మృతుల కుటుంబాలను ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి పరామర్శించి, ఒక్కొక్క కుటుంబానికి రూ.4వేల చొప్పున అందజేశారు.

## నివాసం ఉంటున్న వారికే క్వాటర్లు కేటాయించాలి

**నల్లగొండ టూటౌన్ :** నల్లగొండ పట్టణ శివారులోని ఎస్ఎల్‌బీసీ క్వాటర్లలో ఉంటున్న ప్రభుత్వ ఉద్యోగులకే వాటిని కేటాయించాలని కోరుతూ టీఎన్‌జీఓస్ నాయకులు శనివారం ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

## కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

**డిండి:** కడుపు నొప్పి భరించలేక ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జాల్‌తండా గ్రామపంచాయతీ కొత్తతండా (మూలతండా)కు చెందిన కొర్ర బోజ్యానాయక్ హైదరాబాద్‌లో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బోజ్యా కుమారుడు సాయికుమార్(21) లాక్‌డౌన్ కారణంగా గతనెల 22నుంచి కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామంలోనే ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి కడుపునొప్పి రాగా తట్టుకోలేక తండా పక్కనే ఉన్న మేళ్లమ్మ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సాయి కనిపించక పోవడంతో చుట్టుపక్కల వెతకగా అతడి సెల్‌ఫోన్‌తోపాటు చెప్పులు చెరువు ఒడ్డునే ఉండడం గమనించారు. చెరువులో గాలించగా మృతదేహం బయటపడింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ.కుర్మయ్య తెలిపారు.

## వాహనాల సీజ్

**నల్లగొండ క్రైం :** లాక్‌డౌన్‌ను పోలీసులు మరింత కఠినతరం చేశారు. శనివారం పట్టణంలో 400 వాహనాలను సీజ్ చేశారు. అనుమతి లేకుండా రోడ్లపైకి వచ్చే వాహనదారులకు ఆన్‌లైన్‌లో జరిమానానా విధించారు.డీఎస్పీ వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్డీఓ జగదీశ్‌రెడ్డిలు పట్టణంలో పలు ప్రాంతాలు పరిశీలించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**త్రిపురారం :** మండలంలోని వస్త్రాం తండాలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ అనుముల పాండమ్మ, జెడ్పీటీసీ ధనావత్ భారతి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నగారా గౌతమి, ఎంపీటీసీ రవి, ఏపీఎం దిలీప్‌కుమార్, వైస్‌ఎంపీపీ గట్టు యాదగిరి, సీసీ పిచ్చమ్మ పాల్గొన్నారు.

**పెద్దఅడిశర్లపల్లి :** మండలంలోని గుడిపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ వల్లపు రెడ్డి, సర్పంచ్ శేఖర్‌రెడ్డిలు ప్రారంభించారు.

## రామకోటి దేవాలయంలో మృత్యుంజయ హోమం

**నల్లగొండటూటౌన్ :** నల్లగొండ పట్టణంలోని బీట్ మార్కెట్ రామకోటి స్థూప దేవాలయంలో సంకట హర చతుర్థి సందర్భంగా శనివారం మృత్యుంజయ హోమం, లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు.

# ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి

**నల్లగొండ :** విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే జయంతిని సంఘం కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో వెంకన్న, శేఖర్, నరేందర్, రాంమూర్తి, మధు, గోపీకృష్ణ, అమృతం, రమేష్‌కుమార్, వెంకటేశ్వర్లు, ఊట్కూరి గిరి పాల్గొన్నారు.

**టీపీయూఎస్ ఆధ్వర్యంలో...**

టీపీయూఎస్ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే జయంతిని సంఘం కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో అలుగుబెల్లి పాపిరెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి, నాగరాజు, శేషు, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

**మునుగోడు :** మహాత్మా జ్యోతిరావు పూలే బడుగుల ఆశాజ్యోతి అని బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పూలే జయంతి సందర్భంగా శనివారం మండలంలోని కోతులారం గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

**నకిరేకల్ :** మండల కేంద్రంలో కేవీపీఎస్, కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా పూలే చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

**చింతపల్లి :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను నిర్వహించారు.

**కొండమల్లేపల్లి :** దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని అసోసియేషన్ భవనంలో సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే 194వ జయంతిని నిర్వహించారు.

**మిర్యాలగూడ :** మహాత్మ జ్యోతిరావుపూలే జయంతిని శనివారం మిర్యాలగూడలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో సాగర్‌రోడ్డులోని జ్యోతిరావుపూలే విగ్రహానికి డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో,విద్యుత్ డీఈ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

**హాలియా(నాగార్జునసాగర్) :** జ్యోతిరావు పూలే జయంతిని లాక్‌డౌన్ నేపథ్యంలో ఎంపీపీ సుమతి పురుషోత్తం తన ఇంట్లో నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

**నాంపల్లి(మునుగోడు) :** మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో పూలే జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలె చిత్రపటానికి పీఎన్‌ఎం జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి పూలమాల వేసి నివాళులర్పించారు.

**త్రిపురారం :** జ్యోతిరావు పూలే జయంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాంమూర్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కామర్ల జానయ్య, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అనుముల పాండమ్మ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ అనుముల శ్రీనివాసరెడ్డి, వైస్‌ఎంపీపీ గట్టు యాదగిరి, చిలుముల శ్రీను, రామచంద్రయ్య, ఇన్‌చార్జి ఎంపీఓ రాజేంద్రకుమార్, సిబ్బంది నర్సింహరాజు, సలీం పాల్గొన్నారు.

**దామరచర్ల :** రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన వాడపల్లి చెక్‌పోస్టు వద్ద పూలే జయంతిని శనివారం నిర్వహించారు. తొలుత చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

**పెద్దఅడిశర్లపల్లి :** మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు పోతెం సహదేవుడు పూలమాలలువేశారు.

**చిట్యాల :** చిట్యాలలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపెల్లి సీతారాములు, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, పామనగుల్ల అచ్చాలు, నారబోయిన శ్రీనువాసులు రుద్రారపు పెద్దులు పాల్గొన్నారు.


నల్లగొండ : పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యుత్ బీసీ ఉద్యోగులు


# సాక్షి సండే క్లాసిఫైడ్స్

**BIRTHDAY GREETINGS**




**REAL ESTATE**

**PLOT FOR SALE**

■ నల్లగొండ పట్టణం ఆర్జాలబావి అద్దంకి బైపాస్ రోడ్ ప్రక్కన హ్యుందాయ్ షోరూం ఎదురుగా, మెయిన్‌రోడ్ ఫేస్ గల 1300 గజాల ప్లాటు అమ్మబడును. సంప్ర॥ 9440628696, 9441804096 [Y-708808]

■ నల్గొండ టౌన్‌లో హైవే ఫేసింగ్ వెంచర్లో 2 BHK Houses & ఓపెన్ ప్లాట్లు అమ్మబడును. స్విమ్మింగ్ పూల్, క్లబ్ హౌస్, జిమ్, BT రోడ్స్,అన్ని సౌకర్యా లతో+లోన్ సౌకర్యం. 9346837010. [H-744325]

**HOUSE FOR SALE**

■ నల్లగొండ టౌన్ MLG రోడ్ ఇండియన్ కాలనీలో 142 చ॥గ॥ల పడమర ఫేస్ 2BHK న్యూ కన్‌స్ట్రక్షన్ అన్ని వసతులు కలిగిన ఇల్లు వెంటనే అమ్మబడును. బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు. 7396781479, 9440184054 [Y-708876]

**SERVICES**

**వధువు కావలెను**

■ SC మాల 43 Yers, 5.5, చామనచాయ, B.Sc., BEd, ప్రైవేట్ జాబ్, జీతం 15,000 వరుడికి తగిన వధువు కావలెను. సంప్ర॥ 9959277431 [Y-1004120]

■ SC మాల హిందూ లేటు మ్యారేజ్ Marriage, 35 Yers, 5.11, చామనచాయ, P.G, Govt పార్ట్‌టైం లెక్చరర్, జీతం 20,000 వరుడికి తగిన వధువు కావలెను. సంప్ర॥ 9959277431 [Y-1004121]

**WANTED**

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం హైదరాబాద్‌లో ముసలివారికి సేవ చేయుటకు వర్కర్స్, ఏజెంట్లు కావలెను. భోజనం+వసతి+మంచిజీతం, మంచి కమీషన్ కలదు. Ph: 9705571122 / 9010581122. [H-733898]

**For Classifieds: 9010002038**

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచు రించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పం దించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాం టి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


## యువతిని వేధించిన వ్యక్తి అరెస్ట్

**మిర్యాలగూడ టౌన్ :** మిర్యాలగూడలోని గోదావరి అర్బన్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని యువతిని మోసం చేయడంతోపాటు వేధించిన కేసులో సొసైటీ మేనేజర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వై.వెంకటేశ్వర్‌రావు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని వినోభానగర్‌కు చెందిన నూనె వెంకటేశ్వర్లు పట్టణంలోని గోదావరి అర్బన్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ బ్యాంకులో ఉద్యోగాల నోటిఫికేషన్ పడగా మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన ఓ యువతి దరఖాస్తు చేసుకోవడంతోపాటు ఇంటర్వ్యూకు హాజరుకాగాఆ యువతి ఫోన్ నంబర్ తీసుకున్న మేనేజర్.. 'నిన్ను ఒక్కదానినే సేల్స్ ఆఫీసర్‌గా ఉద్యోగానికి ఎంపిక చేశాను' అని చెప్పి.. ఈ నెల 7న రైల్వేస్టేషన్ వద్దకు రమ్మన్నాడు. ఆమె అక్కడికి వెళ్లగా లైంగిక వేధింపులకు పాల్పడడంతో కేకలు వేయడంతో మేనేజర్ పరారయ్యాడు. బాధితురాలు రూరల్ పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు పంపారు. సమావేశంలో రూరల్ సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ పరమేష్ ఉన్నారు.

## ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం : బడుగుల

**కేతేపల్లి (నకిరేకల్) :** రబీ సీజన్‌లో రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అందులో ఎలాంటి ఆందోళన అవసరం లేదని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. శనివారం కేతేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రబీలో గత ఏడాది కంటే ఈసారి వరిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని, 48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికార యంత్రాగం అంచనా వేసిందన్నారు. కరోనా వైరస్ నేపథ్యంలో రైతులు ఎక్కువగా గుమికూడకుండా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు.

## 108 వాహనంలో ప్రసవం

**రామగిరి(తిప్పర్తి) :** నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా 108 వాహనంలోనే గర్భిణి ప్రసవం అయ్యింది. ఈ సంఘటన శనివారం తిప్పర్తి మండలంలో చోటు చేసుకుంది. తిప్పర్తి మండలం యాపలగూడానికి చెందిన రేణుకను(21) పురిటి నొప్పులతో బాధపడుతుండగా 108వాహనంలో నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా ఇండ్లూరు వద్దకు చేరుకోనే సరికి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో సిబ్బంది వాహనంలోనే ప్రసవం చేశారు. ఆమెకు ఆడశిశువు జన్మనిచ్చింది. వెంటనే తల్లీబిడ్డలను నల్లగొండ ఎంసీహెచ్ వార్డుకు తరలించారు. తల్లి బిడ్డలు ఇద్దరు క్షేమంగా ఉన్నారు. 108లో టెక్నీషీయన్ సైదులు, పైలెట్ వెంకటేశ్వర్లు ఉన్నారు.



## జర్మనీలో తక్కువ మరణాలకు కారణం...



ప్రపంచం మొత్తమ్మీద శనివారం నాటికి కోవిడ్–19 బారిన పడి మరణించినవారు లక్షకుపైమాటే. అయితే చనిపోతున్న వేగం దేశాన్ని బట్టి మారుతోంది. కానీ.. జర్మనీలో ఇది అతి కనిష్టంగా ఎందుకు ఉందన్నది మాత్రం శాస్త్రవేత్తలకు అంతుచిక్కడం లేదు. వరల్డోమీటర్ వెబ్‌సైట్ లెక్కల ప్రకారం.. శనివారం జర్మనీలో 1.22 లక్షల మంది వ్యాధి బారిన పడగా 2,736గా ఉంది. ఇదే సమయంలో ఇటలీలో 1.47 లక్షల కేసులకు గాను మరణించిన వారు 18 వేలకుపైమాటే. స్పెయిన్‌లో 1.61 లక్షల కేసులకు గాను 16 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఇందుకు కారణం ఏమిటన్నది తమకు అర్థం కావడం లేదని అంటున్నారు జర్మనీలోని రాబర్ట్ కోచ్ ఇన్‌స్టిట్యూట్ అధికార ప్రతినిధి మారెకీ డీగెన్. ఆరోగ్యశాఖకు చెందిన ఈ సంస్థ వైరస్ కట్టడి చర్యలను పర్యవేక్షిస్తోంది. ఇటలీ, జర్మనీ రెండింటిలోనూ వయో వృద్ధులు ఎక్కువైనా ఒక దేశంలోనే ఎక్కువ మంది బలికావడం గమనార్హం. జర్మనీలో ఇతర దేశాల కంటే భిన్నంగా తీసుకున్న చర్యలు కూడా ఏవీ లేవు. కాకపోతే ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు బాగా పనిచేస్తాయని వైరాలజిస్ట్ సెంట్‌మెర్ తెలిపారు. మరణాలు తక్కువగా ఉండేందుకు ఇదో కారణం కావచ్చునని అభిప్రాయపడ్డారు. దీంతోపాటు కరోనా కోసం వేగంగా ఎక్కువమందికి పరీక్షలు జరపడం కూడా తమకు ఉపయోగపడి ఉండవచ్చని.. బాధితులను తొందరగా గుర్తించడం ద్వారా చాలామంది ప్రాణాలు దక్కి ఉండవచ్చునని వివరించారు.

## శేష ప్రశ్నలు ఇంకా మిగిలే ఉన్నాయి..



కరోనా వైరస్‌కు సంబంధించి ఇంకా చాలా మిస్టరీలే ఉన్నాయి. ఇటీవల తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో 23 రోజుల పసికందుకు ఈ వ్యాధి సోకిందని తెలిసింది. అలాగే కొంత కాలం క్రితం లండన్‌లోనూ ఓ నవజాత శిశువు వైరస్ కోరల్లో చిక్కుకుంది. ఇలా ఒకట్రెండు సంఘటనలను మినహాయిస్తే ప్రపంచవ్యాప్తంగా పిల్లలు ఈ వైరస్ బారిన పడింది చాలా తక్కువ. దీనికి కారణం ఏమిటన్నది తెలియాల్సి ఉంది. ఫిబ్రవరి 11 వరకూ ఉన్న లెక్కల ప్రకారం తొమ్మిదేళ్ల లోపు వయసున్న వారు ఒక్క శాతం మాత్రమే ఉండగా, పది నుంచి 19 ఏళ్ల మధ్య వయసు వారు కూడా ఇదే స్థాయిలో ఉన్నారు. మరోవైపు 50 –59 మధ్య వయసుల వారి శాతం 25 కాగా, 60– 69 మధ్య వయసుల వారి శాతం 19గా ఉంది. జలుబు కలిగించే వైరస్‌లకు పిల్లలు అలవాటు పడి ఉండటం వల్ల ఇలా జరుగుతోందని కొందరు చెబుతున్నా స్పష్టమైన కారణాలైతే తెలియాల్సి ఉంది. ఇదిలా ఉంటే.. అధిక రక్తపోటు ఉన్న వారు కరోనా కారణంగా మరణించేందుకు ఎక్కువ అవకాశాలు ఉండటంపై కూడా శాస్త్రవేత్తలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. బహుశా ఇలాంటి వారిలో గుర్తించిన ఇతర సమస్యలు ఉండటం వల్ల ఇలా జరిగి ఉండవచ్చని లివర్‌పూల్ స్కూల్ ఆఫ్ ట్రాపికల్ మెడిసిన్‌కు చెందిన టామ్ వింగ్‌ఫీల్డ్ అంటున్నారు. రక్తపోటు ఎక్కువగా ఉన్న వారిలో ఎక్కువ మంది మధుమేహులు అయ్యేందుకు, మూత్రపిండాలు సరిగా పనిచేయకపోయేందుకు అవకాశాలు ఉంటాయని, అయితే ఈ కారణాలతోనే కోవిడ్ బారిన పడినప్పుడు వీరు మరణిస్తున్నారా? అన్నది నిర్ణయించాల్సి ఉంది.

### మీ వ్యూహంతో
# ముందుకు సాగుతాం

- కరోనా వైరస్ కట్టడికి రాష్ట్రంలో పటిష్ట చర్యలు తీసుకున్నాం
- గ్రీన్ జోన్లలో లాక్‌డౌన్‌కు సడలింపులిస్తే కూలీలు, వ్యవసాయం, పారిశ్రామిక రంగానికి ఊపిరి
- కోవిడ్–19పై ప్రధానితో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

> జనం గుమిగూడకుండా మాల్స్, సినిమా హాళ్లు, ప్రార్థనా మందిరాలు, ప్రజా రవాణా, పాఠశాలలపై ఇప్పుడున్న పరిస్థితి కొనసాగాలి. ఇవి కాకుండా మిగిలిన చోట్ల భౌతిక దూరం పాటించాలి. ఈ యుద్ధంలో ఒకే రకమైన వ్యూహంతో ముందుకు సాగాలి.
> – సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: కోవిడ్–19 వ్యాప్తి నివారణకు పటిష్టమైన చర్యలను తీసుకుంటున్నామని, లాక్‌డౌన్‌ను పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకువెళ్లారు. లాక్‌డౌన్ కారణంగా లక్షలాది వ్యవసాయ కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని వివరించారు. వలస కార్మికులు, దినసరి కూలీలు, వ్యవసాయం, ఉద్యానవన, ఆక్వా రైతులు పూర్తిగా దెబ్బతిన్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కరోనా కేసులు ఎక్కువగా ఉన్న 81 రెడ్, ఆరెంజ్ జోన్ల మండలాలకు లాక్‌డౌన్‌ను పరిమితం చేస్తూ మిగతా 595 (కరోనా కేసుల్లేని) గ్రీన్ జోన్ మండలాల్లో ఆంక్షలతో లాక్‌డౌన్ సడలించాలనేది తన అభిప్రాయమని ప్రధాని దృష్టికి తీసుకువెళ్లారు. అయినా ప్రధాన మంత్రిగా మీరు సూచించే వ్యూహంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. కోవిడ్–19 వ్యాప్తి నివారణ చర్యలు, లాక్‌డౌన్ కొనసాగించాలా.. లేదా.. కొనసాగిస్తే ఎలాంటి సడలింపులు ఇవ్వాలనే అంశాలపై శనివారం ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కోవిడ్–19 నివారణకు తీసుకున్న చర్యలను, కోవిడ్ ఆసుపత్రుల సన్నద్ధత, లాక్‌డౌన్ కారణంగా నెలకొన్న సమస్యలను ప్రధానికి వివరించారు.



మంత్రులు, అధికారులతో కలసి ప్రధాని వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

> 1918లో వచ్చిన ఫ్లూ భారతదేశ ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేసింది. రెండేళ్లకు పైగా అది దేశంపై ప్రభావం చూపింది. దీన్ని పరిగణనలోకి తీసుకుంటే.. మనం దీర్ఘకాలం పోరాటం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితిలో ఆర్థిక వ్యవస్థ చక్రం పూర్తి వేగంతో ముందుకు కదలకపోయినా, కనీసం ప్రజల అవసరాలకు తగినట్టుగా నైనా నడిచే విధంగా చూడాలి.

> లాక్‌డౌన్ కారణంగా వలస కార్మికులు, దినసరి కూలీలు, వ్యవసాయం, ఉద్యానవన, ఆక్వా రైతులు పూర్తిగాదెబ్బ తిన్నారు. కోవిడ్–19 నివారణకు ప్రధాన మంత్రిగా మీరు తీసుకున్న విశాలమైన,గట్టి చర్యలను నేను బలంగా సమర్థిస్తున్నాను.

> రాష్ట్రంలో 676 మండలాలు ఉన్నాయి. ఇందులో కరోనా వైరస్ సోకిన రెడ్‌జోన్లలో 37 మండలాలు, ఆరెంజ్ జోన్లలో 44 మండలాలు (మొత్తం 81) ఉన్నాయి.
> గ్రీన్ జోన్‌లో ఉన్న మిగతా 595 మండలాలపై ప్రస్తుతానికి కరోనా ప్రభావం లేదు. ఈ నేపథ్యంలో లాక్‌డౌన్‌ను రెడ్, ఆరెంజ్ జోన్లకే పరిమితం చేస్తే బావుంటుంది.

### ఇదీ మా పని తీరు

- రాష్ట్ర వ్యాప్తంగా లాక్‌డౌన్‌ను అమలు చేస్తున్నాం. అదే సమయంలో మానవతా కోణంలో స్పందిస్తున్నాం.
- రాష్ట్ర వ్యాప్తంగా 1.4 కోట్లకుపైగా ఉన్న కుటుంబాలను, వారి ఆరోగ్యాన్ని క్రమం తప్పకుండా పరిశీలిస్తున్నాం. కరోనా లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారికి పరీక్షలు చేసి, వైద్యం అందిస్తున్నాం.
- ఏపీలో 2,61,216 గ్రామ, వార్డు వలంటీర్లు, 40 వేల మంది ఆశ వర్కర్లు, 20,200 మంది ఏఎన్‌ఎంలు ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. కోవిడ్ లక్షణాలు ఉన్న వారిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తున్నాం. వారికి దాదాపు 3 వేల మంది వైద్యుల ద్వారా సేవలు అందిస్తున్నాం.
- కరోనా పాజిటివ్ కేసులు ఉన్న ప్రాంతాల్లో కంటైన్‌మెంట్ వ్యూహం కొనసాగుతోంది. లాక్‌డౌన్‌ను పటిష్టంగా అమలు చేయడానికి, ఆ ప్రాంతంలోని ప్రతి ఇంటిని పర్యవేక్షించడానికి, ఉధృతంగా పరీక్షలు నిర్వహించడానికి, 141 కంటైన్‌మెంట్ క్లస్టర్లను హాట్‌స్పాట్లుగా గుర్తించాం.
- ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలను గణనీయంగా పెంచుతున్నాం. క్రిటికల్ కేర్ కోసం నాలుగు అత్యాధునిక ఆసుపత్రులు, 13 జిల్లాల్లోనూ ఒక్కో కోవిడ్ ఆస్పత్రిని ఏర్పాటు చేసుకున్నాం. జిల్లాల్లో వీటికి అదనంగా మరో 78 ఆసుపత్రులను ఏర్పాటు చేసుకుంటున్నాం.
- సమర్థవంతంగా క్వారంటైన్ చేయడానికి ప్రతి జిల్లాలో కోవిడ్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేశాం. ఇందులో 26 వేల బెడ్స్ సిద్ధంగా ఉన్నాయి.

### వ్యవసాయం పరిస్థితి ఇదీ..

- మన ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానిదే ప్రధాన భూమిక. జీఎస్‌డీపీలో 35 శాతం, ఉపాధి కల్పనలో 62 శాతం వాటా వ్యవసాయానిదే. లాక్‌డౌన్ కారణంగా రాష్ట్రాల మధ్య వ్యవసాయ ఉత్పత్తుల రవాణా గణనీయంగా పడిపోయింది. నిలిపివేస్తారనే భయంతో 25 శాతం మించి ట్రక్కులు తిరగడం లేదు.



- రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులను భద్రపరచడానికి, నిల్వ చేయడానికి సరిపడా గోదాములు లేవు. మార్కెట్లు నడవక పోవడంతో ధాన్యం, మొక్క జొన్న, మిర్చి, పొగాకు, అరటి, బొప్పాయి, కూరగాయలను కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది. కానీ స్థానికంగా వీటిని ఎంత వరకు వినియోగించగలం?
- ఇప్పుడున్న పరిస్థితి కొనసాగితే లక్షలాది వ్యవసాయ కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయి. నిల్వ చేయడానికి తగిన స్టోరేజీ సదుపాయం లేక, ఎగుమతులు లేక ఆక్వా రంగం కూడా తీవ్రంగా దెబ్బతింటోంది.

### పడకేసిన పారిశ్రామిక రంగం



- రాష్ట్రంలోని పారిశ్రామిక రంగం విషయానికొస్తే 1,03,986 యూనిట్లకు గాను 7,250 మాత్రమే నడుస్తున్నాయి. పంపిణీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. రోడ్డు, రైల్వే రవాణా నిలిచి పోవడం సంక్షోభం పెరగడానికి కారణమైంది.
- పరిశ్రమలు నడవనప్పుడు వారు జీతాలు చెల్లించగలరని మనం ఎలా ఆశించగలం? రాష్ట్రానికి ఆదాయం కూడా రాని పరిస్థితి. సహాయ, సంక్షేమ కార్యక్రమాలకు నిధుల కొరత తలెత్తింది.
- కరోనా వైరస్ మరింతగా వ్యాపించకుండా దేవుడి దయ వల్ల అడ్డుకోగలుగుతున్నాం. మన కంటికి కనిపించని ఈ మహమ్మారి త్వరలోనే నయం అవుతుందని నమ్ముతున్నాం.
- నా అభిప్రాయంతో పాటు, మా రాష్ట్రంలో జరుగుతున్న అంశాలపై మీకు సంక్షిప్తంగా నివేదించా. ఈ యుద్ధాన్ని ఎదుర్కోవడంలో ఒక్కటిగా, ఒకే రకమైన వ్యూహంతో ముందుకు సాగాలి. మీ నాయకత్వంపై సంపూర్ణ విశ్వాసం ఉంది. ప్రధానిగా మీరు సూచించే వ్యూహంతో ముందుకు సాగుతాం.
- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం ఆళ్ల నాని, హోం మంత్రి మేకతోటి సుచరిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని, డీజీపీ గౌతం సవాంగ్, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా జస్టిస్ కనగరాజ్

**నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్**
- బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ కనగరాజ్
- గవర్నర్‌తో మర్యాదపూర్వక భేటీ
- ఎన్నికల కమిషనర్‌ను కలిసిన పలువురు ప్రముఖులు

సాక్షి, అమరావతి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా జస్టిస్ వి.కనగరాజ్ నియమితులయ్యారు. మద్రాస్ హైకోర్టులో తొమ్మిదేళ్లపాటు జడ్జిగా పనిచేసి పదవీ విరమణ చేసిన ఆయన ప్రస్తుతం సుప్రీంకోర్టులో సీనియర్ అడ్వొకేట్‌గా కొనసాగుతున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నియామక అర్హతలు, పదవీ కాలంపై రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఆర్డినెన్స్ తెచ్చిన విషయం తెలిసిందే. తాజా ఆర్డినెన్స్‌కు అనుగుణంగా శనివారం గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ రాష్ట్ర కొత్త ఎన్నికల కమిషనర్ నియామకానికి నోటిఫికేషన్ జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతారని అందులో పేర్కొన్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికే జస్టిస్ కనగరాజ్ విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. వివిధ విభాగాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టినట్టు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న జస్టిస్ కనగరాజ్

**రాష్ట్ర కొత్త ఎన్నికల కమిషనర్ ప్రొఫైల్..**
- తమిళనాడులోని సేలం, చెన్నైల్లో పాఠశాల విద్యాభ్యాసం. మద్రాస్ లయోలా కాలేజీలో 1969లో డిగ్రీ చేశాక 1972లో మద్రాస్‌లో లా ఉత్తీర్ణత.
- 1973 జనవరిలో మద్రాస్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా పేరు నమోదు. అదే ఏడాది మార్చి నుంచి సేలం బార్ అసోసియేషన్ సభ్యుడిగా చేరి లాయర్‌గా ప్రాక్టీస్.
- 24 ఏళ్లపాటు న్యాయవాదిగా పనిచేశాక 1997 ఫిబ్రవరి 24న మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు
- జడ్జిగా ఆయన చాలా మంచి పేరు తెచ్చుకున్నారు. జడ్జిగా తొమ్మిదేళ్లలో రికార్డు స్థాయిలో 69 వేల కేసులకు తీర్పులు, ఉత్తర్వులు వెలువరించారు. వీటిలో 1010 వివిధ లా జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.
- 2002–05 మధ్య తమిళనాడులోని డాక్టర్ అంబేడ్కర్ లా యూనివర్సిటీ సెనేట్ మెంబర్‌గా పనిచేశారు.
- సీనియర్ సిటిజన్స్‌కు సంబంధించిన కేసుల పరిష్కారంలో ప్రత్యేక గుర్తింపు.
- 2006 జనవరిలో జడ్జిగా పదవీ విరమణ చేశాక ఢిల్లీలో సుప్రీంకోర్టు సీనియర్ అడ్వొకేట్‌గా న్యాయవాద వృత్తిని తిరిగి ప్రారంభించారు.

# లాక్‌డౌన్ తొలగితేనే ఆర్టీసీ రైట్ రైట్

**ఇప్పటికే చేసుకున్న రిజర్వేషన్లు రద్దు.. రూ.2.5 కోట్ల సొమ్ము వాపస్**

సాక్షి, అమరావతి: ఈ నెల 15 నుంచి బస్సుల్ని తిప్పాలన్న ఆలోచనను ఆర్టీసీ విరమించుకుంది. లాక్ డౌన్‌పై సందిగ్ధత కొనసాగుతుండటం, పాక్షికంగా తొలగించినా ప్రజా రవాణాపై ఆంక్షలు కొనసాగించాలని నిర్ణయించడంతో ఆర్టీసీ యాజమాన్యం ఈ నిర్ణయానికి వచ్చింది. అప్పటికే ఈ నెల 20 వరకు ఆన్‌లైన్‌లో హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, తిరుపతి, కర్నూలు, విశాఖపట్టణం తదితర ప్రాంతాలకు 42 వేల మంది వరకు ప్రయాణికులు టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. తాజా పరిణామాలతో లాక్ డౌన్ పూర్తిగా ఎత్తేసి సాధారణ పరిస్థితులు వచ్చిన తర్వాతే బస్సుల్ని తిప్పాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే రిజర్వేషన్ చేసుకున్న 42 వేల మంది ప్రయాణికులకు వారు బుక్ చేసుకున్న టిక్కెట్లకు గాను రూ.2.5 కోట్లను వారికి వాపస్ ఇవ్వనున్నారు. కాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు క్వారంటైన్ కేంద్రాలకు, మొబైల్ రైతు బజార్లుగా మాత్రం ఆర్టీసీ బస్సులను ఉపయోగిస్తున్నారు. దూర ప్రాంత బస్ సర్వీసులు ఎప్పటి నుంచి ప్రారంభించేదీ తర్వాత తెలియజేస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు.


**సాక్షి పెళ్ళిచూపులు**

**వధువు కావలెను**



కమ్మ/సెకండ్/41 సం॥లు/6''/Well సెటిల్డ్ గల వరుడుకు తగిన వధువు కావలెను. డైరెక్ట్‌గా సంప్ర॥ (నో బ్రోకర్స్) 95428 01745 [R-327]

క్రిస్టియన్ మాదిగ/M.Tech/C.Govt. Asst మేనేజర్ (SBI) / 60,000/- PM / 5'8''ఎత్తు/ 28 సం॥ల వరుడుకి వధువు కావలెను. Ph: 9515755529. [HA-10855]

మాల/M.Tech/Govt.A.E (ఇరిగేషన్ Dept) / 75,000/- PM / 5'8''ఎత్తు/ 28 సం॥ల వరుడుకి వధువు కావలెను. Ph: 9542179041. [HA-10855]

రెడ్డి, విడో, 25 y ప్రమాదంలో ఫ్యామిలీని కోల్పోయి పెద్ద స్థిరాస్థి కలిగిన వధువుకు వరుడు కావలెను. (ఆస్థి, కుల, పట్టింపు లేదు.) Whatsapp : 90105 43653 [V- 2054]

రెడ్డి, విడో, 36 y పెద్ద స్థిరాస్థి కలిగి ఫ్యామిలీ లేని ఒంటరి వధువుకు తోడు కావలెను. (అర్జెంట్) ఆస్థి, కుల,వయసు, పట్టింపు లేదు. Whatsapp : 72072 14721 [V- 2678]

గౌడ/M.Tech (EEE)/Govt.AEE / (జెన్ కో)/60,000/- PM / 5'4'' ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9912280929. [HA-10855]

బ్రాహ్మణ/32/5'3''/ఇంటర్/*37/5'3''/డిగ్రీ/ *41/5'2''/ఇంటర్ మధ్య తరగతి వధువులకై వరులు కావలెను. అతి త్వరగా చూడబడును. వధువులకు ఉచితం ఫోన్: 8374994855. [HA-10855]

కుల పట్టింపు లేదు/widow/43/5'5''/Govt.Job/ Sale Tax Dept / 1.5 L. PM / Own House, Lands కోట్ల ప్రాపర్టీ గల Well Settled వధువుకు వరుడు కావలెను. Ph: 9160048030. [HA-10855]

★

SC మాల/హిందు/MCom/ 35 Yrs / 5'1'' / Fair / Govt. Jr College / Hyd/ Contract Jr. Lecturer Job/ 37000/- PM /వధువుకి తగిన వరుడు కావలెను. డైరెక్ట్. ఫోన్ : 9949594536 [HA-742275]

SC ఆది ఆంధ్ర/ ఇంటర్ పాస్ /39y / 5'3''/ లేట్ మ్యారేజ్/ వధువుకి Hyd లో 50K పైన జీతం ఉన్న అప్పర్ క్లాస్ 1st మ్యారేజ్ వరుడు కావలెను. డైరెక్ట్. 9849301924 [H-733723]

**వరుడు కావలెను**



కమ్మ, క్యాస్ట్ నోబార్, 45Yrs, గ్రూప్–1 ఆఫీసర్ సెక్రటేరియట్ ఉద్యోగి/విడో పిల్లలు లేరు. 17 ఎకరాలు ఆస్థి గల వధువుకి వరుడు కావలెను. సంప్ర: 81062 06207 [G-737958]

**వేదికలు**



Free రిజిస్ట్రేషన్ బ్రాహ్మణ మరియు అన్ని కులాల వధూ–వరులకై (Whatsapp your photo & Bio data - 9533608887) ఫోన్: 9704656103 [HA-1395]

రెడ్డి వివాహ సంబంధముల కొరకు మీ ఫోటో బయోడేటాలను వాట్సప్ చేయండి. లేదా ఫోన్ చేయండి. రాణి Ph: 9393701675. [H-742173]

కేవలం వెలమవారు మొదటి, రెండవ వివాహ సంబంధాల కొరకై నేరుగా వ్యక్తులు మాత్రమే సంప్రదించండి. Hyd : 9848068336 [H-742759]

బాబురావు మ్యారేజిబ్యూరో: మాల, మాదిగ స్పెషల్: IAS, IPS, IRS, IRTS, MBBS, M.S, MD, Govt JOBS, SWE, USA, Group-I, II. Cell: 7893013265. [W-1084520]

రజక వివాహ వేదిక (1994)/Abroad, ఇంజినీర్స్, డాక్టర్స్, Govt.Jobs, Business, B.Ed సంబంధాలకై సంప్ర: 8106303155, 9391265304. [HA-10855]

★

RK ముదిరాజ్ మ్యారేజ్ బ్యూరో 1వ, 2వ, లేటు & అబ్రోడ్ ముదిరాజ్ కులస్థులకు మాత్రమే పెళ్లి సంబంధములు చూపబడును. సంప్రదించండి Ph: 6304693427, 8106807528. [H-742172]

**గమనిక**
సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యా సాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

**ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు**
సాక్షి పెళ్ళిచూపులు
Combined : 1430/- for 4 Lines 385/- Extra Line | Andhra Pradesh: 990/- for 4 Lines (Incl. Hyd) 275/- Extra Line
Telangana : 880/- for 4 Lines (Incl. Hyd) 240/- Extra Line | * Color 25% Extra
గమనిక : ఇకపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం.
3+3 3 ప్రకటనలకు చెల్లించండి 3 ప్రకటనలు ఉచితంగా పొందండి

| | | | | | |
|---|---|---|---|---|---|
| నిజామాబాద్ | :99122 20764 | తిరుపతి | :99122 20584 | తాడేపల్లిగూడెం | :99122 20558 |
| కరీంనగర్ | :9705933396 | కడప | :99516 02932 | రాజమండ్రి | :99122 20358 |
| వరంగల్ | :99516 02868 | అనంతపూర్ | :99122 20718 | విజయవాడ | :9912225442 |
| నల్గొండ | :95055 08382 | కర్నూల్ | :99122 20575 | గుంటూరు | :99122 20349 |
| మహబూబ్‌నగర్ | :99516 02829 | శ్రీకాకుళం | :99122 20343 | ఒంగోలు | :99122 25431 |
| ఖమ్మం | :99122 20596 | విశాఖపట్నం | :99122 20550 | నెల్లూరు | : 99516 02861 |

మరియు మీ దగ్గరలోని సాక్షి ప్రాంతీయ కార్యాలయములలో సంప్రదించండి.
6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-23256000 Ext: 6230 / 6235 Cell: 9912377533.


## ఏపీలో 405కి చేరిన పాజిటివ్

- రాష్ట్రంలో కొత్తగా మరో 24 కేసుల నమోదు
- ఒక్క గుంటూరు జిల్లాలోనే 17..



సాక్షి, అమరావతి : ఏపీలో కొత్తగా మరో 24 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. శుక్రవారం రాత్రి 9 నుంచి శనివారం సాయంత్రం వరకు జరిగిన కోవిడ్–19 పరీక్షల్లో గుంటూరులో 17, కర్నూలులో 5, ప్రకాశంలో ఒకటి, వైఎస్సార్ జిల్లాలో ఒకటి వంతున కొత్తగా కేసులు నమోదయ్యాయి. వీటితో కలిపి రాష్ట్రంలో మొత్తం కోవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య 405కి చేరింది. శనివారం ఒక్కరోజే గుంటూరు జిల్లాలో 17 కేసులు నమోదు కావడంతో ఆ జిల్లాల్లో లాక్‌డౌన్ నిబంధనలను కఠినతరం చేశారు. రాష్ట్రంలో నమోదైన మొత్తం 405 పాజిటివ్ కేసులకు గాను ఇప్పటివరకు 11 మంది డిశ్చార్జ్ కాగా ఆరుగురు (అనంతపురంలో–2, కృష్ణాలో–2, గుంటూరు–1, కర్నూలు–1) మృతిచెందారు.

## నెల్లూరు జిల్లా యువకుడిపై అమెరికాలో కాల్పులు

**పరిస్థితి విషమం**



మనుబోలు: నల్లజాతీయులు జరిపిన కాల్పుల్లో అమెరికాలో ఎంఎస్ చదువుతున్న శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా మనుబోలు మండలం మడమనూరు గ్రామానికి చెందిన డేగా ధీరజ్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన బిరదవోలు రామసుబ్బారెడ్డి మనవడు డేగా ధీరజ్‌రెడ్డి (దివంగత డేగా భక్తవత్సలరెడ్డి–ప్రమదల కుమారుడు)ఇటీవల ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. చికాగోలోని సెయింట్ లూయిస్‌కు శనివారం ఓ పని నిమిత్తం వెళ్లి అక్కడ సెల్లార్‌లో కారును పార్కింగ్ చేస్తుండగా నల్ల జాతీయులు అతడిపై తుపాకులతో కాల్పులు జరిపారు. తీవ్రగాయాలపాలైన ధీరజ్‌రెడ్డిని స్థానికులు ఆస్పత్రిలో చేర్చారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది.



## సోషల్ మీడియాలో కోవిడ్ అధికారిక సమాచారం

**వాట్సప్, ఫేస్‌బుక్ మెసెంజర్ చాట్ సర్వీస్ ప్రారంభించిన సీఎం జగన్**

సాక్షి, అమరావతి : రాష్ట్ర ప్రభుత్వం కోవిడ్–19 నివారణకు తీసుకుంటున్న చర్యల గురించి సమగ్ర సమాచారాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకునేందుకు వాట్సప్, ఫేస్‌బుక్ మెసెంజర్ చాట్ బాట్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శనివారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో వీటిని ప్రారంభించారు.కరోనా వైరస్ గురించి సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కోసం కాల్ సెంటర్ 104, లేదా 0866–2410978 నంబర్లలో, ఈ మెయిల్ covid&19 info@ap. gov. inలో సంప్రదించవచ్చు. వాట్సప్ కోసం 8297104104కు, ఈ చాట్‌బాట్ లింక్ https:// wa. me/918297104104లకు సంప్రదించవచ్చు.



## పులిరాజాకు వైరస్ ఎలా వచ్చింది?



న్యూయార్క్‌లో ఓ మలేసియా పులికి కరోనా వైరస్ సోకిందనే వార్త మీరు చదివే ఉంటారు. కానీ ఎలా వచ్చిందనేది మాత్రం ఇప్పటివరకూ ఓ మిస్టరీనే. బ్రాంక్స్ జంతు ప్రదర్శనశాల సిబ్బంది ఈ మిస్టరీని ఛేదించే పనిలోనే ఉన్నారు. లక్షణాలేవీ కనిపించని మానవ కరోనా బాధితుడి నుంచి నాదియా అని పిలుస్తున్న పులికి వైరస్ సోకి ఉంటుందని కొంతమంది అంచనా వేస్తున్నప్పటికీ... సిబ్బందిలో ఎవరికీ కరోనా లేదని పాల్ కల్లే అనే వైద్యుడు చెబుతుండటం గమనార్హం. అడవిలో ఉండే జంతువులను మచ్చిక చేసుకోవడం లేదా వేటాడటం వల్ల వాటిల్లోని వైరస్‌లు మనిషికి సోకుతాయని మనకు తెలుసుగానీ.. నాదియా విషయంలో జరిగింది దీనికి పూర్తిగా భిన్నం. మనిషి నుంచి జంతువుకు వైరస్ సోకింది? మార్చి 27.. ఇది ఈ పులికి వైరస్ సోకిందని తెలిసిన రోజు. అయితే అంతకు 11 రోజుల ముందే జంతు ప్రదర్శనశాలను మూసివేశారు. అమెరికాలో వైరస్ కేంద్రంగా మారిన న్యూయార్క్‌లోనే ఈ జంతు ప్రదర్శనశాల ఉంది కాబట్టి కరోనా బాధితుల్లో ఒకరి నుంచి నాదియాకు సోకి ఉండవచ్చని అనుకున్నారు. కానీ దీన్ని నిరూపించడం ఎలా? అల్ట్రాసౌండ్ ద్వారా పరీక్షించినా, ముక్కులోని ద్రవాలు, రక్తం వంటి వాటిని సేకరించి, పరీక్షించి జంతువుల కోసమే ఉద్దేశించిన పరీక్షలు కూడా నిర్వహించారు. మనుషులకు సోకిన కరోనా వైరసే నాదియా శరీరంలోనూ ఉన్నట్లు స్పష్టమైంది. ఎలా అన్నది మాత్రం స్పష్టం కాలేదు. ఒకవేళ మనుషుల నుంచి జంతువులకు సోకి ఉంటే మాత్రం భవిష్యత్‌లో పెద్ద చిక్కే పొంచి ఉన్నట్లు..

## ఆ మరణం ఎలా?



కేరళలో కరోనా కారణంగా ఇటీవల ఒక వ్యక్తి మరణించారు. పోతెన్‌కోడ్ ప్రాంతానికి చెందిన ఈ వ్యక్తికి కరోనా వైరస్ ఎలా సోకిందని ఆరా తీసేందుకు వైద్యాధికారులు చేసిన ప్రయత్నాలు ఇంకా ఫలించలేదు. మరణించిన వ్యక్తి దగ్గరి బంధువులు, స్నేహితుల నుంచి తాజాగా సేకరించిన 19 నమూనాలు నెగెటివ్‌గా తేలగా.. అంతకుముందు సేకరించిన 97 నమూనాల్లోనూ వైరస్ ఆనవాళ్లు కనిపించలేదు. పోనీ ఆ వ్యక్తి వివాహం, ప్రార్థన, సమావేశం, అంత్యక్రియల్లాంటి వాటిల్లో పాల్గొన్నాడా? అని పరిశీలించినా అలాంటి ఆధారమేదీ కనిపించలేదు. దీంతో ఈ కేసును ఎవరికీ సంబంధం లేనిదిగా గుర్తించి వదిలేద్దామన్న ఆలోచనలో ఉన్నారు వైద్య సిబ్బంది. కేరళ రాజధాని తిరువనంతపురంలో ఉండే ఈ పోతెన్‌కోడ్‌లో కొన్ని పాజిటివ్ కేసులు ఉన్నప్పటికీ అవన్నీ ఎలా వచ్చాయో స్పష్టమైంది. సమూహ వ్యాప్తికి మాత్రం ఆస్కారం లేదని ఇప్పటికే తీర్మానించారు. పోతెన్‌కోడ్‌లో మరణించిన వ్యక్తి మార్చి 10న కరెంటు ఆఫీసుకు వెళ్లాడని అంతకుముందు ఒక ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఒక సమావేశానికి హాజరయ్యాడని గుర్తించగలిగారు కానీ.. ఈ ప్రాంతాల నుంచి పాజిటివ్ కేసులేవీ లేవు. రెండుసార్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లినప్పుడు కూడా ఈ వ్యక్తి ఎలాంటి లక్షణాలు కనపరచలేదు.

## ఇప్పుడు రద్దు చేస్తే చార్జీల విధింపు

### అధికారిక ప్రకటన వచ్చాక.. పూర్తి మొత్తం రిఫండ్: రైల్వేశాఖ



**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ ఉధృతి కొనసాగుతుండటంతో లాక్‌డౌన్ మరో రెండు వారాలు పొడిగింపుతో ఏప్రిల్ 15 నుంచి పట్టాలెక్కాల్సిన రైళ్లు ఈ నెలాఖరు వరకు అలాగే నిలిచిపోనున్నాయి. దీంతో అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకున్న చాలామంది టికెట్లు రద్దు చేసుకుంటున్నారు. ఇలా టికెట్లు రద్దు చేసుకుంటున్న వారికి క్యాన్సిలేషన్ చార్జీలను రైల్వే శాఖ విధిస్తోంది. అదే పొడిగించిన లాక్‌డౌన్ ముగిసేంతవరకూ రైళ్లను రద్దు చేస్తున్నట్టు రైల్వే అధికారికంగా ప్రకటన చేసిన తర్వాత క్యాన్సిల్ చేసుకుంటే పూర్తి మొత్తం రిఫండ్ అవుతుందని రైల్వే శాఖ అధికారులు చెబుతున్నారు.

## మరో 7 ఆస్పత్రుల్లో కరోనా చికిత్స



**సాక్షి, హైదరాబాద్:** కరోనా బాధితులకు ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలోనే చికిత్సలు అందజేస్తుండగా.. మరో 7 ఆస్పత్రుల్లోనూ ఈ సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కింగ్‌కోఠిలోని జిల్లా ఆస్పత్రి, గచ్చిబౌలి ఆస్పత్రి, బేగంపేటలోని నేచర్‌క్యూర్ ఆస్పత్రి, చార్మినార్‌లోని నిజామియా ప్రభుత్వ ఆస్పత్రి, ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి, వరంగల్‌లోని ప్రభుత్వ ఆయుర్వేద టీచింగ్ హాస్పిటల్, రామంతాపూర్‌లోని ప్రభుత్వ డీకే హోమియో ఆస్పత్రిని ఎంపిక చేస్తూ ప్రభుత్వ వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతకుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

## 30వరకు టేకాఫ్‌కు అవకాశంలేనట్టే!



**శంషాబాద్:** కరోనా వైరస్ నేపథ్యంలో లాక్‌డౌన్ ఈనెల 14న పూర్తయితే ఆ మరుసటి రోజు నుంచి దేశీయ సర్వీసులు ప్రారంభమవుతాయని అందరూ ఆశించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మరో పదిహేను రోజుల వరకు విమానాల టేకాఫ్‌కు అవకాశం లేనట్టేనని తెలుస్తోంది. లాక్‌డౌన్ ఈనెల 30 వరకు కొనసాగే అవకాశాలుండటంతో దేశీయ విమాన సర్వీసులు కూడా ఆ తర్వాతే ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. విమానాల రాకపోకలకు సంబంధించి కేంద్ర పౌర, విమానయాన మంత్రిత్వశాఖ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు జారీ కాలేదని ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి. ఎయిర్ ఇండియా వంటి సంస్థలు ఈనెల 30 వరకు ఎలాంటి బుకింగ్‌లు కూడా ఇంతవరకు స్వీకరించలేదు.

## 'కమ్మనైన మనసున్న ప్రతి తల్లీ అమ్మే'



**బంజారాహిల్స్:** 'సమాజ సేవలో మెగాస్టార్ తల్లి' శీర్షికన శనివారం సాక్షి దినపత్రిక మెయిన్ చివరి పేజీలో ప్రచురితమైన ఫొటో చిరంజీవి తల్లిది కాదు. దీనిపై శనివారం స్పందించిన మెగాస్టార్ చిరంజీవి.. తన తల్లి తన ఇంట్లోనే ఉందని పొరపాటున ప్రచురించిన ఆ ఫొటో తన తల్లిది కాదని ఖండించారు. అయితే అమ్మ ఎవరికైనా అమ్మే అంటూ ఆయన చేసిన ట్వీట్ నెటిజన్లను ఆకట్టుకుంది.

## పోలీసులే రియల్ హీరోలు: విజయ్ దేవరకొండ



**సాక్షి, హైదరాబాద్:** 'తెర మీదనే మేం హీరోలం.. కానీ, మా నిజమైన హీరోలంటే పోలీసులే' అని అర్జున్‌రెడ్డి ఫేం విజయ్ దేవరకొండ అన్నారు. శనివారం ఆయన లక్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ కోవిడ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ 'తెలంగాణ పోలీసులకు తెలుగు సినీపరిశ్రమ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాను. మా ఇండస్ట్రీ మొత్తం మీ వెనకాలే ఉంది. అత్యవసర సేవలకు ఎక్కడా అంతరాయం కలగకుండా, శాంతి భద్రతలు కాపాడుతూ, కరోనా వైరస్ చైన్‌ను అడ్డుకునేందుకు పోలీసులు కృషి చేస్తున్నారు. మేం తెరమీద మాత్రమే హీరోలం. కానీ, మీరే మా నిజమైన హీరోలు. గత 20 రోజులుగా మీరు లాక్‌డౌన్ కోసం శ్రమిస్తున్నారు. మా సపోర్ట్ మీకెప్పుడూ ఉంటుంది' అని అన్నారు. అనంతరం విజయ్ దేవరకొండకు డీజీపీ మహేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## బ్లీచింగ్‌తో చేతులు కాలుతున్నాయ్..

### జీపీ, మున్సిపల్ కార్మికుల ఆవేదన



చేతికి అయిన గాయాలు చూపిస్తున్న జనగామ మున్సిపల్ కార్మికులు

**జనగామ:** కరోనా వైరస్ కట్టడికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలోని అన్ని వీధుల్లో రోడ్ల వెంట, డ్రెయినేజీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు. గతంలో మాదిరిగా బ్లీచింగ్ పౌడర్‌లో సున్నం వంటివేమీ కలపకుండా, ఫలితం బాగుండాలనే ఉద్దేశంతో నేరుగా చల్లిస్తున్నారు. దీంతో కార్మికులు చేతులకు గ్లౌజ్‌లు వేసుకున్నప్పటికీ చర్మం కమిలిపోతూ కాలిపోయిన మాదిరిగా అవుతుండడంతో పారిశుధ్య కార్మికులు అవస్థలు పడుతున్నారు. ఇకనైనా శరీరం మొత్తం కప్పుకునేలా ప్రత్యేక దుస్తులు అందించాలని కోరుతున్నారు. బ్లీచింగ్ పౌడర్ కారణంగా జనగామ జిల్లా పరిధిలో వంద మందికి పైగా కార్మికులకు గాయాలైనట్లు తెలుస్తోంది.

## కరోనా వైరస్‌పై నిట్ ప్రొఫెసర్ల పరిశోధన



సౌమ్య లిప్సారాత్



కిషాంత్‌కుమార్

**కాజీపేట అర్బన్:** ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ (కోవిడ్19) తీరుతెన్నులను కనుగొనేందుకు అంతర్జాతీయ స్థాయిలో జరిగే పరిశోధనలకు వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేటలోని నిట్ బయో టెక్నాలజీ విభాగానికి చెందిన ప్రొఫెసర్లు డాక్టర్ సౌమ్యలిప్సారాత్, డాక్టర్ కిషాంత్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సౌమ్య, కిషాంత్ శనివారం 'సాక్షి'తో మాట్లాడుతూ, 'అమెరికాకు చెందిన కంప్యూటింగ్ కన్సార్టియం సంస్థ అంతర్జాతీయ స్థాయిలో కరోనాపై పరిశోధనలు చేపట్టేందుకు వారం క్రితం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ సంస్థకు మా ఆలోచనలపై పరిశోధనా పత్రం సమర్పించాం. ఆ సంస్థ మా పత్రాలను ఎంపిక చేసింది'అని తెలిపారు. అమెరికాకు చెందిన కంప్యూటింగ్ కన్సార్టియం సంస్థ కరోనా వైరస్‌పై పరిశోధనలు చేసేందుకు అనువుగా ల్యాబ్‌లు ఉన్న నాసా, ఐబీఎం, గూగుల్ క్లౌడ్, మైక్రోసాఫ్ట్, ఎంఐటీ యూనివర్సిటీ ఆఫ్ పిట్స్‌బర్గ్ ఒకే గొడుగు కిందకు వచ్చాయి. ఈ మేరకు ఆన్‌లైన్‌లోనే పరిశోధనలు చేయాల్సి ఉండగా నిట్ ప్రొఫెసర్లు శనివారం తమ ప్రాజెక్టును ప్రారంభించారు. వివిధ ఉష్ణోగ్రతల్లో వైరస్ ప్రభావం, దానిని అంతం చేసే అవకాశాలపై పరిశోధనలు చేశాక వ్యాక్సిన్ రూపొందించేందుకు అవకాశాలు సులువవుతాయి. ఏడాది పాటు ఈ పరిశోధనలు కొనసాగుతాయి.

# ముప్పేట దాడిలో విల విల!



మూసీ వరదలు (ఫైల్)

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| అంటువ్యాధికి తోడైన ఆకలి చావులు | స్పానిష్ వైరస్ బుసగొట్టినవేళ కలసిరాని కాలం | ఆలస్యంగా రుతు పవనాలు.. | 20 శాతం మేర తగ్గిన పంట దిగుబడులు | భారీగా పెరిగిన మృతుల సంఖ్య | వివరాలు తెలియనివ్వని నిజాం | బ్రిటిష్ పాలకుల సర్వేలో కానరాని దక్కన్ మృతుల వివరాలు | చనిపోయిన వారి సంఖ్య చాలా ఎక్కువని వెల్లడించిన అమెరికా పరిశోధకుడు | ఆపదవేళ పేదలకు ఉచితంగా భోజనం కూడా పెట్టని ఏడో నిజాం |

“ వందేళ్ల నాడు పుట్టిన స్పానిష్ వైరస్ దెబ్బకు మన దేశంలో 1.25 కోట్ల మంది చనిపోయారని బ్రిటిష్ ఎన్‌సైక్లోపీడియా చెబుతోంది. ఆ సంఖ్య గరిష్టంగా 1.75 కోట్ల వరకు ఉందని అమెరికాకు చెందిన మెడికల్ హిస్టోరియన్ జేఎం బారీ వెల్లడించారు. మహమ్మారి ధాటికి బలైనవారి సంఖ్యలో ఇంతటి వ్యత్యాసం కనిపిస్తోంది. దీనికి కారణం హైదరాబాద్ స్టేట్ పరిధిలో చనిపోయినవారి వివరాలను నాటి నిజాం ప్రభుత్వం తొక్కిపెట్టడం.. ఇలాగే మరికొన్ని సంస్థానాలు కూడా చేశాయి. ఫలితంగా బ్రిటిష్ ప్రభుత్వం వేసిన లెక్కలు తక్కువగా ఉన్నాయి. ”

**సాక్షి, హైదరాబాద్:** కోట్ల మందిని పొట్టన పెట్టుకుంటున్న వైరస్ ఓవైపు.. అప్పటికే కరువు విలయతాండవం చేస్తుండటంతో ఆకలి చావులు మరోవైపు.. రుతుపవనాలు బాగా ఆలస్యమై సాగును దెబ్బతీసిన కలసిరాని కాలం మరోవైపు.. ఇదీ అసలైన ముప్పేట దాడి అంటే.

1920.. సరిగ్గా వందేళ్ల కింద ఇదీ మన పరిస్థితి. ఇప్పుడు కరోనా వైరస్ పంజా విసిరినా.. దాని బారి నుంచి ప్రజలను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరు మనకు ఊరటనిస్తోంది. త్వరలోనే దాని బారి నుంచి మనం బయటపడతామనే ధీమాతో పాటు ఒక్క పేద కుటుంబం కూడా పస్తులుండని పరిస్థితి ఇప్పుడు ఉంది. కానీ నాటి పరిస్థితి ఎంత భయానకంగా ఉండేదో ఓ సారి తెలుసుకుందాం..

### ఇటు అంటు వ్యాధి.. అటు ఆకలి చావులు

ఏడో నిజాం.. నాడు ప్రపంచంలోనే అత్యంత ధనికుడు. హైదరాబాద్ నగరంలో అన్ని హంగులు ఉండాలని తాపత్రయపడి ఆధునికతకు ఆద్యుడయ్యాడు. కానీ ప్రజల సంక్షేమం అంతగా పట్టదన్న చరిత్రకారుల మాటలు నిజం చేసేలా వందేళ్ల నాటి పరిస్థితులు నిలిచాయి. 1918 నుంచి రెండేళ్ల పాటు స్పానిష్ వైరస్ ధాటికి జనం పిట్టల్లా రాలిపోయారు. అప్పటికే దక్కన్ పీఠభూమిపై ఆకలి కేకలు మిన్నంటాయి. 1890 నుంచి కరువు కరాళ నృత్యం చేస్తోంది. తరచూ ఏర్పడుతున్న కరువులో ఆకలి చావులు తీవ్రమయ్యాయి. దీనికి తోడు మూసీ వరదలు, గత్తర ప్రబలడం.. వెరసి అంతా గందరగోళంగా ఉంది. అదే సమయంలో మరోసారి కరువు పంజా విసిరింది. జనం తిండి లేక చనిపోతున్నతరుణంలో స్పానిష్ వైరస్ విరుచుకుపడింది. ఇటు ఆకలి చావులు, అటు అంటువ్యాధి మృతులు వెరసి.. దక్కన్ పీఠభూమి శవాల దిబ్బగా మారింది. అక్కడితో ప్రకృతి కడుపు మంట తీరలేదు. వైరస్ ప్రభావం తగ్గుతోందనుకుంటున్న తరుణంలో అదే సమయంలో రుతు పవనాలు ఆలస్యంగా రావటంతో కాలం కలసిరాలేదు. దీంతో ఏకంగా 20 శాతానికంటే ఎక్కువ మేర దిగుబడులు తగ్గిపోయాయి. ఇది దేశవ్యాప్తంగా కనిపించింది. దీనివల్ల ఒక్కసారిగా ధరలు భగ్గుమన్నాయి. రెండేళ్ల పాటు ఈ పరిస్థితి కొనసాగింది.

### మృతుల వివరాలు వెలుగు చూడనివ్వని నిజాం

ఆకలి చావులు, అంటువ్యాధి మృతులు హైదరాబాద్ సంస్థానంలో అధికంగా నమోదయ్యాయి. కానీ ఈ మృతుల వివరాలు బయటి ప్రపంచానికి నిజాం తెలియనివ్వలేదు. స్పానిష్ వైరస్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా చనిపోయినవారిలో 43 శాతం భారతీయులే కావటంతో ఇక్కడి మృతుల సంఖ్యపై యావత్తు ప్రపంచం దృష్టిపెట్టింది. చనిపోయిన వారి వివరాలను సేకరించే బాధ్యతను నాటి బ్రిటిష్ పాలకులు కొందరు నిపుణులకు అప్పగించారు. వారు దేశవ్యాప్తంగా వివరాలు సమీకరించారు. కానీ నిజాం మాత్రం తన పరిధిలో చనిపోయిన వారి లెక్కలు ఇచ్చేందుకు నిరాకరించాడు. అపర కుబేరుడిగా, హైదరాబాద్ సంస్థానాన్ని ఆధునిక ప్రాంతంగా, అన్ని వసతులతో అభివృద్ధి చేస్తున్నట్లు పేరు గడించాలన్నది ఆయన ఆరాటం. ఆ పాలనకు ఈ మృతుల లెక్కలు మచ్చలా మిగిలిపోతాయని భయపడ్డట్టు చరిత్రకారులు చెబుతారు. అందుకే బ్రిటిష్ పాలకులు వేసుకున్న లెక్కలు చాలా తక్కువగా ఉన్నాయని అమెరికా కోడై కూసింది. బ్రిటిష్ ఎన్‌సైక్లోపీడియాలో ఇప్పటికీ ఈ'తప్పుడు' లెక్కలే ఉన్నాయి. ఈ మరణాలపై తదుపరి ఇతర పరిశోధకులు వెలువరించిన పుస్తకాల్లో లెక్కలు ఎక్కువగా కనిపించడానికి ఇదే కారణం. అమెరికాకు చెందిన మెడికల్ హిస్టోరియన్ జేఎం బారీ చూపిన లెక్కల్లోని గరిష్ట మొత్తం అంత ఎక్కువగా ఉండటానికీ ఇదే కారణం.

### ఉచిత భోజనాలు పెట్టాల్సిందే

అంటు రోగం, కరువుకాటకాలతో అతలాకుతలమైన సమయంలో పేదలను ఆదుకునేందుకు ప్రభుత్వాలు ముందుకు రావాల్సిందే. కానీ నిజాం ఆ పని చేపట్టలేదని తెలుస్తోంది. హైదరాబాద్ సంస్థానం పరిధిలో ఆకలితో ఎంతోమంది అలమటిస్తూ తనువు చాలిస్తున్నా.. ఆయన ఖజానా నుంచి వారికి సాయం చేయలేదని చెబుతారు. విషయం తెలిసి ఈ ప్రాంత బ్రిటిష్ రెసిడెంట్ జోక్యం చేసుకుని నిజాంకు ఆదేశాలు జారీ చేయటంతో అప్పుడు ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేయించే చర్యలు ప్రారంభించారని చెబుతారు. అంటువ్యాధులకు చికిత్స కోసం వైద్య వసతి కొంత వరకు మెరుగ్గానే ఉన్నా.. పేదలను ఆదుకునే చర్యలు మాత్రం లేవనేది వారి మాట.

- కరోనా అనుమానిత లక్షణాలున్న వ్యక్తి మృతదేహాన్ని తరలించిన పోలీసులు
- 14 గంటలపాటు రోడ్డుపైనే అంబులెన్సులో ఉంచి చివరకు గాంధీకి తరలింపు
- పోలీసులకు తోడుగా నిలచిన ఓ సామాజిక కార్యకర్త





అంబులెన్స్‌లో మృతదేహాన్ని ఉంచిన దృశ్యం

# నో కరోనా టీం... ఓన్లీ పోలీస్..!

**హిమాయత్‌నగర్:** అచేతన స్థితికి చేరుకొని రోడ్డుమీదే ప్రాణాలు కోల్పోయిన ఓ వ్యక్తి మృతదేహం తరలించడానికి చివరికి పోలీసులే నడుంకట్టి శనివారం ఉదయం గాంధీ ఆసుపత్రికి చేర్చారు. కోవిడ్ టీం, జీహెచ్‌ఎంసీకీ పోలీసులు పలుమార్లు ఫోన్లు చేసినా స్పందించలేదు. పోలీసుల సమాచారం మేరకు ... శుక్రవారం రాత్రి బహదూర్(77) అనారోగ్యంతో చికిత్సకోసం యత్నించి రవాణా సాయం అందక లాలాపేటనుంచి గాంధీ ఆసుపత్రికి నడచి వెళ్లేందుకు యత్నించాడు. వయోభారంతో నారాయణగూడ శాంతి థియేటర్ ప్రాంతంలో పడిపోయాడు. లాలాపేటలోని ఓ మద్యం దుకాణంలో వాచ్‌మన్‌గా చేస్తున్న బహదూర్ కొద్దిరోజులుగా దగ్గు, జలుబు, శ్వాస ఇబ్బందితో బాధ పడుతున్నాడు. దగ్గరలోని పీహెచ్‌ఎంసీకి వెళ్లాడు. వారు కింగ్‌కోఠికి రిఫర్ చేశారు.అక్కడికి అంబులెన్స్‌లో గురువారం మధ్యాహ్నం వచ్చిన బహదూర్‌కు కరోనా లక్షణాలున్నాయని అనుమానించిన వైద్యులు గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. గాంధీకి వెళ్లేందుకు అంబులెన్స్ సౌకర్యం లేకపోవడంతో.. 108, 104కు సమాచారం ఇచ్చినా స్పందించకపోవడంతో కాలినడకన నారాయణగూడ శాంతి థియేటర్ ఏరియాకు గురువారం సాయంత్రం చేరుకున్న బాధితుడు నిస్సత్తువకు లోనయ్యాడు.ఇలా శుక్రవారం చనిపోయే వరకు రోడ్డుమీదే గడిపాడు.

**పోలీస్ అలర్ట్..14 గంటల ప్రయాస**

స్థానికులు మంచినీళ్లిస్తే తాగాడు, రోడ్డుపై కొందరు ఆహార పొట్లాలు ఇస్తే వాటితో కడుపు నింపుకున్నాడు. అలా సాయంత్రం 6.50 ప్రాంతంలో శాంతి థియేటర్ ఎదురుగా ఉన్న ఓ లేడీస్ హాస్టల్ గేట్ వద్ద రోడ్డుపై పడిపోయి ఉన్నాడు. స్థానికులు డయల్–100కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి 7గంటల ప్రాంతంలో అబిడ్స్ డివిజన్ ఏసీపీ బిక్షంరెడ్డి, సిబ్బంది చేరుకొని అనాథ మృతదేహంగా భావించి దాన్ని తరలించేందుకు సోషల్ వర్కర్ శ్రీనివాస్‌కు తెలిపారు. అతను వచ్చి బహదూర్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఎక్కించే క్రమంలో అతని జేబులో ఉన్న ప్రిస్క్రిప్షన్‌ను గుర్తించి కింగ్‌కోఠి వైద్యులు గాంధీకి రిఫర్ చేసినట్లు తెల్సుకున్నాడు. దీంతో మృతదేహాన్ని తరలించేందుకు ప్రత్యేకించిన కోవిడ్ బృందానికి, జీహెచ్‌ఎంసీకి.. పోలీసులు సమాచారమిచ్చినా వారు స్పందించలేదు. ఇలా శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం 9.30 వరకు వేచి చూసి రోడ్డుపై అంబులెన్సులోనే మృతదేహాన్ని ఉంచి, చివరికి తామే పూనుకొని గాంధీకి తరలించారు.అక్కడ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అతనికి కరోనా ఉన్నదీ లేనిదీ పరీక్షల అనంతరం వెల్లడికానుంది. పాజిటివ్ వస్తే అతనితో కాంటాక్ట్ అయిన వారందరినీ ఎలా గుర్తించాలనేది సమస్యగా మారింది.

# బండి లాక్ తీయకుంటే బ్యాటరీ డౌన్



### ఎక్కువ రోజులు వాహనాలు బయటకు తీయకుంటే..

- బ్యాటరీ దెబ్బతినే అవకాశం.. బ్రేక్‌లు, గాలిపీడనం చెక్ చేసుకోవాలి
- లాక్‌డౌన్ నిబంధనలకు వీలుగా కొద్దిసేపైనా బయటకు తీయాలి
- కార్లు, ద్విచక్ర వాహనదారులకు నిపుణుల సలహా సూచనలు

**సాక్షి, హైదరాబాద్:** నిత్యం రయ్యిన దూసుకుపోయే వాహనాలకు లాక్‌డౌన్‌తో ఎక్కడికక్కడ బ్రేక్ పడింది. లక్షలాది వాహనాలకు 'తాళం' పడింది. ప్రస్తుతం అత్యవసరమైతే తప్ప ఎవరూ బండి బయటకు తీయట్లేదు. రవాణాశాఖ అంచనాల మేరకు గ్రేటర్ హైదరాబాద్‌లోని సుమారు 55 లక్షల వాహనాల్లో 85 శాతం ఇళ్లకే పరిమితమయ్యాయి. లాక్‌డౌన్ మరికొంత కాలం పొడిగించే అవకాశం ఉన్న దృష్ట్యా వాహనాల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని రవాణా రంగ నిపుణులు, మెకానిక్‌లు సూచిస్తున్నారు. రోజూ కొద్దిసేపు బండి బయటకు తీయాలని, ఇంజన్, బ్యాటరీ, బ్రేకులు, టైర్లు, ఇంధన సంరక్షణ అంశాల పనితీరును పరిశీలించాలని అంటున్నారు.

### బ్యాటరీ బాగుండాలంటే..

ఎలాగూ బయటికెళ్లే అవకాశం లేదు. ఇంక బండి బయటకు తీయడమెందుకని చాలా మంది భావిస్తారు. పైగా పెట్రోల్, డీజిల్ ఆదా అవుతాయని అనుకుంటారు. కానీ రోజుల తరబడి వాహనాలు నడపకపోవడం వల్ల బ్యాటరీలు చెడిపోయి త్వరగా డిశ్చార్జి అవుతాయి. ఖరీదైన కార్లకు సైతం బ్యాటరీయే కీలకం. అకస్మాత్తుగా బ్యాటరీ డిశ్చార్జి అయిపోయి నడిరోడ్డుపై వాహనం ఆగిపోతే ఆ బాధెలా ఉంటుందో చెప్పక్కర్లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రోజులో కొద్దిసేపైనా బండిని బయటకు తీయాలి. లాక్‌డౌన్ నిబంధనలకు అనుగుణంగా కనీసం కిలోమీటర్ దూరం నడిపి తిరిగి ఇంట్లో పార్క్ చేసుకోవాలి. నిబంధనలు ఆ మేరకు కూడా అనుమతించకుంటే, కనీసం ఇంజన్ స్టార్ట్‌చేసి కొద్దిసేపు అలాగే ఆన్‌లో ఉంచాలి. ఏడాది దాటిన బ్యాటరీలైతే ఇంకా త్వరగా చెడిపోయే అవకాశం ఉంది కాబట్టి ఈ జాగ్రత్త అవసరం. బ్యాటరీలు చెడిపోతే ఏసీలో గ్యాస్ డిశ్చార్జి అయ్యే అవకాశం ఉంది. ఇక, రోజూ వాహనాన్ని శుభ్రంగా తుడవడం వల్ల తప్పు, మరకలు పట్టవు.

**బండి నడపకుంటే బ్యాటరీకి దెబ్బే**

వాహనాలను రోజుల తరబడి బయటకు తీయకపోవడం వల్ల బ్యాటరీలే మొదట దెబ్బతింటాయి. కొత్త వాహనాల్లో ఈ ఇబ్బంది వెంటనే రాకున్నా ఏడాది కంటే ఎక్కువ వినియోగంలో ఉన్న వాటిలో ఈ ఇబ్బందులొస్తాయి. రోజుకు ఒక్కసారైనా బండి స్టార్ట్ చేయాలి. ఏవైనా ఇబ్బందులుంటే రెగ్యులర్ మెకానిక్‌ను ఫోన్లో సంప్రదించి సలహా తీసుకోవాలి. ఆన్‌లైన్‌లోనూ మెకానిక్‌ల సలహా, సూచనలు లభిస్తాయి.

– ప్రభాకర్, సీనియర్ మెకానిక్, వీఎస్టీ

### ఎలుకలతో జాగ్రత్త..

- వాహనాలను ఎక్కువ రోజులు బయటకు తీయకపోతే ఇంజిన్ కూల్ అయిపోతుంది. అదే సమయంలో కార్ల బాయినెట్‌లోకి ఎలుకలు, బొద్దింకలు, ఇతర కీటకాలు చేరవచ్చు. ఇవి ఇంజిన్ కంపార్ట్‌మెంట్‌లో వైర్లను తెంచేసే ప్రమాదం ఉంది.
- తెగిపోయిన వైర్ల వల్లనే చాలావరకు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అవుతుంది. కాబట్టి రోజుకు ఒక్కసారైనా బాయ్‌నెట్ తెరిచి పరిశీలించాలి.
- వాహనాల్లో ఇంజిన్ ఆయిల్ లెవల్స్ ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి. వాహనాల సామర్థ్యం, తయారీకి అనుగుణంగా కనిష్ట, గరిష్ట స్థాయిలను అంచనా వేసుకోవాలి.
- టైర్ల నాణ్యత, మన్నిక, వాటి సామర్థ్యం మేరకు గాలిపీడనం (పీఎస్ఐ) ఉండేలా చూసుకోవాలి.
- ముఖ్యంగా కార్లలో ఒక్కోసారి హ్యాండ్ బ్రేక్స్ జ్యామ్ కావచ్చు. అలాంటి టెక్నికల్ సమస్యలు రాకుండా జాగ్రతలు తీసుకోవాలి.
- బైక్‌ల్లో పెట్రోల్ ఆఫ్‌లో ఉంచాలి. వాహనం బయటకు తీయనప్పుడు ఆన్‌లో ఉంచడం వల్ల ఇంధనం ఓవర్‌ఫ్లో అయ్యే ప్రమాదం ఉంది.
- బ్యాటరీ ఆధారిత వాహనాలను రోజూ కొద్దిసేపైనా బయటకు తీయాలి.
- ద్విచక్ర వాహనాలను స్టార్ట్ చేసేటపుడు మొదట సెల్ఫ్ స్టార్ట్ కంటే కిక్ స్టార్ట్‌ను ఉపయోగించాలి.
- బండి ఎండలో ఉంచితే ఇంధనం ఆవిరవుతుంది. టైర్లలో గాలి తగ్గిపోతుంది. కాబట్టి వాహనాలకు రక్షణ తొడుగులు వాడాలి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com